

ISALAANDHRA Phone No. 75301

Regd No. 203

విశాలాంధ్ర

703918


భారతీయ సౌందర్యాతిశయమునకు మరుపు.
కంచి
ధర్మవరం
బెనారస్
బెంగుళూరు
పట్టుచీరలకు
లక్ష్మీ జనరల్ స్టోర్సు గవర్నరుపేట విజయవాడ-2

సంచిక 22 సంపుటి 142 | విజయవాడ 6—8—72 ఆదివారం | 10 పేజీలు 20 పై.

భూపరిమితి బిల్లులోని లొసుగుల తొలగింపుకు ఆందోళన

ఆగస్టు 10-12 తేదీలలో ధర్నాలు, సత్యాగ్రహాలు జరపాలని జిల్లా సమితులకు శ్రీ తమ్మారెడ్డి పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 5

భూగరిష్ట పరిమితి బిలులోని లొసుగులనుతొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 15 న జరిగే మహాప్రదర్శనలకు ముందుగానే ప్రతిజిల్లా సమితి తక్షణమే ప్రదర్శనలు, సభలు, కరపత్రాల పంపిణీ, సత్యాగ్రహాలు, ధర్నాలు, ప్రధానికి, ముఖ్యమంత్రికి టెలిగ్రాములు పంపడం లాంటి అన్ని తరహాల ఆందోళనలను ప్రారంభించాలని ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ నేడొక పత్రికా ప్రకటన చేశారు.

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి యీనెల 10 నుండి 12 వరకు యిటువంటి ఆందోళనలు జరపాలని చొరవతో ముందుకువచ్చి యిదివరకే కార్యక్రమం తీసుకున్నదనీ, యితర జిల్లా సమితులుకూడ యీ తేదీలలో నిర్దిష్టమైన కార్యక్రమంతో కార్యాచరణకు దిగాలని ఆయన పేర్కొన్నాడు.

ఈ బిల్లు ప్రస్తుతం సంయుక్త సిఫారసుల సంఘం ముందు వుంది.

శ్రీ తమ్మారెడ్డి ప్రకటన పూర్తి పాఠం ఈ క్రింది విధంగా వుంది.

భూ గరిష్ట పరిమితి బిల్లులోని ప్రగతిశీల అంశాలను ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గం బలపరుస్తూనే, బిలులో భూ గరిష్ట పరిమితి చట్టాలను దెబ్బతీసే ప్రతికూల అంశాలున్నాయని స్పష్టంగా పేర్కొన్నది. ఈ ప్రతికూల అంశాల తొలగింపుకై ఆందోళన జరపాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఈ బిల్లులోని కొన్ని ప్రతికూల అంశాలు అన్ని జిల్లాలలోనూ భూగరిష్ట పరిమితి చట్టాల అమలును వెన్నుపోటు పొడిచేవిగా వున్నాయి ఉదాహరణకు, 1971 జనవరి 24 నుండి చట్టం అమలులోకి వస్తుందని బిల్లులోవుంది దీనివల్ల అంతకుముందు జరిగిన అక్రమ బదలాయింపులను ప్రశ్నించడానికి వీలుండదు. బిల్లులో పేర్కొన్న ట్రిబ్యునల్స్, భూపరిమితి చట్టాల అమలును నీరుగార్చేస్వభావంగలవి ఇటువంటి సాధారణ లొసుగుల తొలగింపుకై అన్నిజిల్లాలలో ఆందోళన చేయాలి

కాని ఈ బిల్లులోగల కొన్ని నిబంధనలు ఒకటి లేదా రెండుజిల్లాలు లేదాప్రాంతాలలో వ్యతిరేక ప్రభావాన్ని కల్గిస్తాయి. ఉదాహరణకు కొబ్బెరి, నిమ్మతోటలను మెట్టభూములుగానే పరిగణించాలని బిలులోగల నిబంధన తూర్పు గోదావరి, కడప, అనంతపురం జిల్లాలలో వ్యతిరేక ప్రభావం కలుగజేస్తాయి.

మొదటిపంటనీటిసాగుతోనూ, రెండవపంట నీటి సాగుతో కాకపోయినప్పటికీ లాభదాయంగానేవున్నప్పుడు, అటువంటిభూమిని రెండుపంటలరకం భూమినుండి మినహాయించడం ఒక పెద్దలొసుగు. ఇది మెట్ట ప్రాంతాల్లోని చాలామంది భూస్వాములు, పెద్దపెద్ద కమతాలను అట్టిపెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గ తీర్మానంలో తెలిపినట్లుగా ఈ బిల్లులో ఇంకా చాలా లోపాలు వున్నాయి. అందువల్ల మన ఆందోళన, బిల్లులోని నిబంధనలవల్ల ఆయా జిల్లాలలో వ్యతిరేక ప్రభావాలు కలిగించే లొసుగుల తొలగించడంపై కేంద్రీకరించాలి, ఇదే సమయంలో మనం బిల్లులోని సాధారణ లొసుగులపట్ల కూడా అశ్రద్ధ చూపకుండా, భూస్వాములకు రాయితీలు యిచ్చినటువంటి, స్థానిక ప్రజలు సులభంగా అర్థంచేసుకోగల, బిల్లు నిబంధనలపై కేంద్రీకరించాలి

భూ సంస్కరణల బిల్లులోని

లొసుగుల తొలగింపుకై విజయవాడలో సత్యాగ్రహం

10-12 తేదీలలో; కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కార్యవర్గ నిర్ణయం; 15 న ప్రదర్శన

విజయవాడ, ఆగస్టు 5

భూసంస్కరణల బిల్లులోని లొసుగులను తొలగించేందుకై, జిల్లాలో క్లిష్టమవుతున్న ఆహార సమస్యను గూర్చి ఆగస్టు 10, 11, 12 తేదీలలో విజయవాడలో సత్యాగ్రహం, 15 వ తేదీన పెద్ద ప్రదర్శన జరపాలని కృష్ణా జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గం నిర్ణయించింది. ఈ ఆందోళన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేసింది.

శ్రీ జి. ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం 4వ తేదీన విజయవాడలో జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన భూ కమతాల గరిష్ట పరిమితి బిల్లులోని ప్రజా వ్యతిరేకమైన అంశాలను, సెలక్టు కమిటీ దృష్టికి తీసుకురావడానికి పెద్ద యెత్తున ప్రజా సమీకరణ చేయవలసి వున్నది.

బిల్లులోని లోపభూయిష్టమైన అంశాలను సవరించాలని కోరుతూ ప్రజాబాహుళ్యం నుంచి సెలెక్టుకమిటీకి కార్డులు, టెలిగ్రాంలు పంపించవలసిందిగా గ్రామశాఖలను, పార్టీ కార్యకర్తలను కృష్ణాజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యవర్గం కోరుతూ తీర్మానించింది.

బిల్లులోని లోపభూయిష్టమైన అంశాలు భూసంస్కరణల ప్రధాన ఆశయాలనే దెబ్బ

(మిగతా 2వ పేజీలో)

"చూశావటే, మన దేశంలో స్వీపర్లుగూడా గ్రాడ్యుయేట్లైనవే ఎంత అభివృద్ధి సాధించాం ; ఇదిమనకు ఎంత గొప్పో "

సంయుక్త సిఫార్సుల సంఘ సమావేశం

హైదరాబాదు, ఆగస్టు 5

1972 ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల బిల్లుకు సంబంధించిన సంయుక్త సిఫారసుల సంఘం సమావేశం ఈ నెల 8 వ తేదీ మంగళవారం సాయంత్రం 3 గంటలకు ఈ నెల 9, 10 తేదీలలోనూ అసెంబ్లీలోని కమిటీ రూమ్‌లో జరుగుతుందని అసెంబ్లీ సెక్రెటేరియట్ నుండి ఒక ప్రెస్ నోట్ వెలువడింది.

సిమ్లా ఒప్పందం అమలు

ఇస్లామాబాద్, ఆగస్టు 5

సిమ్లా ఒప్పందం ఆమోదపత్రాలను స్విస్ రాయబారి జాక్వెస్ ఆల్బర్టు ఇక్కడి విదేశాంగశాఖ కార్యాలయానికి అందజేయడంతో గత అర్ధరాత్రికి ఒక గంట ముందు ఒప్పందం అమలులోకి వచ్చింది.

జూలై 15 వ తేదీన పాకిస్తాన్ తన ఆమోదం తెలుపుతూ భారత్‌కు పత్రాలు పంపింది జూలై 3 న సిమ్లాలో శ్రీమతి గాంధి, భుట్టోల మధ్య ఒప్పందం జరిగింది

ఈ ఒప్పందం మేరకు నేటినుండి 30 రోజులలోగా భారత పాకిస్తాన్‌లు తమ సైన్యాలను అంతర్జాతీయ సరిహద్దులకు ఉపసంహరించుకుంటాయి ఉపఖండంలో శాంతి సాధనకు నాందిగా ఈ చర్య తీసుకోబడుతుంది.

జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించి 1971 డిసెంబరు 17 నాటికాల్పుల విరమణ రేఖను వాస్తవాధీనరేఖగా రెండుదేశాలు గుర్తిస్తాయి. దీనిని ఏపక్కగాని ఏకపక్షంగా మార్చబోదు. ఈ రేఖనుఉల్లంఘించేందుకుబలప్రయోగం చేయరాదని ఇరుపక్షాలూ అంగీకరించాయి.

యుద్ధ ఖైదీలు, నిర్బంధితులైన పౌరులు కాశ్మీర్ సమస్య, దౌత్య సంబంధాల పునరుద్ధరణ మొదలైన అంశాలపై రెండు దేశాల ప్రతినిధులు తిరిగి కలుసుకొని చర్చిస్తారు.

వచ్చే నెలలో మరో శిఖరాగ్ర సభ జరగవచ్చు.

ఆగస్టు 7 న చర్చలు

పాక్‌కు భారత్ సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 4

అంతర్జాతీయ సరిహద్దులకు సైన్యాల ఉపసంహరణ. దాంతో పాటు జమ్మూ-కాశ్మీర్‌లో వాస్తవాధీనరేఖ నిర్ధారణకు సంబంధించిన విస్తృత సూత్రాలను చర్చించి నిర్ణయాలు చేసేనిమిత్తం సైనికకమాండర్ల స్థాయి అధికార్ల సమావేశాన్ని ఆగస్టు 7 వ తేదీన ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్ ప్రభుత్వానికి సూచించింది.

నూతనంగా ఏర్పాటు చేయబడిన ఉత్తర మండలం సైనిక కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ పి యస్. భగత్, భారత్ తరపున చర్చలలో పాల్గొనగలరని అభిజ్ఞవర్గాలద్వారా తెలుస్తున్నది.

చర్చలలో పాల్గొనే తన ప్రతినిధి పేరును సూచించవలసిందిగా భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను కోరింది.

చర్చలు ఇస్లామాబాద్‌లో జరుగవచ్చునని తెలుస్తున్నది.

ఉపాధ్యక్ష పదవికి మస్కీ పోటీ ?

వాషింగ్టన్, ఆగస్టు 5

అమెరికా ఉపాధ్యక్షపదవికి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఎడ్మండ్ మస్కీని అధ్యక్ష అభ్యర్థి మెక్‌గవర్న్ సూచించారు. దీనికి మస్కీ సుముఖత చూపారని ఆయన సన్నిహితవర్గాలు నిన్న తెలిపాయి

తప్పక చదవండి!

కమ్యూనిజం అంటే ఏమిటి ?

వెల : 0–75 పైసలు

రచయిత
చిన్మోహన్ సహనోబిస్

అనువాదం :
వై. విజయకుమార్

పోషలిజం, కమ్యూనిజాలను సులభంగా అర్థమయ్యేలా
భారతదేశ పరిస్థితులను ఉదహరిస్తూ వివరించారు.

పోస్టేజి అదనం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్ విజయవాడ-2
విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్

వియత్నాం ప్రతినిధులతో అనధికార చర్చలు

పారిస్, ఆగస్టు 5

"కమ్యూనిస్టులతో" సైగాన్‌కు చెందిన ప్రైవేటు గ్రూపు అనధికార రాజకీయ చర్చలు జరుపుతున్నదని కీలుబొమ్మ ప్రభుత్వాధికారి నిన్న ఇక్కడ చెప్పారు.

అయితే, వారు తాత్కాలిక విప్లవ ప్రభుత్వ 7 అంశాల కార్యక్రమానికిదృఢంగా కట్టుబడి వున్నారని ఆ అధికారి వివరించిన దానిని బట్టి తెలియవచ్చింది.

పారిస్‌లో వియత్నాం ప్రతినిధి వర్గంతో సైగాన్ గ్రూపుకు అధికారికమైన సంబంధాలు లేవని కీలుబొమ్మప్రతినిధులకు చెందిన ట్రియుడాన్ చెప్పారు.

వాలెస్‌పై కాల్పులు జరిపిన వ్యక్తికి 63 ఏళ్ళు జైలు శిక్ష

మార్ల్‌బరో (మేరిలాండ్), ఆగసు 5

అలబామా గవర్నర్ జార్జి వాలెస్, మరొక ముగ్గురిపై కాల్పులు జరిపినట్లు నిరూపించబడిన ఆర్థర్ బ్రెమర్ (21 సంవత్సరాలవయసువాడు)కు నిన్న 63సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

అసలు బ్రెమర్‌కు 123 సంవత్సరాల శిక్ష వేసేవారు కాని అతను స్కిజోఫ్రినియా వ్యాధితో బాధపడుతున్నాడనీ, మతిభ్రమించిన వ్యక్తి అనీ డిఫెన్సు న్యాయవాది చెప్పారు అరగంట వాదనల తర్వాత కోర్టుతీర్పు యిస్తూ 63 ఏళ్ళ జైలుశిక్ష విధించింది.

కోలుకున్న ముజిబ్

లండన్, ఆగస్టు 5

బంగ్లా ప్రధాని ముజిబ్ గత ఆదివారం ఆపరేషన్ తర్వాత కోలుకున్నారు. మొన్న రాత్రి హాయిగా నిద్రపోయారు. నిన్న తన గదిలో కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.

స్వరణ్ సింగ్ గుయానా పయనం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ గత రాత్రి ఇక్కడ నుండి గుయానా బయలుదేరారు ఆగస్టు 8 వ తేదీ నుండి అక్కడ జరగనున్న అలీన దేశాల విదేశాంగ మంత్రుల సభలో ఆయన పాల్గొంటారు.

శ్రీలంక హోం మంత్రి. విదేశీ వ్యవహారాలలో ప్రధాని సలహాదారు అయిన ఫెలిక్స్ డయాస్ బండారునాయకే గత రాత్రి కొలంబో నుండి గుయానా బయల్దేరారు. హిందూ మహాసముద్రాన్ని "శాంతి మండలం"గా ప్రకటించాలనే లక్ష్యానికి తోడ్పాటు సంపాయించడం ఈ మహాసభలో శ్రీలంక ప్రధాన లక్ష్యం.

మైసూరు భూ పరిమితి బిల్లు

అసెంబ్లీలో ప్రతిపాదన

బెంగుళూరు, ఆగస్టు 5

మైసూర్ భూసంస్కరణల (సవరణ) బిల్లును రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ యస్. హుచమస్తిగౌడ నేడు శాసనసభలో ప్రవేశ పెట్టారు

రెండు పరిపంటలు పండే భూములపైనా, చెరకుపండే భూములపైనా 10 ఎకరాలు పరిమితి విధించబడింది నదులక్రింద పెద్దపెద్ద చెరువులక్రింద సాగుచేయబడే ఒక పంట పండే భూములకు 15 ఎకరాలు పరిమితి విధించబడింది. చిన్న తరహా చెరువులక్రింద వుండే మాగాణి భూములపై 18 ఎకరాలు, వర్షాధార మాగాణిభూములపై 25 ఎకరాలు పరిమితి విధించబడింది.

మెట్ట భూములపై వర్షపాతాన్నిబట్టి, 36, 45, 54 ఎకరాలుగా పరిమితి నిర్ణయించబడుతుంది.

ఈ బిల్లులోని నిబంధనలు వెంటనే అమలులోకి వస్తాయి.

గత 5 సంవత్సరాలలో. వరుసగా ఐదు సంవత్సరాలు వ్యవసాయేతర వనరులనుండి సంవత్సరానికి 12 వేలు నికరమైన హామీగల ఆదాయం గలవారు, భూములను స్వయంగా సాగు చేయనివారు భూములు కలిగివుండటాన్ని ఈ బిల్లు నిషేధిస్తుంది.

వ్యవసాయేతర వనరులనుండి కుటుంబ సభ్యులందరికి వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ఈ బిల్లు వల్ల 4 లక్షల ఎకరాల మిగులు భూములు లభ్యమవుతాయని ప్రభుత్వం భావిస్తూంది

భార్య, భర్త, ముగ్గురు మైనర్ పిల్లలు ఒక కుటుంబంగా బిల్లులో నిర్వచించబడింది. 5 గురు సభ్యులకంటే ఎక్కువమంది కలిగిన కుటుంబంలో, అదనంగా వున్న ప్రతి సభ్యుడు 2 ఎకరాలు "ఎ" తరగతి భూమి కలిగి వుండవచ్చు. అయితే ఎట్టి పరిస్థితులలోనూ ఒక కుటుంబం 20 ఎకరాలు "ఎ" తరగతి భూమిని మించి కలిగి వుండటం అనుమతించబడదు.

సహకార వ్యవసాయ సొసైటీలను ఈ పరిమితినుంచి మినహాయించబడినవి అయితే యిటువంటి సొసైటీలలో సభ్యులైనవారు కలిగివున్న భూములు, పరిమితి విధించేటప్పుడు స్వంత భూములుగానే పరిగణించబడతాయి

ప్రస్తుతం అమలులోవున్న మినహాయింపులన్నీ రద్దు చేయబడ్డాయి.

శాసనమండలి వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 4

రాష్ట్ర శాసనమండలి నేడు నిరవధికంగా వాయిదా పడింది

భూపరిమితి బిల్లును జాయింట్ సెలెక్టు కమిటీకి నివేదించేముందు, బిల్లుపై స్వల్ప చర్చ జరిపిన అనంతరం శాసన మండలి వాయిదా పడింది.

భారత్‌తో ఘర్షణకు పాక్ స్వస్తి చెప్పాలి

– గాంకోవేస్కీ

మాస్కో, ఆగస్టు 5.

పాకిస్తాన్ ప్రగతి సాధించాలంటే భారత్‌తో సంఘర్షణకు స్వస్తి చెప్పడం 'చాలా ముఖ్యమైనది'ని సోవియట్ పాక్ సాంస్కృతిక సంబంధాల ఉపాధ్యక్షుడు శ్రీ యూరి గాంకోవేస్కీ "మాస్కో న్యూస్" వార పత్రికలో వ్రాశారు.

పాకిస్తాన్ స్వాతంత్ర్యలో 25 వ వార్షికోత్సవ సందర్భంగా యీ వ్యాసం వ్రాయబడింది. ప్రపంచ రాజకీయపటంలో పాకిస్తాన్ ఆవిర్భవించినపుడు ఆప్రాంతంలో బ్రిటిష్ ఆధిపత్యంవల్ల ఆదేశానికి వలస ఆర్థిక వ్యవస్థవుంది. నూతన దేశం బలహీనతలను సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారీవర్గాలు వాడుకున్నాయి. సైనిక కూటములలో పాకిస్తాన్ ప్రవేశించడంతో అది ఏకపక్ష రాజకీయ వైఖరి వహించింది అంతర్జాతీయరంగంలో వేరుపడిపోయింది.

మొత్తం మీద స్వతంత్ర పురోభివృద్ధికై కాంక్ష మరింత పెరుగుతుంది. దాని అవసరం కనిపించడం తథ్యంఅని గాంకోవేస్కీ తెలిపారు. స్వతంత్ర దోరణులకు ఉదాహరణగా" వియత్నాంలో అమెరికా దురాక్రమణను బలపరచడానికి" పాక్ నిరాకరించడం, "దురాక్రమణ పూరితమైన సీటో కూటమి నుండి ఉపసంహరించుకుంటున్నట్లు భుట్టో ప్రకటించడం" మొదలైన చర్యలను పేర్కొన్నారు.

ఈజిప్ట్ లిబియా విలీనం: అరాఫత్ హర్షం

కైరో, ఆగస్టు 5

ఈజిప్ట్ లిబియా విలీనం ముఖ్యంగా పాలస్తీనాగెరిల్లా ఉద్యమంపై సానుకూలమైన ప్రభావం" కలిగిస్తుందని పాలస్తీనా విముక్తి ఉద్యమనాయకుడు యాసర్ అరాఫత్ అన్నారు.

గురువారంనాడు ఆయన చేసిన ప్రకటనను పశ్చిమాసియావార్తాసంస్థ ప్రకటించింది.

ఖమ్మం కళాశాల విద్యార్థుల రిలే నిరాహార దీక్ష

ఖమ్మం, ఆగస్టు 5

ఖమ్మం కళాశాల విద్యార్థి యూనియన్ కార్యదర్శి శ్రీ కృష్ణమూర్తిని అకారణంగా కాలేజీనుంచి తొలగిస్తూ ప్రిన్సిపాల్ తీసుకున్న చర్యకు నిరసనగా గత 3 రోజుల నుంచి విద్యార్థులు జరుపుతున్న సమ్మె నేడు రెండవదశకు చేరుకుంది

కొంతమంది ప్రముఖుల సలహామేరకు విద్యార్థులు సమ్మెను అపుచేసి నేటినుండి రిలే నిరాహారదీక్షను ప్రారంభించారు.

కాలేజి గేటుముందు నేడు రిలే నిరాహార దీక్షలో శ్రీయుతులు కృష్ణమూర్తి, యస్ సోమేశ్వరరావు, యన్. అప్పారావు, షేక్ మదార్‌సాహెబ్, పి. సాయిబాబా పాల్గొన్నారు.

అనేకమంది విద్యార్థులు నిరాహారవ్రతులకు పూలమాలలు వేశారు.

కమ్యూనిస్టు నాయకుల పరామర్శ

నిరాహారదీక్ష జరుపుతున్న విద్యార్థులను జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ పి. నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి శ్రీ వి. వెంకటపతి పరామర్శించారు.

విద్యార్థి నాయకుడు శ్రీ కృష్ణమూర్తిని తిరిగి కాలేజిలో చేర్చుకునేందుకు జోక్యం చేసుకోవలసిందిగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వందలాది విద్యార్థులు నిరాహారదీక్ష శిబిరంవద్ద వున్నారు.

ప్రిన్సిపాల్ వైఖరి

విద్యార్థి ఫెడరేషన్ ఖండన

హైదరాబాద్, ఆగస్టు 5

ఖమ్మంఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల విద్యార్థి యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణమూర్తిని తొలగిస్తూ ప్రిన్సిపాల్ తీసుకున్న చర్యను రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ అజీజ్‌పాషా నేడిక్కడ ఒక ప్రకటనలో ఖండించారు

ఆ ప్రకటనలో ఇంకా యిలా వుంది:

కాలేజీకి విద్యార్థుల ఫలితాలను గురించి ప్రిన్సిపాల్‌ను వాకబు చేసేందుకు, విద్యార్థి యూనియన్ ఎన్నికలను నిర్వహించేందుకు వసూలుచేసిన నిధిని, ఎన్నికలు జరపనందువల్ల ఆ నిధిని వాపసు చేయమని అడిగేందుకు శ్రీ కృష్ణమూర్తి ప్రిన్సిపాల్‌వద్దకు వెళ్ళగా ప్రిన్సిపాల్ పై చర్య తీసుకున్నారు.

ఈ ప్రిన్సిపాల్ జనసంఘ్ మద్దతుదారు ఇటీవల పంజాబ్‌లో జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ మహాసభలో పాల్గొన్నాడు. మతతత్వ సంస్థల మహాసభలో ప్రిన్సిపాల్ పాల్గొన్నందుకు నిరసనగా శ్రీ కృష్ణమూర్తి సమ్మె పోరాటాన్ని నిర్వహించారు

విద్యార్థుల పట్ల ప్రజాతంత్ర వ్యతిరేక వైఖరి ప్రదర్శించటాన్ని విద్యార్థి ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తూంది. ప్రిన్సిపాల్ అవలంబిస్తున్న పగ తీర్చుకునే వైఖరిని కూడా విద్యార్థి ఫెడరేషన్ ఖండిస్తున్నది.

తమ నాయకుని తిరిగి కాలేజిలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కాలేజి విద్యార్థులు జరుపుతున్న సమ్మెను విద్యార్థి ఫెడరేషన్ బలపరుస్తున్నది.

కాలేజీని బహిష్కరించిన విద్యార్థులను అభినందిస్తూ, తమ న్యాయమైన కోర్కెల కోసం ఖమ్మం కాలేజి విద్యార్థులు జరుపుతున్న ఆందోళనను బలపరచవలసిందిగా విద్యార్థి లోకానికి శ్రీపాషా విజ్ఞప్తి చేశారు.

రూర్కెలా ఉక్కుఫ్యాక్టరీకి రు. 10 కోట్లు లాభం

—మేనేజర్ అగర్వాల్ వెల్లడి

భువనేశ్వర్, ఆగస్టు 5

పబ్లిక్ రంగంలోవున్న రూర్కెలా ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రు. 10 కోట్లు లాభాన్ని ఆర్జించగలదని. ఫ్యాక్టరీ మేనేజర్ డా॥ సి. యల్. అగర్వాల్ నిన్న రాత్రితెలియజేశారు.

పత్రికలవారితో మాట్లాడుతూ ఫ్యాక్టరీ యింతవరకు పొందిన మొత్తం నష్టం రు. 30 కోట్లు, రానున్న రెండుమూడు సంవత్సరాల్లో తీరిపోతుందని తెలిపారు.

ఫ్యాక్టరీ విస్తరణ ప్రతిపాదనలు పరిశీలనలో వున్నాయన్నారు.

1972 73 సంవత్సరంలో 12½ లక్షల టన్నుల దిమ్మెల రూపంలోవున్న ఉక్కును ఫ్యాక్టరీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొన్నదని తెలిపారు

విద్యుత్ కోతవిధింపువల్ల వివిధరూపాల్లో ఉక్కు ఉత్పత్తికి నష్టంవాటిల్లుతున్నదని, ఈ పరిస్థితి ఫిబ్రవరి నుండి మరింత తీవ్రం వుంటున్నారు.

ఒరిస్సా ఎలక్ట్రిసిటీ బోర్డు రోజుకు 60 మెగావాట్లు విద్యుత్ సరఫరా చేయాల్సి వుండగా, 40, నుండి 45 మెగావాట్లుమాత్రమే సరఫరా చేస్తున్నదని ఆయన తెలిపారు.

వియత్నాంలో ఆనకట్టలపై బహాటంగ అమెరికా దాడులు

సెనెట్‌లో కెన్నెడీ ప్రభృతుల తీవ్ర విమర్శ

వాషింగ్టన్, ఆగస్టు 5

ఉత్తర వియత్నాం ఆనకట్టలపై నిక్సన్ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా బాంబుదాడులు చేస్తున్నదని ఎడ్వర్డ్ కెన్నెడీ తదితర డెమొక్రటిక్ సెనేటర్లు నిన్న తీవ్రంగా విమర్శించారు.

ఉత్తర వియత్నాంలో డామ్‌లు, ఆనకట్టలు ఇతర జలయంత్రాలపై అమెరికా బాంబుదాడులను వ్యతిరేకిస్తూ సెనేట్‌లో 9 మంది డెమోక్రాట్లు ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ జరిగింది.

"ఆనకట్టలపై బాంబుదాడి సమస్య సహజంగా, ప్రపంచమంతటా తీవ్ర ఆందోళన కలిగించింది" అని కెన్నెడీ అన్నారు. వియత్నాంలో అమెరికా పాత్ర గురించి ప్రపంచ ప్రజానీకానికి కొత్తగా, తీవ్రమైన సందేహాలు వస్తున్నాయని అన్నారు.

"శత్రువు అబద్ధాల" వలలో తాము చిక్కుకున్నట్టు ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని వారు ఖండించారు.

ఉత్తర వియత్నాంలో థాయ్‌బిన్ రాష్ట్రంలోని టీపుదీన్, థాయ్‌తూ ప్రాంతాల్లో సముద్రపు ఒత్తిడిని నిరోధించే ఆనకట్టను గత బుధవారం అమెరికా విమానాలు నాశనం చేశాయని హానోయ్ నుండి టాస్ విలేకరి నిన్న తెలిపారు ఎన్. హేయిన్ రాష్ట్రంలోని 'నామ్‌వాన్" డామ్‌లో ఒకభాగం అమెరికా బాంబుదాడుల్లో ధ్వంసం అయింది.

బ్రెజ్నేవ్‌తో హుసాక్ భేటీ

మాస్కో, ఆగస్టు 5

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లియొనిద్ బ్రెజ్నేవ్, జెకోస్లొవేకియా కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి గుస్తావ్‌హుసాక్ నిన్న క్రిమియాలో సమావేశం జరిపి రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసే విషయం చర్చించారని టాస్ తెలిపింది.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 24 వ మహాసభ, జెకోస్లొవేకియా కమ్యూనిస్టుపార్టీ 14 వ మహాసభ సిద్ధాంత ప్రాతిపదికగ రెండు దేశాల అభివృద్ధికి దీర్ఘకాలిక పథకాల గురించి వారు ఏకస్వరం తెలుపుకున్నారు.



మన రాజకీయాలు

పార్లమెంటు సమావేశం: సిమ్లా ఒప్పందం: ధరల పెరుగుదల

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనాయి. సిమ్లా ఒప్పందంపైనా, ధరల పెరుగుదలపైనా ఉద్రిక్తపూరితమైన చర్చలతో మొదటిరోజు కార్యక్రమము విశేషంగా ప్రజల దృష్టిని ఆకర్షించింది.

సిమ్లా ఒప్పందంపై మన దేశంలోని ఏ పార్టీ వైఖరి ఏమిటో యిదివరకే స్పష్టమైంది. అనుకొన్నట్లుగానే భారత-పాక్ శిఖరాగ్రసమావేశానికి మొదటినుంచీ వ్యతిరేకంగా వున్న జనసంఘ్ సిమ్లా ఒప్పందం 'దేశద్రోహ'మని పెద్ద రగడ చేసింది. పార్లమెంటు లోపల స్వరణ్‌సింగ్ ప్రకటన చేస్తున్నప్పుడు ఆ పార్టీసభ్యులు ఒప్పందం ప్రతులను చించి వేయడం, స్పీకర్ స్థానంవైపు, అధికార పక్ష సభ్యుల వైపు విసరెత్తడం లాంటి అగడాలు చేయగా బయట సిమ్లా ఒప్పందం నిరసన ప్రదర్శన అంటూ ఒకటి నిర్వహించారు. అఖిలపక్ష కమిటీ అని పెద్ద ప్రచారంతో ప్రారంభమైన సిమ్లా ఒప్పంద వ్యతిరేక హడావుడి అంతా చివరికి జనసంఘంవారి స్వంత గొడవగా మారిపోయిందనీ, పార్లమెంటు లోపలి చర్చలు, బయట ప్రదర్శన నిరూపించాయి.

రాజస్థాన్ ఎడారుల్లో పార్టీ కార్యకర్తల ఎదుట, పత్రికా విలేకర్లు, ఫొటోగ్రాఫర్ల ఎదుట ఆక్రమిత సరిహద్దు ప్రాంతాలను ఒప్పందం ప్రకారం పాకిస్తాన్‌కు తిరిగి యివ్వటానికి వ్యతిరేకంగా 'సత్యాగ్రహం' తమాషా జరిపి వచ్చిన జనసంఘం అధ్యక్షుడు అటల్ బిహారీ వాజపాయ్, ప్రస్తుతం అజ్ఞాతవాసంలో వున్న ఆచార్య కృపలానీగారలు యీ ప్రదర్శనలో ప్రధాన వక్తలు. కొత్తగా చెప్పిన అంశాలు లేకపోయినా గుత్తపెట్టుబడిదారీ పత్రికల పుణ్యమా అని బాగానే ప్రచారం వచ్చింది.

అటల్ బిహారీ అబద్ధాల పుట్ట

రష్యా, అమెరికాల వత్తిడికి లొంగి సిమ్లా ఒప్పందానికి చివరి నిమిషాన భారతప్రభుత్వం ఒప్పుకొందనీ, యీ విషయం పార్లమెంటులోసోదాహరణంగా రుజువుచేస్తానని సవాళ్ళు విసిరిన అటల్ బిహారీ ప్రసంగంలో భద్రంగా దాచిపెట్టుకొన్న చవకరకపు 'స్వదేశీ టపాకాయలను' పేల్చడం జరిగింది. కాని తీరా పావం అవి తుస్సుమనేసరికి సమగ్ర విచారణ జరిపించటానికి పార్లమెంటరీ కమిటీ వేస్తే తేలుతుందని బుకాయించారు. సిమ్లా చర్చల సమయంలోబంగ్లాదేశ్‌లోని సోవియట్‌రాయబారి అక్కడవున్నారనీ, 'హాలిడే ఇన్'లో ప్రధాని మాస్కోతో సంప్రతింపులు జరిపారనీ, సోవియట్ అధ్యక్షుడు పొడ్గార్నీ హానోయ్‌వెళుతూ కలకత్తాలో ఆగినప్పుడు స్వరణ్‌సింగ్ సిమ్లా ఒప్పందం వివరాలు చర్చించారనీ వాజ్‌పాయ్ అభూత కల్పనలతో నీచమైన సోవియట్ వ్యతిరేక చెత్తనంతా వెళ్ళగక్కాడు. చర్చల సమయంలో సిమ్లాలో బంగ్లాలోని సోవియట్ రాయబారి కానీ మరో సోవియట్ దౌత్యాధికారిగాని లేడని స్వరణ్‌సింగ్ ఖండించేసరికి అప్పుడు అక్కడ పనిచేసిన టెలిఫోన్ ఆపరేటర్లను విచారిస్తే మాస్కోలో జరిపిన టెలిఫోన్ సంభాషణల విషయంతెలుస్తుందని మరో చవకబారువాదన చేశాడు. అసలు ఆ ఒప్పందానికి సంబంధించిన ఫైళ్ళనన్నిటినీ వెంటనే స్పీకర్ స్వాధీన పరుచుకోవాలనే హాస్యాస్పదమైన సూచన చేశాడు. అబద్ధానికి అనవాళ్ళెక్కువనీ అటల్ బిహారీ గోబెల్స్‌నుమించివ్యవహరించి యీచర్చల్లో విదూషకుడిగా బయటపడ్డాడు

ఇంత హడావుడి చేసి ప్రధాని చర్చకు సమాధానం చెపుతున్నపుడు సభలో లేకుండా చల్లగా జారుకొన్నాడు. భారత్-పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అలాగే కొనసాగాలని వాంఛించే కొన్ని దేశాల అభిప్రాయాలనే జనసంఘం ప్రతిబింబిస్తోందనీ, పాక్‌లోని సైనిక నియంతలు కూడా ప్రస్తుతం జనసంఘం వారిలాగానే వ్యవహరించేవారికి కాలం చెల్లినదై వీరికి వైఫల్యం తప్పదని శ్రీమతి గాంధీ విమర్శించారు.

అంతర్జాతీయ పరిణామాలు

అంతేకాదు. పాక్‌లో జరుగుతున్న అంతరంగిక పరిణామాలు, ఆసియాలో వస్తున్న మార్పులు, జాతీయ అసెంబ్లీలో భుట్టో ప్రదర్శించిన నిర్మాణాత్మక ధోరణిని సుకీర్తంగా ప్రస్తావించి ఆ దేశంలోని పరిస్థితులలో వస్తున్న మంచి పరిణామాలను ప్రోత్సహించే వైఖరి భారత్ తీసుకోవలసిందిగా ఆమె స్పష్టం చేశారు.

ఈ ప్రధానమైన అంశాన్నే కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ ఇంద్రజిత్ గుప్తా తన ప్రసంగంలో సరైన అంతర్జాతీయ భూమికలో సమర్థవంతంగా, వివరించారు. ఆసియా ఖండంలోని కొత్తగా విముక్తి చెందినదేశాలు యింతకాలంసామ్రాజ్యవాదుల ప్రపంచ వ్యూహంలో పావులుగా వినియోగపడుతూ వస్తూ యిప్పుడిప్పుడే ఆ విషకౌగిలి నుండి విడివడుతున్న శుభ పరిణామాలకు పాకిస్తాన్ ఘటనలు నిదర్శనమనీ, భుట్టో ప్రజలతో సంబంధం లేని సైనిక పాలకుడుకాదనీ, ప్రగతిశీల కార్యక్రమాలు చేబట్టుతాననే వాగ్దానంతో ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చిన రాజకీయ నాయకుడనే వాస్తవం విస్మరించరానిదని శ్రీ గుప్తా మొత్తం విషయాన్ని సమ్యక్ దృష్టితో విశ్లేషించారు.

కాంగ్రెస్ సభ్యులేకాక యితర పార్టీల వారు కూడా ఒప్పందాన్ని సమర్థించారు. కాగా సిండికేటు, మార్క్సిస్టుపార్టీ డి యం కెల అభ్యంతరమల్లా సిమ్లాచర్చలకుముందు ప్రధాని ప్రతిపక్షాలతో సంప్రతించలేదని, పార్లమెంటులో చర్చజరగకుండానే ఒప్పందాన్ని హడావుడిగా ప్రభుత్వం ధృవీకరింప చేసుకుందని మాత్రమే.

దీనికి జనసంఘం వైఖరికి స్పష్టమైన తేడా వున్నప్పటికీ అంతర్జాతీయ ఒప్పందాలు ధృవీకరించే రాజ్యాంగపరమైన ప్రక్రియకు భిన్నంగా సిమ్లా ఒప్పందం విషయంలో జరిగిందని వారు సహేతుకంగా నిరూపించలేకపోయారు.

ధృవీకరణ పద్ధతులు

మన రాజ్యాంగం నిర్దేశిస్తున్న పద్ధతి ప్రకారం అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకోవడం, ధృవీకరించటంఅనేఅధికారాలుపూర్తిగా రాష్ట్రపతికే దఖలు చేయబడినవి. పార్లమెంటు వీటినిచర్చించవచ్చు, తీర్మానం ద్వారా ఆమోదించవచ్చు, నిరాకరించవచ్చు. అంతేకాని రాష్ట్రపతి ధృవీకరించటానికి ముందుగా పార్లమెంటు చర్చించాలనే నిబంధనలేదు. అదే పాకిస్తాన్ రాజ్యాంగంలో ఇలాంటి అధికారం నేషనల్ అసెంబ్లీకి యివ్వబడింది. అలాగే అమెరికాలో అధ్యక్షుడు కుదుర్చుకొన్న ఒప్పందాల ధృవీకరణలో రాజ్యాంగరీత్యా సెనేట్‌కు కూడా పాత్ర ఉంది. ఈ విషయంలో వివిధ దేశాల రాజ్యాంగ పద్ధతులు విభిన్నంగావున్నపుడు ఒక దానిని మరొక దానితో మక్కీ మక్కీగా పోల్చడం సరైన పద్ధతి కాదు. భుట్టోపై విషం కక్కిన వాజ్‌పేయి సిమ్లా ఒప్పందాన్ని ధృవీకరించే ముందు ఆయన కూడా నేషనల్ అసెంబ్లీని సంప్రతించాడని, కాగా భారత్ ప్రభుత్వం అవలంబించిన వైఖరి ప్రజాస్వామ్య విరుద్ధమని వాదించడం హాస్యాస్పదమైంది. మొత్తంమీద పాక్ జాతీయ అసెంబ్లీ చర్చల్లో జమాయత్, యితర మతతత్వవాదులు కొద్దిమంది వ్యతిరేకించినప్పటికీ ఆమోదం పొందిన ఒప్పందానికి యిక్కడ జనసంఘంవారు ఉలిపికట్టెలా వ్యవహరించినప్పటికీ పార్లమెంటులో పెద్ద మద్దతు లభించింది.

సిమ్లా ఒప్పందంలో భాగమైన పశ్చిమ రంగంలో సరిహద్దులనుండి ఉభయదేశాల సైన్యాల ఉపసంహరణ, కాశ్మీర్‌రంగంలో వాస్తవాధీన రేఖ నిర్ధారణ ఒకేసారి జరగాలని లోక్‌సభలో స్వరణ్‌సింగ్ విస్పష్టంగా ప్రకటించారు.

దీనికి సంబంధించిన వివరాలను, పద్ధతిని చర్చించటానికి ఉభయదేశాల సైన్యాధికారులు త్వరలో సమావేశం కానున్నారు.

ధృవీకరణకు సంబంధించిన నిబంధనలు యిప్పుడు పూర్తి అయినవి కనుక యీసుహృద్భావ వాతావరణంలో ఒప్పందం అమలుకు తీసుకోవలసిన చర్యలు వివిధ స్థాయిల్లో ఆరంభమవుతాయని ఆశించవచ్చు.

తీవ్రమవుతున్న ధరల పరిస్థితి

ధరల పెరుగుదలపై లోక్‌సభలో మొదటి రోజున సావధాన తీర్మానం, వాయిదా తీర్మానాలు ప్రతిపాదించబడినాయి. దురదృష్టవశాత్తు దేనికి ప్రాధాన్యత యివ్వాలనే అంశంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించబడి వాగ్వాదాలు, చర్చ జరిగి చివరికి కొందరి వాకౌట్‌తో అసలు సమస్య తీవ్రత తగినంతగా వ్యక్తం కావటానికి అస్కారం లేక పోయింది. ఆ జరిగిన కొద్ది పాటి చర్చ, మంత్రి సమాధానాల్లోనే ధరల పెరుగుదలవల్ల దుర్భరమైన సామాన్యుల దురవస్థ రేఖామాత్రంగా సూచింప బడింది.

1971 మార్చినాటికి ఇప్పటికీ, ముఖ్యంగా 1972 మార్చి నుండి పెరిగిన ధరలు చూస్తోంటే జీవితావసర వస్తువుల సరఫరాపై ప్రభుత్వానికి అసలు అదుపు వుందా అనిపిస్తుంది

అనావృష్టి మొదలైన ప్రకృతిపరమైన కారణాలను పేర్కొనటంతోపాటు జీవితావసర వస్తువుల ధరల అదుపుకై ఏదో వున్నతస్థాయియంత్రాంగంఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో వుందని ఆర్థికమంత్రి శ్రీ చావన్ చెప్పిన సమాధానం ఎవరినీ సంతృప్తిపరచలేదు దీనికై ప్రణాళికామంత్రి శ్రీ ధార్, సంఘ సభ్యుడు డా. బి యస్. మిన్హాస్ తదితరులతో కూడిన ఒక వుపసంఘం వేసినట్లు కూడా ఆయన చెప్పారు.

కాని మిగులు రాష్ట్రాలని చెప్పబడు ఆంధ్రప్రదేశ్‌తో సహా పన్నెండు రాష్ట్రాలలో అనావృష్టి, కరువు పరిస్థితులు ఏర్పడినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిగారు స్వయంగా అంగీకరించారు. యీ తీవ్ర పరిస్థితిలో ఉపసంఘాలు, ప్రతిపాదనలు, పరిశీలనలు పూరట కలిగిస్తాయా?

1950 నుండి యిప్పటికి రూపాయి కొనుగోలుశక్తి దాదాపు సగానికి పడిపోయినట్లు చావన్‌గారే చెబుతున్నారు కోట్లాదినిరుద్యోగుల సంఖ్య చెప్పనక్కరలేదు.

మరోవైపు సస్యవిప్లవం సద్యఃఫలితాలను యిచ్చిందని జరుగుతున్నప్రచారాన్ని ప్రస్తుత పరిస్థితి వెక్కిరిస్తున్నట్లుంది.

అధికోత్పత్తి ఎవరికి దక్కింది?

ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎరువులు, కొత్త వంగడాలతో సాధించిన అధికోత్పత్తి ఎవరి అధీనంలో వుంది? ధనికరైతుల ప్రయోజనాలు వచ్చేసరికి సబ్సిడీ ధరలు, సపోర్టు ధరలు ప్రకటించే ప్రభుత్వానికి వినిమయదారుల గోడు పట్టదా? అసంఖ్యాకులైన చిన్న ఉత్పత్తిదార్లను వినిమయదార్లను దోపిడీ చేసేమధ్యదళారులను నిర్మూలించి ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం ఎందుకు జాతీయంచేయదు? పంపిణీ యంత్రాంగాన్ని ఎందుకు పటిష్టం చేయదు?

గుత్తపత్రికల యాజమాన్య వికేంద్రీకరణకు సంబంధించినబిల్లు ఈ సమావేశంలోనే వస్తుందని మొదట చెప్పారు తాజాగా సమాచారశాఖను తిరిగి స్వీకరించిన గుజ్రాల్ యిపుడు వచ్చే సమావేశంలో కాని రాదంటున్నాడు.

అలాగే ఉక్కు, యితర పరిశ్రమల్లో ఏర్పడిన యిబ్బందులు ఇన్కా ఘటనలు వెల్లడి అయినాయి. ఉత్పత్తి పేరిట పెట్టుబడిదారులకు ఎన్ని రాయితీ లిచ్చినా పారిశ్రామికోత్పత్తివేగంమందంగా వుంటున్నది.

ఆర్థిక రంగంలో సవాళ్ళను ఎదుర్కొనడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న మెతకదనం కంటికి కొట్టవస్తున్నట్లు వ్యక్తమౌతున్నది

జనసంఘం వారి పుణ్యమా అని జరిగిన యితరగొడవల్లో దానిపై దృష్టి కొంతవరకు తాత్కాలికంగా మరల్చగలిగినప్పటికీ యీ సమస్యలు [illegible]వాయిదా వేయదగినవి కావు.

—సి. రా.

మునగాలవద్ద ట్రాఫిక్ బంద్

సబ్ ఇన్స్పెక్టర్ చర్యవల్ల

హైద్రాబాద్. ఆగస్టు 5

విజయవాడ హైదరాబాద్ రోడ్‌పై, మునగాలకు రెండు మైళ్ళ దూరంలో గత రాత్రి దాదాపు 1-15 గంటలకు మునగాల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్‌చర్యవల్ల దాదాపు గంట పాటు ట్రాఫిక్ బంద్ అయిపోయి ప్రయాణీకులు చాలా యిబ్బందులకు గురయ్యారు

గ్లోబ్ ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీకి చెందిన ఎ. ఎ. టి. నెం. 65 లారీ హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తున్నపుడు మునగాల వద్ద సబ్ ఇన్స్పెక్టర్ దానిని ఆపాడు. "మామూలు" యివ్వమని డ్రైవర్‌ను అడిగాడు. డ్రైవర్ అందుకు తిరస్కరించి లారీ నడుపుకుంటూ వెళ్ళిపోయాడు. దీనితో ఆగ్రహం చెందిన సబ్‌ఇన్స్పెక్టర్ టాక్సీలో అతన్ని వెంబడించాడు. రెండు మైళ్ళ దూరంలో ఒక వంతెనవద్ద లారీకి టాక్సీని అడ్డంగాపెట్టారని సంఘటన జరిగిన ప్రాంతంలో విచారించగా తెలియవచ్చింది.

అడ్డంగా ఉన్న టాక్సీవద్ద లారీ ఆగిపోవడంతో హైదరాబాద్‌నుండి విజయవాడ వచ్చే దాదాపు 200 లారీలు, ఎక్స్‌ప్రెస్ ఆర్. టి. సి. బస్సులు ఇతర వాహనాలు నిలిచిపోయాయి.

సబ్‌ఇన్స్పెక్టర్ డ్రైవర్‌ను కొడుతూ, తిడుతూ మునగాల తీసుకు వెళ్ళాడు. కొందరు ప్రయాణీకులు మునగాల వెళ్ళి అతన్ని విడిపించుకు వచ్చారు. మునగాల నుండి డ్రైవర్ తిరిగి వచ్చేవరకూ బంద్ అయిన ట్రాఫిక్‌ను మరల పునరుద్ధరించ దానికి అరగంట పట్టింది.

ఇలాంటి ఘటనలు ఆ రోడ్‌పై మామూలైపోతున్నాయి

(వి. వి.)

విద్యాసంస్థలను స్వాధీనం చేయం

గోపాలకృష్ణపిళ్ళై బెదరింపు

కొట్టాయం, ఆగస్టు 5

కేరళలో ప్రధాన మతస్థులైన క్రిష్టియన్లు, నాయర్లు తమ విద్యాసంస్థలను స్వాధీనంచేస్తారని ప్రభుత్వం భావిస్తున్నట్లయితే అది జరుగబోదని కేరళ ప్రైవేట్ కాలేజి యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కె గోపాలకృష్ణపిళ్ళై నేడిక్కడ చెప్పారు.

ఈ ఆందోళన తమపై రుద్దబడిందని, దానికి ప్రభుత్వమే ప్రధాన బాధ్యతవహించవలసివుందని ఆయనన్నారు.

"రాష్ట్ర జనాభాలో నాయర్లు, క్రిష్టియన్లు 50 శాతం మంది వున్నారు. ఈ 50 శాతం మంది ఆందోళనను ప్రారంభిస్తే ప్రభుత్వం ఎంతవరకు ప్రతిఘటన యిస్తుంది? అప్పుడు ఈ రెండు మతాల నాయకులు కూడా పరిస్థితిని అదుపులోకి తేరు అని ఆయన బెదిరించారు

రాజ్యాంగంలో గ్యారంటీ కల్పించబడిన ప్రాథమిక హక్కులను వదులు కునేందుకు మేము సిద్ధంగా లేము అని అయ నన్నాడు.

విద్యార్థి నాయకుని ప్రకటన

కేరళలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న "విద్యా బంద్"ను విద్యార్థి లోకం ప్రతిఘటిస్తుందని కేరళ యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ అధ్యక్షుడు శ్రీ టి రాధాకృష్ణన్ నేడు తిరువనంతపురంలో చెప్పారు

కాలేజీలలో ఏర్పడిన ప్రతిష్టంభనను స్కూళ్ళకు కూడా విస్తరింప చేయాలన్న యాజమాన్యం నిర్ణయం ద్రోహపూరితమైనదని దీనివల్ల, ఉద్రిక్తత యింకా పెరుగుతుందని అన్నారు.

నూబాదీన్‌పై దాడి

సైగాన్, ఆగస్టు 5

రాజధాని సైగాన్‌కు వాయవ్యంగా 88కిలో మీటర్ల దూరంలో మాత్రమే వున్న నూబాదీన్ కొండపైగల అమెరికా రేడియో ప్రసార కేంద్రంపై నేటి తెల్లవారుఝామున 100 మంది విముక్తియోధులు మోర్టార్లు, రాకెట్లతో దాడి జరిపారు.

అమెరికా రేడియో నిపుణులకు రక్షణగా వున్న నలుగురు కీలుబొమ్మ సైనికులు హతమయ్యారు. 11 మంది గాయపడ్డారు

దక్షిణ వియత్నాం దక్షిణ భాగం, కాంబోడియాలకు చెందిన అమెరికా కీలక కమ్యూనికేషన్‌లలో నూబాదీన్ అత్యంతప్రధానమైనది. వందలాది అమెరికా విమానాల నుండి ఇది వార్తలు సేకరిస్తుంది. వాటికి వార్తలు పంపుతుంది

అమెరికా స్థావరాలపై నే విముక్తి సేన అతిక్లిష్టమైన దాడులు జరపడం ఈవారంలో ఇది మూడవసారి.

సైగాన్ తర్వాత పెద్దదైన దానాంగ్ విమాన స్థావరం, సైగాన్‌కు ఉత్తరాన 24 కిలో మీటర్ల దూరంలోనే ఉన్న బీన్ హోవా లపై ఈ వారం విముక్తిసేన దాడులు జరిపింది.

నాంబోలో

దక్షిణాన నాంబో (మెకాంగ్ డెల్టా) ప్రాంతీయ రాజధాని బెన్‌ట్రీవద్ద విముక్తి సేన దాడిలో 26 మంది హతులయ్యారు గత కొద్ది రోజులుగా ఇక్కడి దీన్‌తువాంగ్ ప్రాంతాన్ని విముక్తిసేన ఎలాంటి ప్రతిఘటనా లేకుండా క్రమంగా ఆక్రమించుకుని సంఘటితపడిన విషయం పాఠకులకు విదితమే.

క్వాంగ్‌ట్రి మూడు ప్రక్కలా భీకర పోరాటం

క్వాంగ్‌ట్రి కోటనుండి విముక్తి సేనను వేరుచేయడానికి పశ్చిమానఉన్న థాక్‌హాన్ నదివైపు విముక్తి సేనను నెట్టివేయడానికి ప్రయత్నిస్తున్న కీలుబొమ్మ మెరైన్ దళాలు ఏమీ విజయం సాధించలేక పోతున్నాయని ఎ పి. విలేకరి తెలిపాడు

కోటకు ఉత్తర, తూర్పు, దక్షిణ దిక్కుల్లో ఇంటింటికీ పోరాటం సాగుతోందని ఆ విలేకరి వ్రాశారు

అన్‌లాక్ వద్ద

దక్షిణాన అన్‌లాక్ వద్ద అమెరికా నిర్మించిన బంకర్‌ను, హెవేవంతెనను తిరిగికీలుబొమ్మ రేంజర్లు గత గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సైగాన్ సైనిక వర్గాలు చెవుతున్నాయి

అన్‌లాక్ ముట్టడి గత ఆదివారంతో 4 నెలలకు చేరుకుంది త్వరలోనే ముట్టడి ఎత్తివేస్తామని వారు చెపుతున్నారు.

సత్యాగ్రహం

(1 వ పేజీ తరువాయి)

తీసేవిగా వున్నవి ముఖ్యంగా కృష్ణాడెల్టాలో ఒక కారు వరిపంట, రెండవకారు మినుము. పెసర, నువ్వు, ప్రత్తి, వేరుశెనగ మొదలైన పంటలు పండించే భూములను బిల్లులో ఒకకారు పంట భూములుగా చూపించడంవల్ల డెల్టా ప్రాంతంలో మిగులుభూమి లేకుండా పోయే ప్రమాదం వున్నది. పై తరహా భూములను రెండుకార్ల మాగాణి భూమిగా వర్గీకరించాలి

అలాగే మెట్టప్రాంతాల్లో గొట్టపుబావులు, మోటబావులు తదితర ప్రైవేటు జలాధారాల క్రింద సాగయ్యే భూములను బిల్లులో మెట్ట భూములుగా వర్గీకరించడం అన్యాయం ఈ తరహా భూములను స్వల్పమైన తేడాతో (వెయిటేజి) రెండు పంటల మాగాణిభూమిగా పరిగణించాలి. న్యాయమైన లావాదేవీల పేరుతో 1971 సం॥ జనవరి దరిమిలా జరిగిన బదలాయింపులకు చట్టంలో కల్పించబడిన అవకాశం, ఆచరణలో భూస్వాములు, తమ మిగులు భూములను దాచుకోవడానికి చేసిన అక్రమ బదలాయింపులకు రక్షణ కలగజేయడమే అవుతుంది కృష్ణాజిల్లాలో అనేక మంది భూస్వాములు యీ మధ్య కాలంలో అనేక వందల యకరాలను లాలూచీ క్రయవిక్రయాలను జరిపి అన్యాక్రాంతం చేశారు. అందువలన 1970 సం॥ జనవరి నుండి జరిగిన బదలాయింపు లన్నింటినీ ఎట్టి మినహాయింపు లేకుండా రద్దుచేస్తూ బిల్లును సవరించాలి

మన జిల్లాలో ఆహార పరిస్థితి చాలా ఆందోళనకరంగా పరిణమించినది. కాని ప్రభుత్వం జిల్లా అంతటికీ 145 డిపోలు తెరచి తనబాధ్యత తీరిపోయినట్లు నటిస్తోంది

ప్రభుత్వంయొక్క పట్టీపట్టని వైఖరిని కార్యవర్గం తీవ్రంగా గర్హిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తోంది.

ప్రతి పంచాయితీకి, పట్టణాలలో ప్రతి వార్డుకు ఒక చౌక బియ్యం డిపో తెరచి కిలో బియ్యం 1 రూపాయకు మించకుండా అమ్మించాలని ప్రభుత్వాన్ని కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి డిమాండు చేస్తోంది.

ఈ విధంగా బిల్లులోవున్న అనేక అభివృద్ధి నిరోధక అంశాలను సెలక్టుకమిటీ దృష్టికి తెచ్చి మార్చుటకు ఆహార సమస్యపై ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిరసనగానూ, ఆగస్టు 10, 11, 12 తేదీలలో విజయవాడలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున పికెటింగుచేయుటకు, జిల్లాలోని అన్ని ప్రాంతాలనుండి సత్యాగ్రహదళాలను సమీకరించుటకు నిర్ణయించడమైనది.

బిల్లులోని ప్రగతిశీల అంశాల పరిరక్షణకు, బిల్లులోని అనేక లొసుగులను ప్రజానుకూలంగా సవరించాలని కోరుటకు, బిల్లును మరింత దిగజార్చుటకు భూస్వాములు ప్రారంభించిన దాడిని త్రిప్పికొట్టుటకు విజయవాడలో ఆగస్టు 15 న కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల సంయుక్త నాయకత్వాన పెద్ద ప్రజాప్రదర్శన నిర్వహించాలని, జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యవర్గం నిర్ణయించింది 10, 11, 12 తేదీలలో జరుగు సత్యాగ్రహంలోను, 15 వ తేదీ జరుగు ప్రదర్శనలోను పాల్గొనుటకు తమ తమ తాలూకాలనుండి పెద్దయెత్తున సమీకరణ చేయవలసిందిగా, వివిధ తాలూకా, బ్లాకు సమితులను కోరుతూ జిల్లా కార్యవర్గం విజ్ఞప్తి చేస్తున్నది.

సత్యాగ్రహ కార్యక్రమం

10-8-72 : దివి, బందరు, గుడివాడ తాలూకాలు, మచిలీపట్నం దళాలు.

11-8-72 : వుయ్యూరు, గన్నవరంబ్లాక్స్ నూజివీడు, తిరువూరు, తాలూకా దళాలు.

12-8-72 కంకిపాడు, మైలవరం బ్లాకు నందిగామ, జగ్గయ్యపేట తాలూకాల దళాలు.

ఈ మూడు రోజులలోను విజయవాడ పట్టణంలోని దళాలు, వివిధ ప్రజా సంఘాల దళాలు పాల్గొంటాయి.

శ్రీ దాసరి కార్యక్రమాలు

విజయవాడలో ఆగస్టు, 10, 11, 12 తేదీలలో జరుగవలసిన సత్యాగ్రహం, 15 వ తేదీన భూసంస్కరణలు, ఆహారసమస్యపై రాష్ట్ర సమితి పిలుపు ననుసరించి జరిగే ప్రజాప్రదర్శనజయప్రదంచేయుటకు జిల్లాలో యీ క్రింది విధంగా సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి ఈ సమావేశాలకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ దాసరి హాజరౌతారు.

ఆగస్టు 8 వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటలకు దివి తాలూకా సమితి సభ్యుల, శాఖా కార్యదర్శుల సమావేశం చల్లపల్లిలో.

8 వ తేదీ సాయంత్రం గం॥ 5-00 లకు బందరుటౌన్, తాలూకా సమితుల సంయుక్త సమావేశం బందరులో

ఆగస్టు 9 మధ్యాహ్నం గం॥ 12-00లకు నందిగామ తాలూకా పార్టీ సభ్యుల జనరల్ బాడీ నందిగామలో

సాయంత్రం గం॥ 6-00 లకు మైలవరం బ్లాకుపార్టీ కార్యకర్తల సమావేశం ఇబ్రహీంపట్నంలో.

విజయ్‌కుమార్‌సిన్హాకు యు. పి. ప్రభుత్వం ఆహ్వానం

హైదరాబాదు, ఆగస్టు 5

ప్రముఖ విప్లవకారుడు, ప్రస్తుతం హైద్రాబాదులో నివసిస్తున్న శ్రీ విజయ్ కుమార్‌సిన్హాను ఆగస్టు 15 ఉత్సవాల సందర్భంగా తామ్రపత్రం స్వీకరించడానికి ఢిల్లీ రావాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పంపింది

పాక్ నౌకాదళ సహకారం

కరాచి, ఆగస్టు 5

గుజరాత్ తీర ప్రాంతంలో మునిగిపోయిన భారత్ వాణిజ్యనౌక దామోదర్ మందోరి అన్వేషణను పాక్ నావికాదళం నేడు కూడా కొనసాగిస్తున్నది.

ఈనౌక కరాచీకి నైరుతిగాదాదాపు 197 కిలో మీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో మునిగిపోయినట్లు తాజావార్తలు తెలియజేస్తున్నాయి.

ఈ నౌక తుఫానులో చిక్కుకొన్నట్టు సమాచారం అందగానే పాక్ నౌకాదళం వైమానికదళం సహాయానికి హుటాహుటిని అక్కడకి బయలుదేరాయి.

ఈ నౌక అన్వేషణలో సహాయపడవలసిందిగా పాక్‌ను భారత్ కోరింది.

రాయల్ లేబరేటరీస్ కార్మికుల సమ్మె

హైద్రాబాద్, ఆగస్టు 5

హైదరాబాద్‌లోని రాయల్ లేబరేటరీస్ కార్మికులు యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 2 వ తేదీనుంచి సమ్మె చేస్తున్నారు.

కార్మికుల న్యాయమైన కోర్కెలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించ వలసిందిగా లేబరు కమీషనర్ చేసిన సూచనను యాజమాన్యం తిరస్కరించింది.

ఈ విషయంలో యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిని యూనియన్ అధ్యక్షులు శ్రీ హరిసాహెబుగర్ నేడొక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. తక్షణమే కార్మిక మంత్రి జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేకూర్చవలసిందిగా ఆయన కోరారు.

బందరు ప్రాంతంలో భారీ వర్షం

మచిలీపట్నం, ఆగస్టు 5

నేడు వేకువజామున బందరుపట్టణం, దాని పరిసరప్రాంతాల్లో భారీవర్షం కురిసింది.

అక్కడ 28 మిల్లీమీటర్ల వర్షం రికార్డు అయినట్లు తాలూకా ఆఫీసువారు తెలియజేశారు.

హైద్రాబాద్ - విజయవాడమధ్య రాకపోకలకు

పోలీసుల జులుంమూలంగా 2 గంటలు అంతరాయం

శాసనమండలి సభ్యులు శ్రీ నాగయ్య, శ్రీ గిరిధరరావు విమర్శ

హైద్రాబాద్, ఆగస్టు 5

హైద్రాబాద్ - విజయవాడల మధ్య అనేకచోట్ల లారీలను ఆపి పోలీసులు మామూళ్ళను వసూలుచేస్తున్నారనీ, యివ్వనివాళ్ళను బెదిరించడం, కస్టడీలోనికి తీసుకోవడం జరుగుతున్నదనీ, రాష్ట్ర హోంమంత్రి వెంటనే జోక్యం చేసుకొని యీ అక్రమాలు అరికట్టాలని శాసనమండలి సభ్యులు శ్రీ కనపర్తి నాగయ్య, శ్రీ మన్నవ గిరిధరరావు నేడు ఒక పత్రికా ప్రకటనలో కోరారు.

వారు యింకా యిలా తెలియజేశారు.

"మేము హైద్రాబాద్‌నుండి గుంటూరుకు డీలక్సు బస్సులో 4 వ తేదీ రాత్రి వస్తుండగా మునగాల వద్ద 1 గంట మొదలు 4 గంటల వరకు ట్రాఫిక్ యావత్తూ ఆగిపోయింది, వందలాది ప్రయాణీకులు ఇబ్బందికి లోనైనారు ఇందుకు బాధ్యులు పోలీసువారు కావడం విశేషం.

ఎం. ఎ టి 65 నెంబరుగల లారీ సామానుతో మునగాలకు రెండు మైళ్ళ దూరాన వంతెన మీద అడ్డంగా పెట్టబడి వున్నది. మేము విచారించగా ఆ లారీ డ్రైవరును పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని తెలిసింది. రెండువైపులా అసంఖ్యాకంగా లారీలు, బస్సులు నిలిచివున్నాయి.

మేము ఒక లారీలో మునగాల పోలీసు స్టేషన్‌కు పోయి సబ్-ఇన్స్పెక్టరును కలిసినాము. లారీ డ్రైవరు తాగి వున్నాడనీ చెకింగ్ కొరకు ఆపమంటే ఆపకుండా పోతున్నాడని, అందుచేత బలవంతాన లారీ ఆపించి డ్రైవరును పట్టుకున్నామనీ ఆయన చెప్పాడు. లారీ వంతెనకు అడ్డంగా వున్నందున ట్రాఫిక్ ఆగిపోయి ప్రయాణీకులు అవస్థపడుతున్నారని చెప్పగా అపుడు డ్రైవరును విడుదల చేశారు

మాకు అచట లారీ డ్రైవరు చెప్పినదానినిబట్టి పోలీసులు హైదరాబాద్ - విజయవాడ మధ్య పదుచోట్ల లారీలనుండి మామూళ్ళు వసూలు చేస్తున్నారు ఇవ్వని వాళ్ళను బెదిరించడం, కస్టడీలోకి తీసుకోవడం జరుగుతున్నది. సూర్యాపేటవద్ద వెల్‌ఫేర్ టిక్కెట్లు బలవంతంగా అంటగడుతున్నారు. నయాపూల్, మలక్‌పేట, నకరకల్లు, మునగాలవద్ద మామూళ్ళు వసూలు చేస్తున్నారు. ప్రతి లారీ డ్రైవరు వారానికొక పాతికరూపాయలపైగా ఇచ్చుకోవలసి వస్తున్నది. వాటికి రసీదులుండవు ఆఖరుకు గుడివాడనుండి రాష్ట్ర రవాణా మంత్రిగారి తరఫున గడ్డిమోసుకొస్తున్న లారీ డ్రైవరు వద్దగూడమామూళ్ళు అడిగారని తెలిసింది.

రాష్ట్ర హోంశాఖామంత్రివెంటనే జోక్యం కలిగించుకుని పోలీసుల అక్రమాలను అరికట్టి ఇందుకు సంబంధించినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం"

సోషల్ వర్కు డిగ్రీ కోర్సు

విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో

విజయవాడ, ఆగస్టు 4

డిగ్రీ స్థాయిలో సోషల్‌వర్కు కోర్సు అవసరం చాలా కాలంనుండి వుంది.

విజయవాడ మేరీస్టెల్లాకాలేజీ ఈకోర్సును ప్రారంభించుటకు చొరవ తీసుకొంది

ఆంధ్రా యూనివర్శిటీ సోషల్ వర్కు విభాగానికి చెందిన డా॥ కె. వి రమణతో కూడిన ఒక కమిషన్ నేడు విజయవాడ వచ్చింది. డా॥రమణ గుణదలలోని చిల్డ్రన్స్ హోమ్, మహిళలసర్వీస్ హోమ్, అంధుల, వికలాంగులకై ఏర్పడిన హోమ్‌లనుపరిశీలించారు

సోషల్ వర్కుకోర్సుకు గల ప్రాథమిక అంచనాలు, అవకాశాలు తెల్సుకొన్నారు

సిటిజన్సుఇన్‌ఫర్మేషన్‌ఫోరంఅధ్యక్షులు శ్రీ ఆకురాతి వెంకటేశ్వరరావు ఈ విద్యా సంవత్సరంలోనే సోషల్ వర్కు కోర్సును ప్రారంభించాల్సిన అవసరాన్ని కమిషన్‌కు వివరించారు,

ప్రస్తుతం ఈ కోర్సును గుంటూరు, భీమవరం, ఏలూరు కాలేజీల్లో కూడా ప్రవేశ పెట్టుటకు సూచించడం జరిగింది.

519 దరఖాస్తులు

స్వయం ఉపాధి కల్పనా పథకానికి

విజయవాడ, ఆగస్టు 4

స్వయం ఉపాధికల్పనా పథకానికి జూలై మాసాంతానికి 519 మంది దరఖాస్తు చేశారు

పరిశ్రమల అసిస్టెంటు డైరెక్టరు శ్రీ యం రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు.

ఈ పథకానికి దరఖాస్తు చేయటానికి కృష్ణాజిల్లాలో రెండు చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు ఒకటి విజయవాడ పరిశ్రమల డైరెక్టరు కార్యాలయంవద్ద,రెండోది మచిలీపట్నం పరిశ్రమల అసిస్టెంట్ కార్యాలయం వద్ద.

ఇంతవరకు దరఖాస్తు చేసిన 519 మందిలో 230 మంది సాంకేతిక పరిజ్ఞానం కలవారు.

దరఖాస్తులను పరిశీలించేందుకు ఒక కమిటీ ఏర్పాటయింది.

దరఖాస్తులను అసిస్టెంటు డైరెక్టరు ఆగస్టు 19 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తులను అసిస్టెంట్ డైరక్టరు శ్రీ సోమయాజులు అధ్యక్షతనగల మూడు కమిటీలు పరిశీలిస్తాయి.

జనరల్ ఇంజనీరింగ్‌కు చెందినదరఖాస్తులను ఒక కమిటీ, రసాయన పరిశ్రమలకు చెందిన దరఖాస్తులను ఒక కమిటీ, మిగతా దరఖాస్తులను మరో కమిటి పరిశీలిస్తుంది.

ఈనెల8నగుంటూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్మిక సమ్మె

ప్లాస్టిక్ కంపెనీ కార్మికులకు సంఘీభావంగా

గుంటూరు ఆగస్టు 4

అక్రమంగాతొలగించిన కార్మికుల్నితిరిగి పనిలో చేర్చుకోవాలని తమయూనియన్‌ను యాజమాన్యంగుర్తించాలనిడిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న యిక్కడి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని హిందుస్థాన్ ప్లాస్టిక్ కంపెనీ కార్మికులకు సంఘీభావంగా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని మొత్తం సంస్థల కార్మికులుఈ నెల 8న ఒక రోజు సానుభూతి సమ్మె చేయాలని నిర్ణయించారు.

ఎస్టేట్‌లోని వివిధ సంస్థల కార్మికుల సమావేశం నేడు శ్రీ టి తిరుపాలు అధ్యక్షతన జరిగింది. శ్రీయుతులు సాంబశివరావు, ఆంజనేయులు, నరసింహారావు, ఎల్లమందలు తమ తమ సంస్థల కార్మికుల తరఫున ప్రసంగిస్తూ, ప్లాస్టిక్ కంపెనీ కార్మికుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. సినీ ఎంప్లాయీస్ నాయకులు శ్రీ నవి తమ పూర్తి సహకారం ప్రకటిస్తూ తమ కార్మికులు ఒకరోజు పేటీనికి వచ్చే భత్యాలను విరాళంగా ప్రకటించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం కె, మోహనరావు ప్రసంగిస్తూ ప్లాస్టిక్ కంపెనీ కార్మికుల పోరాటం గురించి వివరించారు.

శాసనమండలి సభ్యులపై మంత్రి కాకాని కినుక

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఆగస్టు 5

"ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో ఉపాధ్యాయ ప్రతినిధులు చేస్తున్న గల్లంతు పనీ పాట లేనివారి గల్లంతులా వున్నదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం నేడిక్కడ అన్నారు.

విజయవాడ జాతీయ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధుల సాంస్కృతిక మహాసభలను ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు

తమ సమస్యలగూర్చి జాతీయ ఉపాధ్యాయ సంఘం సమర్పించుచున్న మెమొరాండానికి జవాబుయిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో గల్లంతు జరుగుతున్నదని అన్నారు

గుంటూరుజిల్లాలో లక్షల ఎకరాల్లో నాట్లుపడని స్థితి

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, ఆగస్టు 4

నాగార్జుననాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో చాలాచోట్ల వరినాట్లు పడలేదని, జూలై 2వ వారం వరకు కాల్వల్లో నీరు వదలకపోవటం వల్ల నారుమళ్ళు పెరగలేదని, అందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గుంటూరు జిల్లా కలెక్టరు నిన్న ఒక ప్రకటనలో తెలిపారు

ప్రస్తుతపరిస్థితిలో చూస్తే సెప్టెంబరు 2వ వారంవరకుకూడా వరినాట్లు పూర్తిగావటం అసాధ్యమని ఆయన పేర్కొన్నారు.

దానివల్ల జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో సాగులేకుండా భూములు వదిలేసే ప్రమాదం ఉందని ఆయన చెప్పారు

తాను పర్యటించిన ప్రాంతాలలో నారుమళ్ళు నీరులేక, వర్షాలులేక కొన్నిపూడిపోయాయని మరికొన్ని జడలువేసి వెలికి పీకటానికి అసాధ్యంగా ఉన్నాయని ఆయన చెప్పారు కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాంతంలోకూడా వరిపొలాల పరిస్థితి పై విధంగానే ఉందని, కాల్వ చివరిభాగంలో నాట్లు పడలేదనీ ఆయన చెప్పారు

గుంటూరు జిల్లాలో ఏటా 11 లక్షల 83 వేల ఎకరాలలో వరిపంట సాగవుతుంది. ఈ ఏడు ఇప్పటివరకు 5 లక్షల 30 వేల ఎకరాలు మాత్రమే సాగయింది. 6 లక్షల ఎకరాలలో పంట సాగుకాకుండా ఉండిపోయే ప్రమాదంఉంది.

జూలై నెలలో ప్రతి ఏడూ 133 మిల్లీ మీటర్ల వర్షపాతం ఉండేది ఈ సంవత్సరం 61 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం పడింది

ఏప్రిల్. మే, జూన్ నెలల్లో కూడా వర్షపాతం చాలా తక్కువగా వుందని తెలిపారు.

నైరుతి ఋతుపవనాలలో ఆలస్యంవల్ల ఈపరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు.

చౌక డిపోలు

జిల్లావ్యాపితంగా 375 చౌక డిపోలు ఏర్పాటు చేస్తున్నామని గుంటూరులో 57 డిపోలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టరు చెప్పారు

మనిషికి వారానికి 4 కిలోల బియ్యం, 4 కిలోల గోధుమ ఈనెల 1 నుండి సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు,

ఏలూరులో చౌక డిపోలకై డిమాండ్

వివిధ సంఘాల సంయుక్తాధ్వర్యాన కలెక్టర్‌కు మెమొరాండం

ఏలూరు, ఆగస్టు 4

ఏలూరు పట్టణంలో బియ్యం తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటంచే, పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పూడి అప్పలస్వామి నాయకత్వాన జూట్, పొగాకు బీడి, సిగార్, రిక్షా, తోళ్ళు, అగరొత్తి కార్మిక సంఘాలు చేనేత, యువజన సమాఖ్యల తరఫున 150 మంది ప్రతినిధులు నేడు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌ను కలుసుకొని ఒక మెమొరాండాన్ని అందచేశారు.

ప్రతి సింగిల్ వార్డులో ఒక చౌకడిపోను డబుల్ వార్డులో 2 చౌక డిపోలను తక్షణం ఏర్పాటు చేయించి అక్కడ బియ్యం కిలో ఒకటికి 85 పైసలకు అమ్మించాలని, ప్రజల కొనుగోలు శక్తికి అనుగుణంగా యితర నిత్యావసర వస్తువుల ధరలు నిర్ణయించి అమ్మించాలని మెమొరాండంలో వారు కోరారు.

జిల్లా కలెక్టరు మెమొరాండంలోని అంశాలను పరిశీలించి 3 లేక 4 దినాల్లో చౌక దుకాణాలు తెరిపించి కిలో బియ్యం ఒకటికి రూపాయి ప్రకారం అమ్మించగలనని, యితర విషయాలను ప్రభుత్వానికి తెలియజేయగలనని ప్రతినిధులకు హామీ యిచ్చారు.

"మతతత్వ వ్యతిరేక దినం" వాయిదా

హైదరాబాదు, ఆగస్టు 2

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి యూనియన్ అధ్యక్షులు శ్రీ యాదగిరిరావు మృతివల్ల ఈ రోజు జరగవలసిన "మతతత్వ వ్యతిరేక దినం" ఈనెల 10వ తారీఖుకు వాయిదా పడింది "మతతత్వ వ్యతిరేక దినం" కన్వీనర్ శ్రీ బి. ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన వివిధ కాలేజీల, హైస్కూళ్ళ విద్యార్థి నాయకుల సమావేశం పై నిర్ణయాన్ని గైకొంది

ఆగస్టు 10న ఈ మతతత్వ వ్యతిరేక దినం" ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంతమంతటా జరుగుతుందని శ్రీ ప్రతాపరెడ్డి నేడొక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.



'నీతీ నిజాయితీ' చిత్రంలో సతీష్‌అరోరా, కాంచన

చిత్రసమీక్ష

లాల్ పత్థర్

తన వంశంలోని తనముందు వారు ఉన్మాదంతో బాధపడుతూ వచ్చినందువల్ల అటువంటి దుర్లక్షణాలు ఇక ఏమాత్రమూ కొనసాగకూడదని బ్రహ్మచారిగా జీవించ దలచి చివరకు పరిస్థితులమధ్య నలిగిపోయి తానూ ఒక ఉన్మాదిగా తయారైన ఒక సంపన్న యువకుని గాథ ఈగిల్ ఫిలింస్ వారి 'లాల్ పత్థర్'.

జ్ఞాన్‌శంకర్ (రాజ్‌కుమార్) రాజవంశానికి చెందిన యువకుడు. త్రాగుడు, ఉన్మాదం తదితర దుర్లక్షణాలుగల తన పూర్వీకుల మాదిరిగానే తన సంతానం కూడా బాధ అనుభవిస్తుందనే దూర దృష్టితో బ్రహ్మచారి జీవితం గడుపుతాడు. ఒకనాడు వేటకు వెళ్ళి పులిని చంపి తిరిగి వస్తుండగా అతనికి దొంగల ముఠా తారసిల్లుతుంది. వారిబారి నుండి బాల వితంతువు (హేమమాలిని)ను విడిపించి ఆమెకు మాధురీ అనే ముద్దు పేరు పెట్టి ప్రేమిస్తాడు.

సంగీత ప్రియుడైన జ్ఞాన్ శంకర్‌కు రూపంలో అందవతి అయినా ఏ కళా వంట బట్టనటువంటి మాధురిపై క్రమంగా ప్రేమ సన్నగిల్లుతుంది. ఒకనాడు పాటకచేరీలో చూచిన సుమత (రాఖీ)పై మనసు లగ్నమై తాగుబోతు అయిన ఆమె తండ్రికి డబ్బు యిచ్చి సుమను తన దానిగా చేసుకుంటాడు.

బ్రహ్మచారిగా వుండదలచిన జ్ఞాన్‌శంకర్ ఈ విధంగా అనుకోని బంధనాల్లో చిక్కుపడి సుమతతో అంబరీష్ (వినోద్ మెహ్రా)కు సంబంధమున్నదని ఒకవైపు క్రుంగిపోతూ, మరోవైపు మొదటి ప్రియురాలు మాధురి తెచ్చిన తలవంపును భరించలేక ఉన్మాదిగా మారిపోతాడు.

ఫతేపూర్ సిక్రీలో విషాదాంతంగా ముగిసిన ఈ చిత్రం అక్బరు కాలంనాటి కొన్ని ఘటనలతో జతచేసి చక్కగా ముగించిన దర్శకుడు సుశీల్ మజుందార్ అభినందనీయుడు.

డ్రీమ్‌గర్ల్ హేమమాలిని ప్రారంభంలో దాదాపు మూకీగా నటించిన ఘటన ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించి ఆమె డైలాగ్స్ వినాలనే కుతూహలాన్ని పెంపొందిస్తుంది. ప్రతి 'యాంగిల్‌'లోనూ, ప్రతి 'మూడ్'లోనూ ఆమెలో కన్పించే అందానికి ముగ్ధులుగాని ప్రేక్షకులుండరేమో - తరువాత తనను తిరస్కరించిన జ్ఞాన్ శంకర్‌ను, తన జీవితానికి కంటకప్రాయమైన సుమతను వంచించడానికి తలపెట్టిన ప్రతీకార చర్యలు విలన్‌ను మైమరపిస్తాయి.

వారసత్వంగా వచ్చే విలాసాలను అందిపుచ్చుకొని పతనమౌతున్న రాజ వంశీకుల స్థితిగతులను, మనోవ్యాకులతనురాజ్‌కుమార్ ప్రతిభావంతంగా ప్రదర్శించాడు.

వర్ధమాన నటుడు వినోద్ మెహ్రా, బెంగాలీ నటి రాఖీ తమ పాత్రలను చక్కగా పోషించారు.

భావగర్భితమైన డైలాగ్స్, చక్కని సెట్టింగులు, ఫతేపూర్ సిక్రీ చారిత్రక వైభవాలు ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణలు. పాటలు హస్రత్‌జైపురీ, నీరజ్, దేవ్ కోహ్లీ, సంగీతం శంకర్‌జైకిషన్.

ఆశాభోన్స్లే, మొహమ్మద్‌రఫీ, కిషోర్ కుమార్, మన్నాడే పాడారు. నిర్మాత ఎస్.సి. మెహతా. రిలీజ్ రాజశ్రీ పిక్చర్స్(ప్రైవేట్ లిమిటెడ్).

జనార్ధనరెడ్డి

'లాల్‌పత్థర్' చిత్రంలో హేమమాలిని

హేమమాలిని విదేశ పర్యటన

కూచిపూడి నృత్య కళా కౌశల్యాన్ని ప్రదర్శించేందుకై ప్రఖ్యాత హిందీ నటి కుమారి హేమమాలిని త్వరలో విదేశాలలో పర్యటించనున్నారు.

కుమారి హేమమాలిని విజయవాడలో జూలై 31 న యీ సమాచారాన్ని పత్రికా ప్రతినిధులకు తెలియజేశారు,

ధనార్జన దృష్టితో గాక భారతీయ కళను ప్రదర్శించేందుకు తాను పదిమంది బృందంతో పర్యటించనున్నానన్నారు

అమెరికా, వెస్ట్ ఇండీస్, సింగపూర్ మొదలైన దేశాలలో పర్యటించ నున్నామన్నారు

పర్యటన సన్నాహాలు జరుగుతున్నాయని డిసెంబరులో పర్యటన ప్రారంభంకావచ్చని హేమమాలిని తండ్రి తెలిపారు.

తాను 6 సంవత్సరాల లేతప్రాయం నుండి నాట్యాన్ని నేర్చుకుంటున్నట్లు, 1967 నుండి కూచిపూడి నృత్యాన్ని నేర్చుకుంటున్నట్లు ఆమె చెప్పారు.

తన కూచిపూడి నృత్య గురువు వెంపటి చిన సత్యంగారని తెలిపారు.

"నేను ఈ స్థితిలో వుండటానికి నా తల్లిదండ్రులే కారణం, నన్ను ఎంతో ప్రోత్సహిస్తున్నారు" అని చెప్పి తమ తల్లిని పరిచయం చేశారు.

హేమతల్లి రచయిత, చిత్రకారిణి, జర్నలిస్టు కూడా. ఆమె హిందీ, ఆంగ్ల భాషలలో పెక్కు పత్రికలలో వ్యాసాలుకూడ వ్రాశారు.

కూచిపూడినృత్యాన్ని హిందీచలన చిత్రాలలో ప్రదర్శించటానికి అవకాశం లేక పోతున్నదన్నారు.

హేమ తెలుగు చిత్రం 'పాండవ వనవాసం'లో నాట్యం చేసింది, ఆమెకు తెలుగు కొద్దిగా తెలుసు.

"నిజం చెప్పాలంటే తెలుగు చిత్రాలలో వుండే నటన తమిళ చిత్రాలలో వుండదు." అన్నారు,

హేమ చిత్రకారిణి కూడ. బాల్యంలో శంకర్స్ వీక్లీ బహుమతిని పొందింది. తీరిక సమయాలలో పెయింటింగ్, డెకరేషన్ చేస్తారు.

ఎల్ల భారతీయ సినీనటుల మాదిరిగానే ఆమెకుకూడా ఉమర్‌షరీఫ్, సోఫియా లారెన్‌లు అభిమానులు;

న్యూవేవ్ చిత్రాలు కేవలం తాత్కాలికంగానే విలువగలవన్న అభిప్రాయాన్ని వెల్లడించారు.

మద్రాసు, బొంబాయిలలో నృత్య శిక్షణా కేంద్రాలను ప్రారంభించనున్నట్లుతెలిపారు.

కుమారి హేమ నటించిన 14 చిత్రాలు విడుదలయ్యాయి. ప్రస్తుతం 15 హిందీ చిత్రాలలో నటిస్తున్నది.

నర్తకిగా పేరు తెచ్చుకుంటున్న హేమమాలినికి, నాట్యాన్ని ప్రాక్టీసు చేసేందుకు చలన చిత్రాల బిజీవలన తగిన సమయం దొరకటంలేదని మాటల సందర్భంగా చెప్పారు. తారగా గాక నాట్యతారగానే నిలచిపోవాలన్నది తమ ఆశయమని కూడ చెప్పారు.

లక్ష్మీ ఆర్ట్స్ తొలిచిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం

ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ గిడుతూరి సూర్యం లక్ష్మీ ఆర్ట్సు పతాకతో నిర్మిస్తున్న తొలి చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం వీనస్ స్టూడియోస్‌లో జూలై 16న జరిగింది చిత్ర పరిశ్రమకు చెందిన పెద్దలు, పిన్నలు-నటీనటులు, పాత్రికేయులు వచ్చారు

సాంప్రదాయ పూజానంతరం నటులు ప్రముఖ ఎన్. టి రామారావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు ప్రఖ్యాత నిర్మాత శ్రీ త్రివిక్రమరావు క్లాప్ కొట్టారు

తొలినాటి షెడ్యూలులో పూజామందిరం సెట్‌పై హీరో రామకృష్ణ, రాజశ్రీ, నాగయ్య, బేబీగౌరీ పాల్గొన్న సన్నివేశ చిత్రీకరణ నాలుగు రోజులు జరిగిన ఇన్‌డోర్ షూటింగ్‌లో కొందరు నటీనటులపై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించబడినాయి తర్వాత జూలై 31 వరకు అవుట్‌డోర్ షూటింగ్ జరిగింది.

బిగువైన యితివృత్తంగల సెంటిమెంటు, సస్పెన్సుగల ఈ చిత్రంలో — జ్యోతిలక్ష్మి, రామకృష్ణ నాయికానాయకులు బాలతార బేబీగౌరికథలో ఆద్యంతం కన్పించే ప్రధాన పాత్రను పోషిస్తోంది

రాజనాల, నాగయ్య, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, రామదాసు, కె వి చలం, మీనాకుమారి, సి హెచ్ కృష్ణమూర్తి, మోదుకూరి సత్యం, ఆనంద్, శేషగిరిరావు, వస్తాద్ జోసెఫ్ మొదలగువారు సహనటీనటులు

కథ గిడుతూరి సూర్యం, మాటలు దాసరి నారాయణరావు, పాటలు కొసరాజు, విజయరత్నం సంగీతం ఎస్ హనుమంతరావు, ఫొటోగ్రఫీ దేవరాజ్, నృత్యాలు నందిరాజు, కూర్పు కందస్వామి, ఆర్టు భాస్కరరాజు, స్టిల్స్ ప్రభాకర్, స్టంట్ భాషా అసిస్టెంట్ డైరెక్టర్ భాస్కర్, అసోసియేట్ డైరెక్టర్ కేశవరావు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ జి పృథ్వీరాజ్, నిర్మాత, దర్శకులు గిడుతూరి సూర్యం, విడుదల ఆంధ్రలో శ్రీకళ్యాణిపిక్చర్స్‌ద్వారా

హర్ జీత్

క్రమంగా తన స్వీయజీవిత కథనే పంకజ్ కథగా ఎందుకు వ్రాసింది? తన హృదయ కుహరంలో అగ్నిపర్వతాన్ని ఎలా భరించింది? తన నేస్తం బాధకోసం ఆమె చేసిన మహత్తర త్యాగమేమిటి? నిర్మాత సి. పి. దీక్షిత్, ఈస్టుమన్ కలర్‌లో నిర్మించిన చిత్రం 'హర్‌జీత్' కథాంశం.

కె. బాలచందర్ రాసిన తమరైనెంజం ఆధారంగా నిర్మించబడిన ఈ చిత్రానికి గుల్జార్ మాటలు. ఆనంద్‌బక్షి పాటలు వ్రాయగా లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతం సమకూర్చారు.

ఆంధ్రలో శ్రీ విజయలక్ష్మి ఫిలింస్ ద్వారా అతి త్వరలో విడుదల కానున్న చిత్రమిది.


'అబ్బాయిగారూ-అమ్మాయిగారూ' చిత్రంలో కృష్ణ, వాణిశ్రీ

'నేను-నా దేశం' చిత్రంలో రామకృష్ణ, సలీమా

1971 మద్రాసు ఫిలింఫాన్స్ అసోసియేషన్ ఎన్నిక చేసిన

ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులు

తెలుగులో ఉత్తమ చిత్రంగా 'తాసిల్దారుగారమ్మాయి', నటునిగా శోభన్‌బాబు, నటిగా వాణిశ్రీ ఎన్నిక

1971 సంవత్సరానికిమద్రాసు ఫిలింఫాన్స్ అసోసియేషన్ ఎన్నిక చేసిన ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణుల వివరాలను జూలై 15 న ఈ ఎన్నికకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వారి గౌరవార్థం జరిగిన సభలో ప్రకటించారు.

వరుసగా తమిళం, తెలుగు, మళయాళం కన్నడం, హిందీ భాషలలో ఉత్తమంగా ఎన్నికైన చిత్రాలు, నటులు సాంకేతిక నిపుణుల వివరాలు క్రిందివిధంగా ఉన్నాయి

ఉత్తమ చిత్రాలు

సినీ భరత్‌వారి "బాబు", సత్యచిత్రవారి "తాసిల్దారు గారమ్మాయి", శ్రీ రాజేష్ ఫిలింస్ 'అభిజాత్యం" ఈశ్వర్ ప్రొడక్షన్స్ "కులగౌరవ", హృషికేష్ ముఖర్జీ సమర్పించిన "ఆనంద్'

తమిళంలో గిరీమూవీస్ "అన్నయ్ వేలంకన్ని", తెలుగులో "ప్రేమనగర్", మళయాళంలో "ఒరుపెన్నింద కథై", కన్నడంలో "శారపంజర" ప్రత్యేక బహుమతు అందుకున్నాయి

ఉత్తమ నటులు

శివాజీ గణేశ్ (బాబు), శోభన్‌బాబు (తాశీల్దారుగారమ్మాయి), లతా సత్యన్ (అనుభవంగల్ పాలిచకల్), రాజ్‌కుమార్ (కుల గౌరవ), రాజేష్‌ఖన్నా (ఆనంద్).

ఉత్తమ నటీమణులు

వాణిశ్రీ (తమిళం: ఇరులుం ఒలియుం, తెలుగు: ప్రేమనగర్), షీలా (ఒరుపెన్నింద కథ), జయంతి (కుల గౌరవ), రాఖీ (షర్మిలి).

ఉత్తమ సహాయ నటులు

ఆర్. ముత్తురామన్ (సూపట్టం), గుమ్మడి (భాగ్యవంతుడు), కె. పి. ఉమ్మర్ (ఒరుపెన్నింద కథ), కె. ఎస్. అశ్వత్ (న్యాయవేదేవరు).

ఉత్తమసహాయనటీమణులు

దేవిక (వెగులిపెన్), చంద్రకళ (దసరాబుల్లోడు), మళయాళం, కన్నడంలో లేరు.

ఉత్తమ దర్శకులు

కె. బాలచందర్ (పెన్నగై), వి. బి. రాజేంద్రప్రసాద్ (దసరాబుల్లోడు), కె ఎస్. సేతుమాధవన్ (అనుభవంగల్ పాలిచకల్),


'మరపురాని తల్లి' చిత్రంలో వాణిశ్రీ

పుట్టన్న (శారపంజార). హృషికేశ్ ముఖర్జీ (ఆనంద్),

ఉత్తమ సంగీత దర్శకులు

కె. ఎస్. విశ్వనాథన్ (ప్రాప్తం), కె. వి. మహదేవన్ (దసరా బుల్లోడు), విజయ భాస్కర్ (శార పంజార), లక్ష్మీకాంత్, ప్యారేలాల్ (మేరాగావ్‌మేరాదేశ్) మళయాళం ఎవరూ లేరు.

ఉత్తమ హాస్యనటులు

రాజబాబు (ప్రేమనగర్), ఎస్. శివరాం (శారపంజార), అదూర్‌భాసి (అనుభవంగల్ పాలిచకల్) తమిళంలో ఎవరూ ఎన్నిక కాలేదు

ఉత్తమ పాటల రచయిత

డా॥ సి నారాయణరెడ్డి, ఇతర భాషలలో ఎవరూ ఎన్నిక కాలేదు

ఉత్తమ హాస్య నటీమణులు

రమాప్రభ (ప్రేమనగర్) ఇతర భాషలలో ఎవరూ ఎన్నిక కాలేదు

ఉత్తమ బాల తారలు

శేఖర్ (అన్నయ్ వేలంకన్ని), బేబీ శ్రీదేవి (నాతమ్ముడు)

ఉత్తమ నేపథ్య గాయకులు

తమిళం టి ఎం సౌందరరాజన్, పి సుశీల, తెలుగు, ఘంటసాల, పి. సుశీల, కన్నడ, పి బి. శ్రీనివాస్.

ఉత్తమ కథా రచయితలు

కె. బాలచందర్ (నూత్రుక్కునూరు), కె. విజయలక్ష్మి (తాసిల్దారు గారమ్మాయి), జి బాల సుబ్రహ్మణ్యం (కస్తూరినివాస)

క్యారెక్టర్ నటీమణి

భానుమతి (మట్టిలో మాణిక్యం).


'మల్లమ్మకథ' చిత్రంలో రామకృష్ణ, విజయలలిత

వింత దంపతులు

ఈ నెల 18 న విడుదల

పద్మాషిణి ఆర్ట్ పిక్చర్సు వారి 'వింత దంపతులు' ఈనెల 18 వ తేదీన ఆంధ్ర దేశమంతటా పూర్ణావారిద్వారా విడుదలవుతుంది.

జమున, నాగభూషణం, కృష్ణంరాజు, కృష్ణకుమారి, అల్లురామలింగయ్య, వి. నాగయ్య, పెరుమాళ్లు, రావికొండలరావు, చంద్రమోహన్ మొదలుగువారు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు: భమిడిపాటి రాధాకృష్ణ, సంగీతం: కోదండపాణి, కెమేరా: శేఖర్-సింగ్, కళ: బి. ఎస్ కృష్ణ, కూర్పు: టి. గోపాలరావు నిర్వహణ. కె మహేంద్ర, నిర్మాత దర్శకుడు: కె హేమాంబరధరరావు

'వింత దంపతులు' చిత్రంలో నాగభూషణం, కృష్ణకుమారి

'ప్రజా నాయకుడు' చిత్రంలో మిక్కిలినేని

'నిజం నిరూపిస్తా' విడుదల

శ్రీరాం ఫిలింస్ "నిజం నిరూపిస్తా" ఈస్టుమన్ కలర్ చిత్రం ఈనెల 4వ తేదీన విజయవాడ అప్సర (ఎ. సి.) లోను, ఆంధ్రలో యితర ముఖ్య కేంద్రాలలో లక్ష్మీ ఫిలింస్ ద్వారా విడుదలైంది.

"బడిపంతులు"

పచ్చని పొలాలు-పల్లెటూరి ప్రకృతి అందాలు - హృదయాలకు హాయి అనిపించేచోట - చందమామలాటి అందాలు చిందే దోరవయసు చిన్నది.

"... ఏమని, ఏమని చెప్పను ఓలమ్మో
వాడెన్ని నేర్చినాడే... ఓయమ్మో...
ఇంటిపట్టునవున్నా చేనిగట్టునపోతున్నా
వెంటబడే కొంటెవాడు-ఎంతకీ నన్నొదిలిపోడు"

అని గళమెత్తికోకిలలా పాడుతూ, పురివిప్పిన నెమలిలా నృత్యం చేస్తూ హొయలు విరజిమ్ముతుంది అరవిచ్చినమందారాల్లాంటి పల్లెకన్నెలు ఆమెతో గొంతుకలిపి పాడుతూ ఆడుతూ కన్నెమనసులకు విందులు చేసుకుంటున్నారు.

వీనులవిందు, కన్నుల పండువైన ఈ సన్నివేశం త్రివేణి ప్రొడక్షన్స్ వారి "బడిపంతులు" చిత్రంలోని మరో హైలైట్. నృత్య దర్శకులు పసుమర్తి కృష్ణమూర్తి శాస్త్రీయ బాణీలతో అద్భుతంగా కూర్చిన నృత్య భంగిమలను నటి విజయలలిత అపూర్వంగా అభినయించగా దర్శకులు పి చంద్రశేఖరరెడ్డి ప్రతిభావంతంగా చిత్రీకరించారు.

ఈ నృత్య గీతిలోని భావాలకు అనుగుణంగా భారీఎత్తున సెట్స్, నాలుగు రకాల విలువైన కాస్ట్యూమ్స్ వినియోగించడం మరో ప్రత్యేకత.

వాహినీస్టూడియోస్‌లో - జూన్ 25 నుండి నాలుగు రోజులు జరిగిన షూటింగ్‌లో కాలేజీ వార్షికోత్సవంలోని ఈ నృత్య ప్రదర్శన. మరికొన్ని సన్నివేశాలు - విజయలలిత, కృష్ణంరాజు తదితరులపై చిత్రీకరణ జరిగాయి. దాదాపు 13 రీళ్ళయిన ఈ చిత్రం చివరి షూటింగ్ షెడ్యూలు జూలై 6 నుండి 24 వరకు నిర్విరామంగా జరుగనున్నది.

బాలల చదువుకు గురువూ, చనువుకు చెలికాడూ అయిన బడిపంతులుగా ఎన్. టి. రామారావు, గురుపత్నిగా అంజలీదేవి అపూర్వంగా నటిస్తున్నారు. నాగభూషణం, రామకృష్ణ, అల్లురామలింగయ్య, రాజబాబు, జయంతి, విజయలలిత, టి పద్మిని సూర్యకాంతం కూడా నటిస్తున్న ఈ చిత్రంలో జగ్గయ్య, జానకి అతిథిజంట.

మాటలు: డి వి. నరసరాజు, పాటలు: ఆత్రేయ, డా॥ సి. నారాయణరెడ్డి, ఆరుద్ర, సంగీతం: కె. వి. మహదేవన్, నిర్మాత: పి. పేర్రాజు, దర్శకుడు: పి. చంద్రశేఖరరెడ్డి, ఆంధ్రలో ఈ చిత్రం పూర్ణావారి ద్వారా విడుదల.


'బడిపంతులు' చిత్రంలో ఎన్. టి. రామారావు, నాగభూషణం

డేట్‌లెన్ బంగ్లాదేశ్ సోనార్ బంగ్లా

ప్రముఖ టెలివిజన్ చిత్ర నిర్మాత గీతా మెహతా నిర్మించిన రెండు చిత్రాలివి ఇందులో మనంచూసేది స్వతంత్ర బంగ్లా ఆవిర్భావానికి జరిగినపోరాటం. నూరుమంది టెలివిజన్ కెమరామన్ ప్రాణాలకు తెగించి ఇండో పాక్ సమర కాలంలో నిర్మించారు. కొందరు పాక్ సైనికుల కాల్పులకు బలియై ప్రాణాలు వదిలారు.

షేక్ ముజిబుర్ రహ్మాన్, ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, స్వరణ్‌సింగ్, యాహ్యాఖాన్, ప్రెసిడెంట్ భుట్టో, టిక్కాఖాన్. నియాజీ, భారత్ జవానులు పాక్ సైనికులు, ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ రాజ్యాల ప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు యిందులోని తారాగణం

చిత్రాన్ని చూస్తున్నప్పుడు ఆయా నాయకుల మనస్తత్వాలు, ఆవేశాలు, వ్యక్తి విలక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. సమితి లో కాగితాలు విసరికొట్టి భుట్టో నిష్క్రమించడం, భారత్‌పై యుద్ధ ప్రకటన సమయంలో యాహ్యాఖాన్ ఆక్రోశ హంకార క్రుద్ధత్వాలు, శ్రీమతి ఇందిరా గాంధి టెలివిజన్ ప్రసంగ సమయంలో వ్యక్తం చేసిన నిబ్బరం మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. బెంగాలీలపై పాక్ సైనికులు సాగించిన అమానుషహింసాకాండ ఆవేదనను రగిల్చుతుంది.

అలాగే సోనార్ బంగ్లా - బంగ్లా వీరుల సాహసగాధలను వివరిస్తుంది.

శ్రీ బాలాజీ పిక్చర్సువారు ఈ రెండు చిత్రాలను ఆంధ్రలో విడుదల చేస్తున్నారు.

సినిమా ప్రకటనలు
తప్పక చూడండి!

రవిశంకర్ పిక్చర్స్‌వారి
మేనకోడలు

ఉషశ్రీవారి
మానవుడు-దానవుడు

98 వ రోజు
జెమినివారి
మంచిరోజులు వచ్చాయి


మైక్రోఫైన్డ్ ఆస్ప్రో
త్వరగా కరుగుతుంది,
త్వరగా ఇముడుతుంది
కనుకనే మామూలు బిళ్ళల కన్నా
రెట్టింపు త్వరగా పనిచేసి నొప్పిని తొలగిస్తుంది.

మామూలు బిళ్ళ
పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి.
నెమ్మదిగానే నివారణ

మైక్రోఫైన్డ్ ఆస్ప్రో
సూక్ష్మాణువులు-త్వరగా ఇముడుతాయి.
శీఘ్ర నివారణ

మామూలు బిళ్ళల వలెగాక, ఆస్ప్రో అతి సూక్ష్మమైన అణువులు త్వరగా ఇముడుతాయి. నొప్పిని కలిగించే చోటుకు శీఘ్రగతిని చేరి సత్వర నివారణ కలిగిస్తాయి..

మైక్రోఫైన్డ్ ఆస్ప్రోను: తలనొప్పి • ఒళ్ళు నొప్పి జలుబు • ఫ్లూ • కీళ్ళ నొప్పులు • గొంతు నొప్పి • పంటి నొప్పులకు వాడండి.

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు, అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ లేక మీ డాక్టరు సలహా ప్రకారం వేసుకోవాలి.

నొప్పిని అతి శీఘ్రంగా తొలగించడానికి ఆస్ప్రో మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది

నికోలస్ (N) తయారు
A.G.57 TL

శ్రీకాకుళం జిల్లాలో దుర్భర దుర్భిక్ష పరిస్థితి

పంటలన్నీ పోయి, పరపతి పుట్టక ప్రాణాలుచేత పట్టుకున్న ప్రజానీకం

శ్రీకాకుళం, ఆగస్టు 3

శ్రీకాకుళం జిల్లాలో వర్షాలు లేక వరి నార్లు పూర్తిగా ఎండిపోయాయి. వర్షం పడినప్పుడు నాట్లు వేయటకు వరినారు చాలా ప్రాంతాలలో అసలేలేదు నాగావళినదికూడా ఎండిపోయి, కాల్వలు బందయ్యాయి గతంలో పొడ్చిన పొలాలుకూడా యిప్పుడు పూర్తిగా ఎండిపోయాయి

వేరుశనగ గోగులు మొదలైన పంటలు ఎండి నేలగలిసిపోయాయి వచ్చే సంవత్సరం బ్రతకటమెలాగ అనేదే అందరినుండి వస్తున్న ఆందోళన, చీపురుపల్లి, పొందూరు రాజాం, నరసన్నపేట తాలూకాల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది.

ఒక ప్రక్క పంటలకు నష్టంతోపాటు మరోప్రక్క ధరలు పెరుగుదలతో పరపతి కూడా పడిపోయి, ప్రజలు ప్రాణాలు చేత బట్టుకొని ఎటుపోవటమా అన్న సందిగ్ధావస్థలో వున్నారు వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరీ దీనంగా వుంది.

ఈ దుర్భర పరిస్థితిని అధికారులు కళ్ళారా చూచి ప్రభుత్వ దృష్టికి తెచ్చి ప్రతి గ్రామాన చౌక డిపో తెరచి తక్కువ ధరలకు బియ్యం అందించటం, కరువు పనులు కల్పించటం, అవసరాన్నిబట్టి అప్పులివ్వటంలాంటి సహాయక చర్యల ద్వారా ప్రజలను ఆదుకోవాలనీ,' అందుకు జిల్లా కలెక్టరు బాధ్యత వహించాలని జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ కూన కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు

పంచదార పంపిణీలో అవకతవకలు

అలమూరు డిప్యూటీ తహశీల్దారు తుగ్లక్ విధానం

కాపేశ్వరం, ఆగస్టు 3

మండపేట పట్టణంలో పంచదార పంపిణీకై అలమూరు డిప్యూటీ తాహశీల్దారు కార్డుకు కిలో చొప్పున యిచ్చే నిమిత్తం 8 వేల కార్డులు పంచారు కానీ, పంచదార మాత్రం పట్టణంలోని కాఫీ హోటళ్ళకు, వివాహాది అవసరాలకు కలిపి 3,500 కిలోలు మాత్రమే కోటా వేశారు.

ఈ పద్ధతివలన పట్టణంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారని, 9 వేల కిలోల పంచదార పట్టణావసరాలకు కావాలని కౌన్సిల్ అంచనా వేసి, ఆ మేరకు కోటా వేయాలని కోరుతూ మండపేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం తీర్మానించింది

ఈ సమావేశం జులై 31 న చైర్మన్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు అధ్యక్షతన జరిగింది

పట్టణంలో బియ్యంధర విపరీతంగా పెరిగినందున, చౌక డిపోలుపెట్టి బియ్యం అమ్మించాలని జిల్లా కలెక్టరును కోరుతూ మరో తీర్మానం ఆమోదించారు

చర్లగుడిపాడు గ్రామ వడ్డెర సంఘం కార్యవర్గం

చర్లగుడిపాడు, ఆగస్టు 2

గుంటూరుజిల్లా గురజాల తాలూకా చర్లగుడిపాడు గ్రామవడ్డెర సంఘానికి జులై 21 న కార్యవర్గం ఎన్నుకోబడింది

శ్రీ బత్తుల పెద తిమ్మయ్య అధ్యక్షులుగా శ్రీ బత్తుల రామలింగం ఉపాధ్యక్షులుగా, శ్రీ బత్తుల వెంకటేశ్వర్లు కార్యదర్శిగా, శ్రీ బత్తుల చినతిమ్మయ్య సహాయ కార్యదర్శిగా, శ్రీ బత్తుల ఆదినారాయణ కోశాధికారిగా, మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు

ఇళ్ళస్థలాలకై ఊరేగింపు

—పొన్నూరులో

పొన్నూరు, ఆగస్టు 3

పొన్నూరులో ఇళ్ళ స్థలాలు డిమాండ్ చేస్తూ 300 మంది పేదలు (యానాదివారు) జులై 31 న తమ సంఘాధ్యక్షులు శ్రీనంబూరి శ్రీరాములు అధ్యక్షతన ఊరేగింపు జరిపారు బి డి వోకు, సమితి అధ్యక్షునికి యిళ్ళ స్థలాలు కోరుతూ మెమొరాండం సమర్పించారు

పరిస్థితిని పరిశీలించి, ప్రత్యేకంగా ఒక అధికారిని వీరి ఇళ్ళ స్థలాల విషయమై నిర్ణయించారు

వీరు ఇళ్ళస్థలాలు లేక కాల్వగట్టులమీద, రోడ్ల మార్జిన్లలో గత అనేక సంవత్సరాలుగా అనేక యిబ్బందులు పడుతున్నారు

పొన్నూరులో దోమల బాధ

పొన్నూరులో దోమలబాధ ఎక్కువగా వుంది దాళవా పంట కాలంలో వచ్చే దోమలు-యిప్పుడేవచ్చి విపరీతంగా బాధ పెడుతున్నాయి వీటి మూలకంగా ప్రజలు నిద్రపోవడంలేదు పశువుల విషయంలోనూ యీ దోమకాటు విపరీతంగా వుంది.

వియత్నాం సంఘీభావ సభ

—రాజమండ్రిలో

రాజమండ్రి, ఆగస్టు 3

వీర వియత్నాం సంఘీభావ సభ జులై 28 న రాజమండ్రి పట్టణ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగింది సభకు శ్రీ అరుణకుమార్ అధ్యక్షత వహించారు

సభను శ్రీ చిట్టూరి సాస్లి బసవరాజు చౌదరి ప్రారంభించి వియత్నాం వీరోచిత పోరాటచరిత్రను వివరించారు

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముప్పూడి సూర్యనారాయణ అమెరికన్ సామ్రాజ్యవాద ప్రమాదాన్ని వియత్నాంలో అది సాగిస్తున్న అమానుష చర్యలను వివరించారు

డా॥ ఎ బి నాగేశ్వరరావు, పట్టణ యువజన సంఘాధ్యక్షులు శ్రీ కొయ్యాని అప్పారావుకూడా మాట్లాడారు

వియత్నాం ప్రజల వీరోచిత పోరాటాన్ని బలపరుస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదులు వెంటనే వియత్నాంనుండి తొలగిపోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు

శ్రీ కె శంకరరావు వందన సమర్పణ చేశారు

మల్ల విద్యాప్రవీణుని సన్మాన సంఘం

సుప్రసిద్ధ మల్ల విద్యా ప్రవీణులు శ్రీ స్వర్ణపూడి సుబ్బారావుకు సన్మానం చేసేందుకు 20 వ్యాయామ కళాశాలల అధిపతులు, విద్యార్థులు యిటీవల సమావేశమై సన్మాన సంఘాన్ని ఎన్నుకొన్నారు

ఆ సంఘ అధ్యక్షులుగా మాదిరెడ్డి చెన్నకేశవరావు, ఉపాధ్యక్షులుగా శ్రీ అడ్డూరి నారాయణరావు, కార్యదర్శిగా శ్రీ ఎస్. కిషన్‌సింగ్, సహాయ కార్యదర్శిగా శ్రీ సిన్ని లక్ష్మణరావు, మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు

ఆగస్టు 27 న సన్మానం జరపటానికి తీర్మానించారు.

కోర్కెలు పరిష్కారం కానిచో ఆందోళనకు సంసిద్ధం

కర్నూలుజిల్లా భూమి తనఖా బ్యాంకు ఉద్యోగుల మహాసభ తీర్మానం

కర్నూలు, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య మేనేజిమెంటుకు యిచ్చిన సమ్మె నోటీసును ఆమోదిస్తూ, సమాఖ్య కేంద్ర కమిటీ నిర్ణయానుసారం ఆగస్టు 15వ తేదీలోగా కోర్కెలు పరిష్కారం కానిచో, ఫెడరేషన్ యిచ్చే ఏ ఆందోళనా కార్యక్రమంలోనైనా పాల్గొనేందుకు సంసిద్ధంగా వుండాలని కర్నూలుజిల్లా భూమి తనఖా బ్యాంకు ఉద్యోగుల మహాసభ తీర్మానించింది

ఈ మహాసభ జులై 30 వ తేదీన స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో జరిగింది

ఆంధ్రప్రదేశ్ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ వివేకానందరావు, కేంద్ర కమిటీ సభ్యులు శ్రీ వి రాధాకృష్ణమూర్తి సభకు హాజరయ్యారు

సభలో శ్రీ వివేకానందరావు ప్రసంగిస్తూ కేంద్ర సహకార బ్యాంకు మేనేజిమెంటుకు, ఉద్యోగులకు మధ్య జరిగిన చర్చలు ఎలా విఫలమైందీ వివరించారు సెప్టెంబరు 15 వ తేదీ తర్వాత ఏ రోజైనా సమ్మెకు సిద్ధం కావాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు ఈనాడు ఉద్యోగుల ముందున్న పవిత్ర కర్తవ్యం ఉద్యమ నిర్మాణమన్నారు ఐక్యతతో, క్రమశిక్షణతో ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రతిష్ఠను పెంచాలన్నారు

శ్రీ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, ఉద్యోగుల సర్వీసు పరిస్థితులు, వారు పడుతున్న బాధలను వివరించారు ఈ సమయంలో రాష్ట్ర ఫెడరేషన్‌యిచ్చే ఏ ఆందోళనా కార్యక్రమానికైనా ఉద్యోగులంతా సిద్ధం కావాలని, సెప్టెంబరు 15 తర్వాత ఏ రోజు పిలుపునిస్తే ఆ రోజు సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు

జీవితభీమా సంస ఏజెంట్లకు బహుమతులు

నెల్లూరు, ఆగస్టు 2

జీవితభీమా సంస్థవారు 'న్యూబిజినెస్' పోటీలలో గెలుపొందిన ఏజెంట్లకు డెవలప్‌మెంటు ఆఫీసర్లకు గత నెల 28 వ తేదీన ఇచ్చట కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆవరణలో జరిగిన సభలో బహుమతి ప్రదానం చేశారు

జీవిత భీమాసంస్థ బ్రాంచి మేనేజర్ శ్రీ యం శీతారామయ్య అతిథులను ఆహ్వానించారు

సీనియర్ డివిజనల్ మేనేజర్ శ్రీ ఎ యం శ్రీనివాసన్ బహుమతి ప్రదానం చేశారు శ్రీ కె ఆర్, చంద్రశేఖర్ ప్రసంగిస్తూ యల్ ఐ సి ఏజంట్లకు కొత్తగా ఏర్పర్చిన సదుపాయాలు, ఏజెంట్లు వ్యాపారాభివృద్ధికి చేయవలసిన కృషివివరించారు

నెల్లూరులో 214 మందికి బహుమతి ప్రదానం జరిగింది

ఇ.ఎల్.టి.సి సెంటర్లో శిక్షణపొందిన టీచర్లకు వీడ్కోలు

నెల్లూరు, ఆగస్టు 2

ప్రభుత్వ ఇ యల్ టి సి సెంటరు (ఆంగ్లభాషా బోధనా ప్రచార కేంద్రం) వారు తమ సెంటరులో శిక్షణ పొందిన 40 మంది ఉన్నత పాఠశాల సెకండరీ ఉపాధ్యాయులకు సౌహార్దికంగా వీడ్కోలు నిచ్చారు ఈ కేంద్రంవారు నిర్వహించిన 40 రోజుల కోర్సులో ఉపాధ్యాయులకు ఆంగ్లభాషా బోధనలో నూతన పద్ధతులు పోనిక్సు, ధ్వన్యుచ్చారణ, రైమ్సు, వ్యాకరణ బోధనా పద్ధతులు, ఇటాలిక్ రైటింగ్ మున్నగు అంశాలలో ఎంతో శ్రద్ధగా శిక్షణ ఇచ్చారు

వీడ్కోలు సమావేశానికి అధ్యక్షత వహించిన సెంటరు స్టాఫ్ లీడరు శ్రీ పి వీరాంజనేయులు ఉపన్యసిస్తూ, ప్రభుత్వ విద్యాబోధనలో ఆంగ్లభాషకు ఒక స్థానమున్నదనియు, ఆ భాషాబోధనాపద్ధతులపై రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌ఇంగ్లీషు బెంగుళూరు కేంద్రంవారు పరిశోధనలు ద్వారా నూతన పద్ధతులు రూపొందించిరనియు, ఆ కేంద్రమువారు రూపొందించిన పద్ధతులనే ఈ కేంద్రంలో శిక్షణ ఇవ్వడమైనదన్నారు ఇప్పటికి ఈ కేంద్రమువారు 1600 మందికి శిక్షణ ఇవ్వగా వారి ఆంగ్లభాషా బోధనా పద్ధతులు తృప్తికరంగా, ఆకర్షణీయంగా నున్నవని తెలిపారు

తదుపరి వాణిశ్రీ జిల్లాపరిషత్ హైస్కూలు (సేతుమోహపురం) ఉపాధ్యాయుడు శ్రీ పి ఆర్ కె బ్రహ్మానందరావు మాట్లాడారు

సెంటరు ట్యూటరు, శ్రీ మరియాదాసు, తదితరులు ఉపాధ్యాయులు తమబోధనాపాటవమును పెంపొందించుకొని విద్యార్థులను ఆకర్షింప వలసినదిగా కోరారు

శ్రీమతి బషీరున్నిసాబేగం, సెంటరులో శిక్షణ పొందిన వివిధ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు యోగ్యతా పత్రములందచేశారు శ్రీమతి డి రోస్ మోసెస్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

వియత్నాంలో నిక్సన్ యుద్ధ నేరాలకు ఉరిశిక్ష

కటక్‌లో విద్యార్థి ఫెడరేషన్ ఏర్పాటు చేసిన కోర్టు తీర్పు

కటక్, ఆగస్టు 3

అమెరికా అధ్యక్షుడు, యుద్ధ నేరస్థుడు నిక్సన్‌పై అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అధ్వర్యాన జూలై 29 వ తేదీ సాయంత్రం కటక్ టౌన్‌హాలులో విచారణ ఏర్పాటు చెయ్యబడింది ఈ విచారణకు పట్టణంలోని కార్మికులు, పేదావులు, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో హాజరయారు

వియత్నాం, లావోస్, కాంబోడియా ప్రజలకు వ్యతిరేకంగా నిక్సన్ అనేక ఘోర నేరాలు జరిపాడని విద్యార్థులు నిందారోపణ చేశారు

ఈ విచారణకు న్యాయమూర్తులుగా శ్రీ అద్వైత్ సిహెచ్ మహంతి, అడ్వోకేట్, ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ రబిదెళా, విద్యార్థి నాయకుడు శ్రీ భ్రమర్‌బార్‌సాహు వ్యవహరించారు

ఈ సమావేశం ఉద్దేశాన్ని గురించి ఎ. ఐ యస్ ఎఫ్ నాయకులు శ్రీ విజయ్ కుమార్ పరిహారీ వివరించారు

శ్రీయుతులు నరేంద్ర కుమార్ స్వైన్, (అడ్వోకేట్), అభయ కుమార్ శతపథి (విద్యార్థి నాయకుడు), విజయ కుమార్ మహంతి (విద్యార్థి నాయకుడు), గోవింద్ సి హెచ్ మహంతి (కమ్యూనిస్టు నాయకుడు), నిక్సన్‌చేసిన యుద్ధ నేరాలను సోదాహరణంగా రుజువు చేశారు తమ జాతీయ విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తున్న వియత్నాం వీర ప్రజానీకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు అమెరికా ప్రభుత్వం యుద్ధాన్ని కొనసాగిస్తోందని వక్తలు తమ ఉపన్యాసాలలో సోదాహరణంగా నిరూపించారు

విచారణ ప్రక్రియను, అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని ధిక్కరించి, 1954 జెనీవా ఒప్పందాన్ని ఉల్లంఘించి వియత్నాం, ఇండో చైనాల్లో మూకుమ్మడిగా జనహత్య కొనసాగిస్తూందని తెలిపారు

శ్రీ అనిల్ ముఖర్జి నిక్సన్ తరఫున వాదించారు నిక్సన్‌పై చేయబడిన నేరారోపణలను, ప్రత్యారోపణలను పరిశీలించి, న్యాయమూర్తులు నిక్సన్‌కు ఉరిశిక్ష విధించారు

ప్రేక్షకుల ఎదుట, వారి కరతాళ ధ్వనుల మధ్య నిక్సన్ దిష్టిబొమ్మను ఉరితీశారు

బరంపురంలో నిక్సన్ దిష్టిబొమ్మ ఊరేగింపు

గంజాం జిల్లా బరంపురంలో యుద్ధ నేరస్థుడు నిక్సన్ దిష్టిబొమ్మను ఊరేగించారు ఊరేగింపులో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు ప్రధాన పట్టణ వీధులలో ఊరేగిన అనంతరం, టౌన్‌హాలు వద్దకు వెళ్ళిన తర్వాత, అక్కడ బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిపారు

సభకు జిల్లావిద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ గోకుల్‌చంద్ర పాండా అధ్యక్షత వహించారు యువజన నాయకుడు శ్రీ పూర్ణచంద్రదాస్, అడ్వోకేట్, కమ్యూనిస్టు నాయకుడు విశ్వనాథ్‌సాహూ ఉపాధ్యాయ సమాఖ్య నాయకుడు శ్రీ సాధు చరణ్‌పతి, యస్ బి వో సంఘ సమన్వయ కమిటీ తరఫున శ్రీ పద్మచరణ్‌సాహు, పి అండ్ టి యూనియన్ నాల్గవ తరగతి ఉద్యోగుల నాయకుడు శ్రీ కిరాటి పాణిగ్రాహి, శ్రీ జె వి, రమణమూర్తి ప్రభృతులు ప్రసంగిస్తూ వియత్నాం ప్రజలపై అమెరికా సామ్రాజ్యవాదులు కొనసాగిస్తున్న అత్యాచారాలను తీవ్రంగా ఖండించారు ఇండో-చైనా నుండి అమెరికా సైన్యాలను ఉపసంహరించుకోవలసిందిగాను, ఉత్తర వియత్నాంపై బాంబుదాడులకు స్వస్తిచెప్పవలసిందిగాను, ఇతరుల జోక్యం లేకుండా వియత్నాం ప్రజలు తమ భవిష్యత్తును నిర్ణయించుకోడానికి అవకాశం యివ్వవలసిందిగాను డిమాండు చేశారు వెంటనే దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వాన్ని గుర్తించవలసిందిగా భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు తరవాత నిక్సన్ దిష్టిబొమ్మ తగులపెట్టారు

ఇదే రోజున ఒరిస్సా ముఖ్యపట్టణం భువనేశ్వర్‌లో కేరీ ఆఫీసు వద్ద విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యాన బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపి వియత్నాం, ఇండోచైనాలలో అమెరికా సామ్రాజ్యవాదులు వియత్నాం యుద్ధానికి స్వస్తిచెప్పాలని కోరారు

జాజ్‌పూర్ సబ్‌డివిజన్‌లోని మంగళ్‌పూర్‌వద్ద విద్యార్థి ఫెడరేషన్ నాయకత్వాన బహిరంగసభ జరిగింది

విద్యార్థి నాయకులు శ్రీ జగన్నాథ్‌దాస్, తదితరులు యుద్ధాల చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ప్రజల మారణహోమాన్ని వియత్నాంలో నిక్సన్ కొనసాగిస్తున్నాడనీ, వెంటనే దానికి స్వస్తి చెప్పాలనీ విజ్ఞప్తి చేశారు

ఆనందమార్గ్ హత్యకేసు :

'ఆనంద్ మార్గ్ గురుజీకి మరణ దండన విధించాలి'

ప్రాసిక్యూషన్ వాదన

పాట్నా, ఆగస్టు 2

ఆనందమార్గ్ నుండి బయటికి వెళ్ళిపోయిన ఆరుగురు అవధూత్‌లను చంపిన 'ఆనందమార్గ్' స్థాపకుడూ, అధ్యక్షుడూ అయిన "ఆనందమూర్తిజీ" అనే పి ఆర్ సర్కార్‌కు మరణదండన విధించాలని నేడు ప్రాసిక్యూషన్ వాదించింది

"ప్రైవేటు సెక్రటరి విశోకానంద గురుజీని గుర్తించడానికి వీలుగా, జులై 28 న సర్కార్‌ను కోర్టు ముందు ప్రవేశ పెట్టవలసిందిగా నేను పిటీషన్ దాఖలు చేశాను ఐతే అదే సమయంలో సర్కార్ ప్రాణాపాయదృష్ట్యానూ, తీవ్రంగా జబ్బుపడినకారణంచేతనూ ఈసర్కార్‌నుకోర్టుకు పిలుస్తూ సమన్లు జారీ చేయకూడదని పిటీషన్ దాఖలు చేసింది" అని ప్రాసిక్యూషన్ న్యాయవాది శ్రీ బలదేవ్ ప్రసాద్ స్పెషల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రాసిక్యూషన్ వాదాన్ని ప్రారంభిస్తూ అన్నారు

ఈ విశోకానంద్ ఈ ఆనందమార్గ్ హత్యకేసులో ప్రాసిక్యూషన్ సాక్షి

ప్రస్తుత ప్రధాన నిందితుడు ఆనందమూర్తిజీ ఉంటున్న బంకిపూర్ సెంట్రల్ జైలుకు విశోకానంద్‌ను తీసుకొనివచ్చి అతనుగుర్తించేఏర్పాటుచేయాలన్న డిఫెన్స్ కౌన్సిల్‌వాదాన్ని ఖండిస్తూ ఆ జైల్లోవున్న ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో అది అసాధ్యమని ప్రాసిక్యూషన్ వాదించింది

తన వాదాన్ని బలపరచే అలహాబాదు, కలకత్తా, మధ్యభారత్ హైకోర్టులతీర్పులను ప్రాసిక్యూషన్ న్యాయవాది ఉటంకించారు

సర్కార్ తీవ్ర అస్వస్థుడై ఉన్నాడన్న మాట శుద్ధ అబద్ధమని, డిఫెన్స్‌వాదనను ఖండించారు సర్కార్‌ను హాస్పిటల్‌లోఇంకెంత మాత్రమూ ఉంచనక్కరలేదనీ, శుభ్రంగా జైలులోనే ఉంచవచ్చునన్న హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును ప్రాసిక్యూషన్ న్యాయవాది శ్రీబలదేవ్ కోర్టుముందుకు తీసుకుని వచ్చారు

- నిందితుడిపైన "విపరీతమైన" దయను చూపే అవసరం ఇంకెంతమాత్రమూలేదని ప్రాసిక్యూషన్ వాదించింది

గురుజీ గుర్తింపు విషయమై డిఫెన్స్ కౌన్సిల్ వాదాన్ని కోర్టు రేపు వింటుంది

1967 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఈ "ఆనంద్‌మార్గ్" పాల్గొందనీ, అయితే ఈ మార్గ్ అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ ఎన్నిక కాలేదనీ, తాను సి బి ఐ కి తెలియ జేసినట్లు అంతకుముందు సాక్ష్యమిచ్చిన ప్రాసిక్యూషన్ సాక్షి విశోకానంద్ కోర్టులో చెప్పారు

మార్గ్‌కు దేశమంతటా 100 కు పైగా కేంద్రాలున్నాయి అనేక 'చిల్డ్రన్స్‌హోం' లను, అనేక ప్రసూతి వైద్య శాలలనూ, వైద్యశాలలనూ యీ మార్గ్ నడుపుతోంది గట్టి అనుయాయులను తయారు చేసుకోవడమే వీటన్నిటిని నడపడం వెనుక వున్న ముఖ్యఉద్దేశ్యం' అని విశోకానంద్‌అన్నారు

ఈ మార్గ్‌కు విదేశాల్లో ఎన్ని కేంద్రాలు ఉన్నదీ, ఏ ఏ దేశాల్లో కేంద్రాలున్నదీ తెలియజేయడానికి విశోకానంద్ నిరాకరించాడు,

పురులియా కేంద్రంలో ఈ దారుణ హత్యాకాండ జరిగిన తర్వాత, తన భార్య 'మార్గ్‌మాత"తోనూ, పిల్లలతోనూ దొడ్డిదారిని సర్కార్ పారిపోవడం తాను చూడలేదని విశోకానంద్ తెలిపారు

కూచ్ బీహార్ సంఘటన తర్వాత 'దాదా"పైన ఆయన అనుచరుల్లో గౌరవము సన్నగిలిందని విశోకానంద్ తెలియజేశారు.

కూచ్ బిహార్‌లో ఆనంద మార్గులకూ, నక్సలైటులకూ మధ్య ఘర్షణ రేగింది

లాతానగర్ సమీపంలో మూడు మృతదేహాలు కనబడ్డాయని సర్కార్, సంపూరానంద్ అవధూత్‌కు చెప్పడాన్ని తాను విన్న విషయం సి బి ఐ కి 1970 సంవత్సరం జులైలో చెప్పానని ఆయన అన్నారు

ఈ మృతదేహాలు శుద్ధానంద్, మృత్యుంజయానంద్, సచ్చిదానంద్ అవధూత్‌లవని సర్కార్ సర్వేశ్వరానంద్‌తో చెప్పడం నేను విన్నాను "ఈ ప్రాంతానికి అంత సమీపంలోఎందుకు చంపారు ?" అని సర్కార్ సంతోషానంద్‌ను గట్టిగా ఆగ్రహంతో తిట్టడం విన్నాను.

'సర్కార్ చప్పట్లో మునిగి తేలుతుండగా, సర్కారీ బాబ్బాను నేను తలుపు దగ్గరికిపిలిచి, వారి సంభాషణలను వినమన్నాను"

ఆ మృత దేహాలను గుర్తించమంటే, తాను గుర్తించ గలనని నేను సి బి ఐ కి చెప్పాను' అని విశోకానంద్ సాక్ష్యమిచ్చారు

సర్కార్‌ను పదగొట్టి, మార్గ్" అధ్యక్ష పదవిని తానుచేపట్టాలని, సర్కార్ భార్యను "మార్గ్‌మాత"ం బదులు మార్గ్‌రాణి"ని చేస్తాననీ తానెన్నడూ "మార్గ్‌మాత'తో అనలేదని విశోకానంద్ అన్నారు ఆ ఆరోపణ నిరాధారమైందని ఆయన తిరస్కరించారు.

శ్రీ బి. రామశర్మ నియామకం

అటవీ వ్యవహారాల సలహాబోర్డు సభ్యుడుగా

హైదరాబాద్ ఆగస్టు 3

కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ బి రామశర్మను అటవీ వ్యవహారాల సలహా బోర్డు సభ్యునిగా నిన్న శాసనసభ నియమించింది

ఆయన నేడొక ప్రకటనలో ఇలా తెలిపారు.

రైతులు, ఆయా తాలూకా, జిల్లా రైతు సంఘాలు తమ ఇబ్బందులనుగురించి,అటవీ సమస్యలపై ప్రభుత్వానికి, అధికారులకు ఇచ్చే మెమోరాండాల ప్రతులను ఈ క్రింది చిరునామాలకు పంపవలసిందిగా కోరారు

శాసనసభ సమావేశ కాలంలో శ్రీ బి రామశర్మ, ఎఫ్.4-36, పొట్టి శ్రీరాములు నగర్, హైదరాబాద్‌కును, ఇతర సమయాల్లో శ్రీ బి రామశర్మ యం ఎల్ ఎ, కమ్యూనిస్టుపార్టి ఆఫీసు, దేవరకొండ పోస్టు, నల్లగొండజిల్లా, అని వ్రాయవలసిందిగా ఆయన కోరారు

తొలగించబడిన ఉద్యోగుల నియామకం

సీనియర్ ఉద్యోగులతొలగింపు

పెద్దాపురం, ఆగస్టు 1

తూర్పు గోదావరిజిల్లాలోని ఎన్ జి వోలు (ఎల్ డి సి) జూనియర్లను కొందరిని పోస్టులు ఖాళీ లేవనే సాకుతో జిల్లాకలెక్టరు తొలగించారు

ఉద్యోగాలు కోల్పోయినవారు హైకోర్టుకెళ్ళి స్టే తెచ్చుకున్నారు కోర్టు ఉత్తర్వు ప్రకారం వీరికి ఉద్యోగాలు యిచ్చారు కానీ ఈ ఉద్యోగులకన్నా సీనియర్లను ఉద్యోగాల నుండి తొలగించారు. ఈ తొలగింపబడిన సీనియర్లు కూడా కోర్టుకెళ్ళి 'స్టే' తెచ్చారు దాంతో వారికన్నా సీనియర్లయినవారు తమను కూడా తొలగిస్తారనే భయంతో ముందు గానే హైకోర్టుకెళ్ళి వారు కూడా 'స్టే' తెచ్చుకున్నారని తెలుస్తున్నది

రాజమండ్రి పట్టణానికి

వారానికి కుటుంబానికి 3 కిలోల ముతక బియ్యం

తుగ్లక్ ఫర్మానాలను గుర్తుకుతెచ్చే కలెక్టరు తాఖీదులు

(విశాలాంధ్ర విలేకరి)

రాజమండ్రి, ఆగస్టు 3

రాజమండ్రి పట్టణంలో కుటుంబానికి వారానికి 3 కిలోల బియ్యం యివ్వడానికి జిల్లాకలెక్టరు తాఖీదు లిచ్చారు.

ఇదేగాక గుంటూరు, పెద్దాపురంలో కూడా యిలాంటి తాఖీదు లివ్వబడటంచూస్తే జిల్లా కలెక్టరు స్వంతగా చేసిన నిర్ణయం కాదని, ప్రభుత్వ ఆదేశాల మేరకే యీ చర్యతీసుకోబడినట్లు అర్థమవుతున్నది

లోగడ బియ్యానికి కరువు ఏర్పడినపుడు పంచదార కార్డుపై రోజుకు రెండు కిలోల బియ్యం చౌకడిపోల ద్వారా సప్లయి చేయటంజరిగింది

రాజమండ్రిలో సుమారు 20 వేలమందికి పైగా కార్మికులున్న కుటుంబాలున్నాయి 5 గురు గల మధ్యతరగతి కుటుంబానికే రోజుకు కనీసం రెండు కిలో బియ్యం అవసరమవుతాయి అలాంటప్పుడు పంచదార కార్డుపై వారానికి కుటుంబానికి 3 కిలోలు సప్లయి కాబడతాయని యివ్వబడిన తాఖీదులు తుగ్లక్ ఫర్మానాలను గుర్తుకు తెస్తున్నాయి

ఆ మూడు కిలోలిచ్చే బియ్యం కూడా గండ్రనూక కలసిన ముతకరకం కిలో 105 పైసలు మానవులు తినేవిగా మాత్రం లేవు

కనుక యీ పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించి సక్రమంగా బియ్యం పంపకానికి పూనుకోకపోతే పరిస్థితులు విషమించే ప్రమాదముంది

టీకాలు వేసినందుకు హెల్త్ వర్కర్‌పై దౌర్జన్యం

నందమూరుగర్వు గ్రామంలో

భీమవరం, ఆగస్టు 1

పశ్చిమగోదావరిజిల్లా భీమవరంతాలూకా నందమూరు గర్వు గ్రామంలో హెల్త్ వర్కర్ శ్రీ ఆర్ సత్యనారాయణ అగ్గిబర్రి సర్పు అలిత పిల్లలకు మసూచి నిరోధక టీకాలు గత నెల 29 వ తేదీన వేస్తుండగా శ్రీ అరవ శేషారావు హెల్త్ వర్కర్ తన బిడ్డలు టీకాలు వేసినందుకు దుర్భాషలాడాడు పైగా కర్రతో కొట్టి దౌర్జన్యం చేసినాడు.

ఉద్యోగ నిర్వహణలో ఆటంకం కలుగించినాడు ఈ విషయాన్ని వెంటనే వీరవాసరం పోలీసుస్టేషన్‌లో రిపోర్టు చేయడమైనది.

కోనసీమ సహకార సెంట్రల్ బ్యాంకు ఎన్నికల తీరు

(విశాలాంధ్ర విలేకరి)

అంబాజీపేట, ఆగస్టు 3

కోనసీమ సహకార సెంట్రల్ బ్యాంకుపై ఆధిపత్యం సంపాదించేందుకు భూస్వామ్యవర్గానికి ప్రాతినిధ్యం వహించే రెండు ముఠాలు రామలింగరాజు నాయకత్వాన, సుబ్బరాజు నాయకత్వాన తీవ్రంగా పోటీ పడ్డాయి అయితే, మెజారిటీ స్థానాలు కైవశం చేసుకున్న రామలింగరాజునే తుదకు మైనారిటీలో పడిన సుబ్బరాజు ముఠా కూడా అంగీకరించటంతో ఏకగ్రీవంగా అధ్యక్ష స్థానానికి ఎన్నుకొని తమ వర్గ ప్రాబల్యాన్ని బలపర్చుకున్నారు'

కోనసీమలో కాంగ్రెసు రాజకీయాలకు ఆయువుపట్టుగా వున్న కోనసీమ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జులై 28 న జరిగాయి దేవాదాయ శాఖ మాజీమంత్రి శ్రీరామలింగరాజు, మాజీ సిండికేట్ ప్రముఖుడు శ్రీ మంతెన సుబ్బిరాజు ఈ బ్యాంకును చేతపట్టుకోడానికై తీవ్రంగా పోటీ పడ్డారు సుబ్బిరాజు క్యాంపులో కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరంసమితులఅధ్యక్షులు, చెయ్యేరు నియోజకవర్గ కాంగ్రెసు శాసన సభ్యుడు శ్రీ పళ్ళ వెంకట్రావు ప్రభృతులు తీవ్రంగా కృషి చేసారు మాజీ శాసనసభ్యుడు శ్రీ నడింపల్లి రామభద్రరాజును కూడా ఈ వర్గం తమలో చేర్చుకొని, అధ్యక్షపదవికి ఆయనను ముస్తాబు సైతం చేసింది

మొత్తం స్థానాలు 19 కాగా, వాటిలో తనతోసహా 8 స్థానాలను శ్రీ రామలింగరాజు పోటీ లేకుండా గెలుచుకున్నారు పోటీలోమరి నాలుగు స్థానాలను గెల్చుకొన్నారు సుబ్బరాజు వర్గానికి 7 స్థానాలు లభ్యమయ్యాయి. రెండు స్థానాలకు హైకోర్టు స్టే కారణంగా ప్రస్తుతం ఎన్నికలు వాయిదాపడ్డాయి దాదాపు బ్యాంకు స్థాపించబడినప్పటినుండి బ్యాంకు పరిపాలనపై విశేషమైన పలుకుబడి కలిగివున్న శ్రీ రుద్రరాజు పుల్లంరాజు (గోడి) నిలబెట్టిన 6 గురు అభ్యర్థులు ఓటమి పొందారు. ప్రారంభంలో రెండెకరాల భూస్వామి గల శ్రీ పుల్లంరాజు కీ॥ శే॥ కళా వెంకట్రావు ప్రాపకంవల్ల కోనసీమ బ్యాంకులో ప్రవేశించి 80 ఎకరాల భూస్వామిగా ఈ నాడు అభివృద్ధి చెందాడని జనవాక్యం

కొత్తగా ఎన్నికయిన 17 మంది డైరెక్టర్ల ప్రథమ సమావేశానికి శ్రీ నడింపల్లి రామభద్రరాజు అధ్యక్షత వహించారు ఆ సమావేశంలో బ్యాంకు నూతన అధ్యక్షులుగా శ్రీ రామలింగరాజు, ఉపాధ్యక్షుడుగా శ్రీ అకెళ్ళ సత్యనారాయణమూర్తి (నాని) ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు

ఈ ఎన్నికలను డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసరు శ్రీ యు వి నరసింహారావు నిర్వహించారు

పెనుమత్స సత్యనారాయణ రాజు మృతికి సంతాపం

కోనసీమ బ్యాంకు అధ్యక్షుడు శ్రీ పెనుమత్స సత్యనారాయణరాజు మృతికి సంతాప సూచకంగా కోనసీమ బ్యాంకు ఎంప్లాయీస్ ఈనెల 28 సాయంత్రం అమలాపురంలోని బ్యాంకు ఆవరణలో స్మారకసభ జరుపుకొన్నారు యూనియన్ అధ్యక్షుడు శ్రీ కె. వి. రావు సభకు అధ్యక్షత వహించారు. శ్రీ సత్యనారాయణరాజు అకస్మిక మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేస్తూ సమావేశం తీర్మానం చేసింది.

దమ్మగుండం కంచె స్వాధీనం సమస్య

కె. యల్. మహేంద్ర ప్రభృతులచే మెమొరాండం

హైదరాబాదు, ఆగస్టు 4

దమ్మగుండం కంచెను విడగొట్టి పేద రైతులస్వాధీనంచేయాలనీ, ఒక భూస్వామి అక్రమంగా అనుభవిస్తున్న 500 ఎకరాల ప్రభుత్వ బంజరును వెంటనే పేదరైతులకు పంచాలని డిమాండుచేస్తూ, కమ్యూనిస్టు ఎం ఎల్ సి, శ్రీ కె ఎల్. మహేంద్ర, హైదరాబాదు జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ ఎ ఆర్. దేవరాజ్‌లు రెవెన్యూబోర్డు ద్వితీయ సభ్యుడు ఎస్ ఒ. సింహా, కలెక్టరు టి లక్ష్మారెడ్డివద్దకురాయబారం వెళ్ళారు

ఈ కంచె సాగుకులాయకైనదనీ వీరిద్దరూ అంగీకరించారు అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి వారు అంగీకరించారు

సికారాబాద్‌లోని పశువుల మేతకు వదిలే భూములను సాగులోకి తీసుకురావలసిన ఆవశ్యకతపై కూడా ఈ రాయబారం వెళ్ళడం జరిగింది

బాదురేగూడాలోని 500 ఎకరాల భూమి రెవెన్యూ బోర్డు నిర్ణయం తర్వాత ప్రభుత్వ పరమైనప్పటికీ దాన్ని ఇంతవరకూ వేలం వెయ్యడంగానీ, పేదలకు పంచడం గానీ జరగలేదు అవినీతికరమైన పద్ధతుల్లో కింది అధికార్లు నోళ్ళుమూసి, ఒకభూస్వామి ఈ భూమిలో గడ్డిని యధేచ్ఛగా అకట్టుకుంటున్నాడు ఈ విషయంకూడా ఆ రాయబారంలో తెలియజేయడం జరిగింది ఆ భూమిని వెంటనే పేదలకు పంచాలని అధికార్లకు శ్రీ మహేంద్ర, దేవరాజ్ విజ్ఞప్తి చేశారు

"కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు"

భూ పరిమితి బిల్లుపై మార్క్సిస్టుపార్టీ విమర్శ

విజయవాడ, ఆగస్టు 2

శాసనసభలో ప్రవేశపెట్టిన భూ పరిమితి బిల్లుకొండను త్రవ్విఎలుకను పట్టినచందంగా వుందని రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ నేడొక ప్రకటనలో విమర్శించింది

ఈ బిల్లు, కాంగ్రెస్ నియమించిన ఉప సంఘం సిఫారసు అన్నిటికీ వ్యతిరేకంగా వుందనీ, ఈ పరిమితి బిల్లువల్ల ఏమైనా భూమి పంపిణీకి లభ్యమైనచో భూమిని పొందిన వ్యక్తి ప్రతి సంవత్సరం మామూలు శిస్తుతోపాటు నష్టపరిహారం క్రింద ఆ భూమి శిస్తుకు ఐదురెట్లు కనీసం పది సంవత్సరాలపాటు చెల్లించ వలసి వుంటుందని వివరించింది

ఒంగోలు బ్రాంచి ఆర్.టి.సి.ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ

ఒంగోలు, ఆగస్టు 2

ఒంగోలుబ్రాంచి ఆర్ టి సి ఎంప్లాయీస్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం జులై 30 న శ్రీ కర్నాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది సమావేశానికి రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పై వి రావు ఉపాధ్యక్షులు శ్రీ ఎం వి యన్ కపర్ధి హాజరయ్యారు

శ్రీ కపర్ధి మాటాడుతూ యిటీవల కార్పొరేషన్‌కు యూనియన్‌కు మధ్య జరిగిన ఒప్పందం చారిత్రాత్మకమైనదన్నారు యీ ఒప్పందం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మేనేజిమెంటు, యూనియన్‌ల ద్విపక్ష చర్చల ద్వారానే కుదిరిందని అన్నారు పరస్పర చర్చల ద్వారా కుదుర్చుకున్న యీ ఒప్పందం మేనేజిమెంటుకు లొంగిచేసుకున్నదికాదని, మొదటకార్మికులకు ఏమీయివ్వలేనన్న జనరలుమేనేజర్ చివరకు 3 కోట్లదాకా యివ్వటానికి ఒప్పుకున్నారని సోదాహరణంగా వివరించారు

ఒకవైపు చర్చలు, మరోవైపు ఐక్య కార్మిక ఆందోళనఫలితంగా యీ ఒప్పందం కుదిరిందన్నారు కార్మికులంతా యీ ఒప్పందంతో నూతనోత్తేజంపొంది యూనియన్‌ను పటిష్ఠవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు

శ్రీ పై వి రావు మాట్లాడుతూ మజ్దూర్ యూనియన్ నాయకులు రామమోహన్‌రావు చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, అతను కార్మిక ఐకమత్యం భగ్నం చేయబూనిన కార్మికద్రోహి అని, అతనువేసిన కరపత్రంలో పసలేదని అన్నారు

[illegible] యీ ఒప్పందం వలన పెరిగిన జీతాలు, సౌకర్యాలు, ఒప్పందంలోని అంశాలను ఆయన వివరించారు.

కడప సమితిలో అధిక దిగుబడి విత్తనాల వాడకం

కడప, ఆగస్టు 1

కడప పంచాయతీ సమితిలో కె సి, కాలువ ప్రాంతంలో ఐయ. బి. ఆర్ 8, బి ఆర్ 20, బి ఆర్ 204, చిత్ర కావేరి, మసూరి వంటి అధిక దిగుబడి వంగడాలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అధిక దిగుబడి వంగడాలను విస్తృత ప్రాతిపదికపై వినియోగించడానికీ, రైతులలో ప్రచారం చేయడానికి పంచాయతీ సమితి ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నది

ఈ కార్యక్రమం క్రింద విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు రైతులకు సప్లయి చేయబడుతున్నాయి. మినికిట్ కార్యక్రమం క్రింద 65 ప్రదర్శక క్షేత్రాలను ఐ ఇ టి 1991, సి ఆర్ 443 [illegible] ఏర్పాటు చేస్తారు. ఈసంవత్సరం ఖరీఫ్‌క్రింద 700 ఎకరాలలో సంకరజాతి సజ్జ వేయబడుతుంది

చేనేత కార్మికులకు నిర్ణయించిన కనీస వేతనాలు

విజయవాడ, ఆగస్టు 1

చేనేత కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 28 న జారీచేసిన ఉత్తర్వు వివరాలను మే 25 వ తేదీ గజెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది

ఈ కనీస వేతనాలను 1972 మే 25 నుండి అమలు జరపాలని, అలా అమలు జరిపనట్లయితే చట్ట విరుద్ధం కాగలదని, ఆంధ్ర చేనేత సహకార సంఘాల బిజినెస్ మేనేజర్ శ్రీ గంపల సూర్యం ఒక సర్క్యులర్ ద్వారా తెలియజేశారు

చేనేత కార్మికుల చిర వాంఛితమైన ఈ కనీస వేతనాల నిర్ణయాన్ని నిలుపు చేయాలని కోరుతూ చేనేత పరిశ్రమ యజమానుల తరఫున కోర్టులో రిట్ వేసినట్లు తెలుస్తున్నది.

కనీసవేతనాలు క్రిందివిధంగా వున్నాయి

నూలు వివరాలు	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1) ముతకనూలు (నెం 1 నుండి 20 వరకు)	0_60	0_10	0_10	0_20	1_00
2) మధ్యరకం నూలు (నెం 30 నుండి 40 వరకు)	0_80	0_40	0_10	0_25	1_25
3) సన్ననూలు (నెం. 60 నుండి 100 వరకు)	0_92	0_10	0_10	0_28	1_40
4) అతి సన్న నూలు (100 నెంబరు, అపైన)	1_30	0_10	0_10	0_30	1_80

మార్కెట్ ధరలు

విజయవాడ, అగస్టు 5

విజయవాడ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు నేడు అందచేసిన 4-8-72 నాటి టోకు ధరలు (క్వింటాలునకు సంచి ఖర్చులు వన్నులు మినహా).

ధాన్యం

	వెంబర్లు	అక్కుళ్ళు
విజయవాడ	96.00	80.00

బియ్యం

విజయవాడ	150.00	122.00

అపరాలు

	కందులు	మినుములు
విజయవాడ	155.00	225.00
రాజమండ్రి	140.00	225.00
	పెసలు	శనగలు
విజయవాడ	180.00	145.00
రాజమండ్రి	170.00	

వేరుశనగ

	కాయలు	పప్పు	నూనె
విజయవాడ			450.00
నంద్యాల	157.50	210.00	422.50

బెల్లం

	1వ రకం	2వ రకం	3వ రకం
అనకాపల్లి	198.00	180.00	164.00

ధనియాలు

విజయవాడ	165.00

పసుపు

	కొమ్ములు	దుంపలు
దుగ్గిరాల	234.50	192.00
కడప	187.00	180.00

మిర్చి

	1వ రకం	2వ రకం
గుంటూరు	300.00	280.00

ప్రత్తి

	పారం	లక్ష్మి
ఆదోని (ప్రత్తి)	173.00	235.00
ఆదోని (దూది)	440.00	375.00

చింతపండు

	వ రకం,	2వ రకం
మదనపల్లి	170.00	160.00

కొబ్బరికాయలు

(1000)	కొత్తవి,	పాతవి
విజయవాడ	400.00	450.00
పాలకొల్లు	370.00	400.00

	బంగారం	వెండి
విజయవాడ		

నూలు పంపిణీ పథకం విఫలమైతే చట్టబద్ధ చర్యలు

రాజ్యసభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 4.

ఈ నెలనుండి ప్రారంభమైన నూలు పంపిణీ, ఉత్పత్తికి సంబంధించిన స్వచ్ఛంద పథకం విఫలమైనచో దీనిపై అదుపుకు చట్టబద్ధమైన పథకం ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం వెనకాడబోదని నేడు రాజ్యసభలో విదేశ వాణిజ్యమంత్రి శ్రీ ఎల్ ఎన్ మిశ్రా ఒక సావధాన తీర్మానానికి సమాధానమిచ్చారు

నూలు ధర విపరీతంగా పెరిగిపోవడం వస్త్రాల నిలువలు పెరిగిపోవడంవల్ల చేనేత పరిశ్రమ, మరమగ్గాల పరిశ్రమల్లో సంక్షోభం ఏర్పడిందని శ్రీ ఎ జి కులకర్ణి తదితరులు ప్రవేశపెట్టిన తీర్మానానికి మంత్రి సమాధాన మిస్తూ చేనేత కార్మికులకు యిబ్బంది కలుగకుండా చూస్తానని హామీ యిచ్చారు

చేనేత పరిశ్రమలో సంక్షోభం తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలతో ముందుకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు రూపొందించినచో కేంద్రం తప్పకుండా సహాయం చేస్తుందని మంత్రి అన్నారు

భారత వాణిజ్య నౌక గుజరాత్ తీరంలో మునక

31 మంది సిబ్బంది జాడతెలియని స్థితి

బొంబాయి, ఆగస్టు 4

భారత రవాణా నౌక "దా హోదర్ మండూలి" గుజరాత్ తీరంలో సౌరాష్ట్ర ప్రాంతంలో జూలై 29న మునిగిపోయింది సిబ్బందిలో 31 మంది జాడ తెలియడంలేదు

సిబ్బందిలో నౌకాకెప్టెన్‌తోసహా ఆరుగురు మాత్రం ఎలాగో ప్రాణాలు రక్షించుకుని గుజరాత్‌లోని ఒక గ్రామం చేరుకున్నారు వారు నేడు బొంబాయి చేరుకున్నారు చాలా నీరసంగా వున్నారు వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నౌకలోని 37 మంది సిబ్బందిలో మిగిలినవారి జాడ తెలియడం లేదు ఈ నౌకజాడను అన్వేషించేందుకు ప్రత్యేకంగా హెలికాప్టర్లు, నౌకలు పంపారు సిబ్బందిలో మిగిలినవారి జాడకై అన్వేషణలో పాకిస్తాన్ అధికార్ల సహకారాన్ని భారత్ అధికార్లు కోరారు

త్వరలో ఎలెక్ట్రిక్ టైప్ రైటర్ల ఉత్పత్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఈ సంవత్సరం ఆఖరుకు మొట్టమొదటి సారిగా స్వదేశంలోనే తయారైన ఎలెక్ట్రిక్ టైపు రైటర్లు మార్కెట్‌లోకి విడుదల అవుతాయని, పరిశ్రమల డిప్యూటీ మంత్రి శ్రీ సిద్దేశ్వర ప్రసాద్ నేడు రాజ్యసభలో చెప్పారు.

కలరావల్ల 30 మంది మృతి

ఆముదాలవలస బ్లాకులో

శ్రీకాకుళం, ఆగస్టు 5

శ్రీకాకుళం జిల్లా టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం మరియు శ్రీకాకుళం తాలూకాలలో కలరా వ్యాపించి యున్నది ఆముదాలవలస బ్లాకు ఏరియాలో 200 మందికి సోకగా 30మంది మరణించారు వైద్య సౌకర్యం కల్గించని కారణంగా మరణములు సంభవించు చున్నవి రెండు లేక మూడుసార్లు వాంతులు విరోచనములు అవడం మరణించడం జరుగుచున్నది వర్షాలు లేక చెరువులు ఎండిపోతున్న మురికినీరు త్రాగుటవలన ఈ వ్యాధి సంభవిస్తున్నట్లు ఆరోగ్యాధికారులు చెప్పారు

విద్యారంగ భారాన్ని మున్సిపాలిటీలు మరింత భరించాలి

మంత్రి కాకాని ప్రకటన

విజయవాడ, ఆగస్టు 5

విద్యారంగ భారాన్ని మున్సిపాలిటీలు మరింతగా భరించవలసి వున్నదని, పూర్తి విద్యా గ్రాంట్లు యిచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం నేడిక్కడ ప్రకటించారు

విజయవాడ శాలేయ ఉపాధ్యాయ సంఘం ప్రథమ విద్యా సాంస్కృతిక మహాసభలను ఆయన నేడు ప్రారంభించారు

"పాఠశాలలకు వెళితే అంతా కాకిగోల"గా వుంటుందని అంటూ, ఉపాధ్యాయులు పాఠశాలల్లో మంచి వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు

తమ వేతనాలను పెంచమని వుపాధ్యాయులు ఏవిధంగా కోరుతున్నారో, అదే తరహాలో విద్యను బోధించాలని విజ్ఞప్తి చేశారు

మున్సిపాలిటీలకు పూర్తి విద్యాగ్రాంట్లను మంజూరు చేయాలంటే కొన్ని కోట్ల రూపాయలు అవసరమని, ఇంత డబ్బును భరించే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని అన్నారు. ఇందువలన మున్సిపాలిటీలు విద్యారంగ భారాన్ని మరింతగా భరించవలసి వుంటుందని అన్నారు.

శ్రీ తేలప్రోలు వెంకటేశ్వర్లు స్వాగతం పలుకుతూ, అదనపు సెక్షన్లు గ్రాంటు చేయడం గ్రాంటుచేసిన సెక్షన్లకు సిబ్బందిని నియమించడం, నియమించిన సిబ్బందికి వేతనాలు మంజూరు చేయటంలో రెడ్ టేపిజం జరుగుతున్నదని అన్నారు

అధ్యక్షత వహించిన శ్రీ పచ్చిపులుసు వెంకట సుబ్బారావు ప్రసంగిస్తూ, ఉచిత విద్యా బోధనా పద్ధతివలన ఆశించిన ప్రయోజనాలు నెరవేరటంలేదని అన్నారు

పి. యఫ్. సమస్య

విజయవాడ మున్సిపల్ స్పెషల్ ఆఫీసరు శ్రీ ప్రసాదరావు ప్రసంగిస్తూ పట్టణంలోని 688 మంది ఉపాధ్యాయులలో 73 మందికి మాత్రమే పి. యఫ్ అకౌంట్లు లేవన్నారు.

పట్టణ ఉపాధ్యాయ సంఘ నాయకుడు యీ విషయమై ఒక ప్రకటనచేస్తూ పట్టణ ఉపాధ్యాయులు రు. 8 లక్షలు పి యఫ్ అకౌంట్ క్రింద చెల్లించారని, మున్సిపాలిటీ యిందుకుగాను మరో రు 8 లక్షలు చెల్లించవలసి వుంటుందని అన్నారు రిటైర్ అయిన వారికి పి యఫ్‌లు వెంటనే చెల్లించబడక పోవడం, పి యఫ్ అకౌంటులు సరిగా లేని స్థితిని సూచిస్తున్నదన్నారు

కృష్ణాజిల్లా డి ఇ ఓ శ్రీ ఎన్ వెంకటస్వామి ప్రసంగిస్తూ, జిల్లాకు అవసరమనుకున్న పాఠ్యగ్రంథాల సంఖ్యకన్నా రెట్టింపు పాఠ్యగ్రంథాలు అమ్ముడు పోయాయని అయినాపాఠ్యగ్రంథాల కొరతగూర్చి ఫిర్యాదు లందుతున్నాయని వెల్లడించారు.

శ్రీయుతులు దమ్మాలపాటి రామారావు వై. చంద్రశేఖర్ ప్రేమానందం, వై. రాజగోపాలరావు, శ్రీమతి కోటీశ్వరమ్మ ప్రభృతులు ప్రసంగించారు (వి. వి)

యల్. ఐ. సి. ఉద్యోగుల సమ్మె

న్యూఢిల్లీ, ఆగస్టు 5

న్యూఢిల్లీలోని జీవితబీమా కార్పొరేషన్ జోనల్ ఆఫీసు ఉద్యోగులు, ఆఫీసు వాచ్‌మెన్ శ్రీ పిరారసింగ్‌ను హత్యచేయటాన్ని నిరసిస్తూ నేడు సమ్మె చేశారు

కార్పొరేషన్ బేస్‌మెంట్ గది తాళాలు కూడా పగులగొట్టబడి వున్నాయి ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు

వినుకొండతాలూకా గ్రామంలో ఇద్దరి మృతి

గాస్ట్రో ఎంట్రిటీస్ వ్యాధివల్ల

వినుకొండ, ఆగస్టు 4

గుంటూరుజిల్లా వినుకొండ తాలూకా చాబెండ్ల గ్రామంలో గాస్ట్రో ఎంట్రిటీస్ వ్యాధిలో ఒక స్త్రీ, ఒక పురుషుడు మరణించారు దాదాపు 15 మందికి ఈ వ్యాధి సోకింది వాంతులు విరోచనాలు యీవ్యాధి వల్ల ఏర్పడుతున్నాయి

కలరా అని ప్రజలు భయపడుతున్నారు అయితే డాక్టర్లు మాత్రం కలరా కాదని గాస్ట్రోఎంట్రిటీస్ అనే వ్యాధని చెబుతున్నారు ఈనమోలు, ఏనుగుపాలెం పిన్నా గ్రామాలకు కూడా యీవ్యాధివ్యాపిస్తున్నది. ఆరోగ్యశాఖ అధికార్లు ఎలాటి చర్యలు చేపట్టడం లేదు అవసరమైన మందుల్ని ప్రభుత్వం సరఫరా చేయడంలేదు.

యువతిని రక్షించబోయిన యువకుని దుర్మరణం

భీమవరం, ఆగస్టు 4

భీమవరంలో నేటి మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో ఆత్మహత్య చేసుకుంటున్న ఒకయువతిని రక్షించడానికి యత్నించిన ఒకయువకుడు ఆ ప్రయత్నంలో తాను కూడా ప్రాణాలుపోగొట్టుకొన్న దుర్ఘటన జరిగింది పాలకోడేరుకు చెందిన విరుపూరి అప్పల నరసమ్మ అనే 28 సంవత్సరాల యువతి ఒక రిక్షాలో వచ్చి, రిక్షాలో 2సంవత్సరాల మగపసికందును వదిలి రైలు బ్రిడ్జి ఎక్కి అక్కడినుండి కాల్వలో దూకింది సమీపంలో ఆ దారంట వెడుతున్న కలిగిరి కోటేశ్వరరావు అనే 27 సంవత్సరాల యువకుడు ఆమెను కాపాడేందుకై సాహసించి తాను కూడా నీటిలో దూకాడు. కాని ఆ ప్రయత్నంలో విఫలమైనాడు.

ప్రమాదంలో అతనుకూడా మరణించాడు ఈ యువకుడు ఉండికి చెందినవాడు. రెండు భౌతిక దేహాలు దొరికాయి.

అత్యవసర ప్రాతిపదికపై కరువుప్రాంతాలకుసహాయం

రాష్ట్రాలకు కేంద్రం వర్తమానాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4.

దేశంలో అనేక రాష్ట్రాలలో ఏర్పడిన కరువుపరిస్థితులవల్ల కల్గిననష్టాలను వెంటనే అంచనా వేసి నివేదికలు పంపాల్సిందని అత్యవసర ప్రాతిపదికపై సహాయం విషయం కేంద్రం నిర్ణయిస్తుందనిరాష్ట్రాలకు పంపిన సమాచారంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది. వివిధ రాష్ట్రాలు వెంటనే ఆహారపదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు, సాధ్యమైనన్ని మిగిల్చేటట్టు తీవ్రచర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్రాలను కోరింది

రాష్ట్రాలకు సీనియర్ అధికార్లను పంపుతామని వారితో చర్చించి అవసరాలు నిర్ణయించవచ్చని కేంద్రం తెలిపింది. ఉన్న విద్యుత్ వనరుల్ని సాధ్యమైనంత మెరకు పంపుసెట్లు వినియోగానికై మళ్ళాల్సిందిగా కోరింది. వెంటనే నీటి వనరులను సమీకరించి పొలాల్లో ఉన్న పంటను రక్షించాలని కోరింది ఖరీఫ్, రాబీ ల కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు మొత్తాలను తెలపాలని కోరింది. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన మొత్తం సాయం చేయడానికికేంద్రం సిద్ధంగావుందని తెలిపింది.

సాధ్యమైనంత త్వరలో నష్టాల వివరాలను తెలుపమని కోరింది.

కరువువల్ల దెబ్బతిన్న కుటుంబాల కొనుగోలుశక్తి పెంచేందుకు గాను వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ప్రత్యేకంగా కోరింది

పాఠ్య పుస్తకాల వ్యవహారంపై దర్యాప్తు సంఘం

శ్రీ వావిలాల అధ్యక్షతన

హైదరాబాద్, ఆగస్టు 4

పాఠ్యపుస్తకాలు సకాలంలో లభ్యం కాకపోవడం, ముద్రణాలయంలోని లోపాలను మున్నగు విషయాలను పరిశీలించి మూడు నెలలలోగా నివేదిక అందచేయడానికి శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షతన కమిటీని నియమించామని శాసనమండలిలో ఒక ప్రశ్నకు మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి సమాధానమిచ్చారు.

ఈ సంఘంలో సభ్యులుగా ఉభయశాసన సభ సభ్యులు కొందరు వున్నారని ఆయన తెలిపారు

విజయవాడ వద్ద ఇద్దరు కేరళ నక్సలైట్ల అరెస్టు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఆగస్టు 4

కేరళకు చెందిన ఇరువురు నక్సలైట్లను విజయవాడ పరిసర ప్రాంతాలలో గతరాత్రి అరెస్టుచేసినట్లు పోలీసు అధికారులు నేడు ప్రకటించారు

విజయవాడ పరిసర ప్రాంతాలలోని ఒక గుడిసెలో వుంటగా పోలీసులు దాడిచేసినట్లు గుడిసెలో 5 గురు వ్యక్తులు వున్నారని, వారిలో ముగ్గురు పారిపోయారని, ఇరువురు మాత్రమే అరెస్టు అయ్యారని పోలీసు అధికారుల కథనం

అరెస్టు అయినవారు నక్సలైట్లు అని, వారిపేర్లు లక్ష్మణన్ కృష్ణన్, అని అధికార్లంటున్నారు

పోలీసులు యింకాయిలా తెలియ జేశారు

లక్ష్మణన్ వయస్సు 28 సంవత్సరాలు కునిక్కల్ నారాయణ్ ముఖ్య అనుచరుడనని కాలికట్‌లో చారుమజుందార్ ఉపన్యాసాన్ని తాము 1967 లో విన్నామని లక్ష్మణన్ చెప్పారు

కన్ననూర్ జిల్లా పున్నూర్‌కు చెందిన లక్ష్మణ్‌ను1970 లో కేరళ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసినపుడు అరెస్టు చేశారు తర్వాత విడుదల చేశారు.

ప్రస్తుతం అరెస్టుకాబడినప్పుడు లక్ష్మణ్ వద్ద "లిబరేషన్" మాసపత్రిక ప్రతులు, మావో సూక్తులు వున్నాయి.

కరాటు కృష్ణన్ వయస్సు 29 సంవత్సరాలు మల్లాపురంజిల్లా పసపననగాడికి చెందినవారు లక్ష్మన్ ముఖ్య అనుచరుడు. మద్రాసులో 1971 లో ఒకసారి అరెస్టు అయ్యాడు.

విజయవాడ చుట్టుప్రక్కల ప్రాంతాలలో గల నక్సలైట్లను సమావేశపరచి ఉద్యమాన్ని పునర్నిర్మించ చేసేందుకు వచ్చారని అధికారులు చెపుతున్నారు

ఖాడిల్కార్ ఢాకా రాక

ఢాకా, ఆగస్టు 4

కేంద్ర పునరావాస కార్మిక శాఖ మంత్రి శ్రీ ఖాడిల్కర్ బంగ్లాదేశ్‌లో 3 రోజుల పర్యటనకై నేడిక్కడకు వచ్చారు బంగాదేశ్ మంత్రి శ్రీ కామరుజ్జమాన్ ఆహ్వానంపై ఖాడిల్కర్‌లో బంగ్లాదేశ్ పర్యటిస్తున్నారు, ఇక్కడ అనేకవిషయాలను గురించి ఆయన చర్చిస్తారు

యాసిడ్ త్రాగి యువకుని మృతి

ఆత్మహత్యని అనుమానం

విజయవాడ, ఆగస్టు 4

విజయవాడ కొత్తపేటకు చెందిన శ్రీకొండూరు బ్రహ్మానందరావు సల్ఫ్యూరిక్ యాసిడ్ త్రాగిన కారణంగా స్థానికప్రభుత్వ హాస్పిటల్‌లో నేడు మృతి జెందాడు

శ్రీ బ్రహ్మానందరావు వయస్సు 30 సంవత్సరాలు. ఉదయం 7 గంటల ప్రాంతంలో సల్ఫ్యూరిక్ యాసిడ్ త్రాగగా 11 గంటలకు హాస్పిటల్‌లో చేర్చారు సాయంత్రం నాలుగు గంటలకు మృతి చెందాడు ఆత్మహత్య అని భావించబడుతున్నది

కొంత కాలంగా మానసికంగా అస్వస్థులుగావున్నట్లు తెలుస్తున్నది

సల్ఫ్యూరిక్ యాసిడ్ త్రాగి మృతిచెందినట్లు మాజిస్ట్రేట్‌కు తెలియజేశారు

రాష్ట్రపతి ఆమోదముద్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూముల అన్యాక్రాంతాలను నిషేధిస్తూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు నేడు రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించింది

ప్రజాతంత్ర హక్కుల దినంగా ఆగస్టు 15

కలకత్తా, ఆగస్టు 4

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని 'ప్రజా తంత్ర హక్కుల కోసం జరిగే పోరాట దినం'గా పాటించాలని పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన వున్న సంఘటన నేడు నిర్ణయించింది.

ప్రపంచ చదరంగంలో

10 వ గేమ్‌లో ఫిషర్ గెలుపు

స్పాస్కీపై 3 పాయింట్లు ఆధిక్యత

రేక్‌జెవిక్, ఆగస్టు 4

అమెరికన్ ఆటగాడు బాబీఫిషర్ ఇక్కడ జరుగుతున్న ప్రపంచ చదరంగంపోటీ 10వ గేములో స్పాస్కీపై గెలుపు సాధించాడు నిన్న వాయిదా పడిన ఈ గేమ్ నేడు తిరిగి ప్రారంభమయాక 56 వ ఎత్తులో స్పాస్కీ ఆట విరమించుకున్నారు

ఫిషర్ ఇప్పుడు స్పాస్కీపై 3 పాయింట్ల ఆధిక్యతలో ఉన్నారు ఇంకా 14 గేములు జరగాల్సి ఉంది

ఫిషర్ గెలిస్తే, ఈయనే అమెరికాకు ప్రప్రథమ ప్రపంచ చదరంగ ఛాంపియన్ అవుతారు ఇంతవరకు ఈ ఛాంపియన్ షిప్‌ను సోవియట్ క్రీడాకారులే గెల్చుకుంటున్నారు

నిన్నరాత్రి 40వ ఎత్తువద్ద ఆట వాయిదా పడింది నేడు ఆట ప్రారంభ మవాల్సిన సమయానికి ఎవరూ రాలేదు ఆ తరువాత ఫిషర్‌వచ్చి నిన్నరాత్రి సీలుచేసిన 41 వ ఎత్తు వేశారు

వ్యవసాయ కార్మికులకు వేతన సంఘాన్ని ఏర్పరచేది లేదు

న్యూఢిల్లీ, ఆగస్టు 4

వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక వేతన సంఘాన్ని ఏర్పాటుచేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కార్మికశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బాలగోవిందవర్మ నేడు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ యోగేంద్రశర్మ ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు

కార్మిక యంత్రాంగ పరిధిని విస్తృతం చేయనవసరంలేదని కూడా మంత్రి తెలియ చేశారు.

వ్యవసాయ కార్మికులకు కనీసవేతనాలను చెల్లించడంలేదన్న విషయం ప్రభుత్వ దృష్టికి రాలేదని కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు ఈ లాంటి సంఘటనలు అనేకం తాము ప్రభుత్వ దృష్టికి తెచ్చామని శ్రీ భూపేష్ తెలియజేశారు

టిస్కో కంపెనీని జాతీయం చేసే యోచనలేదు

టాటా ఐరన్ అండ్ స్టీల్‌కంపెనీనిగాని లేదా టాటా ఇంజనీరింగ్ అండ్ లోకో మోటివ్ కంపెనీనిగాని జాతీయం చేసే సంకల్పం ప్రభుత్వానికి లేదని ఉక్కుశాఖ స్టేట్‌మంత్రి శ్రీ షానవాజ్‌ఖాన్ తెలియజేశారు ఈ రెండు కంపెనీలలో ప్రభుత్వంగ ఆర్థికసంస్థలకు గల వాటాల వివరాలను ఆయన సభ ముందుంచారు,

యూనియన్ల గుర్తింపుపై సమగ్ర శాసనం

ఒక పరిశ్రమలోగాని, సంస్థలోగాని మెజారిటీ యూనియన్ గుర్తించటానికి, తదితర అంశాలకు సంబంధించి సమగ్ర శాసనాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నదని కార్మిక శాఖ మంత్రి శ్రీ ఆర్ కె ఖాడిల్కర్ శ్రీ హెచ్ యస్ నరసయ్య ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు

కేరళ యూనివర్శిటి చట్టానికి రాజ్యాంగ రక్షణ

చంద్రప్పన్ చేబిల్లు ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఆగస్టు 4

1969 కేరళ విశ్వవిద్యాలయ చట్టంలోని కొన్ని నిబంధనలను సుప్రీమ్ కోర్టు కొట్టివేసిన దృష్ట్యా, వాటికి రాజ్యాంగ రక్షణను కల్పించటానికి అవకాశాన్ని యిచ్చేబిల్లును ప్రతిపాదించేందుకు కమ్యూనిస్టుపక్ష సభ్యులు శ్రీ సి కె చంద్రప్పన్‌కు లోకసభ నేడు అనుమతి యిచ్చింది

బిల్లును ప్రతిపాదించటానికి కేరళ కాంగ్రెస్ సభ్యులు శ్రీ వి జార్జి లేవనెత్తిన అభ్యంతరాలను సభ తిరస్కరించింది

బిల్లును ప్రతిపాదించటాన్ని శ్రీ జార్జి వ్యతిరేకిస్తూ ఇది మైనారిటీవర్గాల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించటమేనని అన్నారు విద్య రాష్ట్రానికి సంబంధించిన అంశమని అందుచేత ఈ విషయంపై శాసనంచేసే అధికారం పార్లమెంటుకు లేదని ఆయన అన్నారు

శ్రీ చంద్రప్పన్ మాట్లాడుతూ సుప్రీమ్ కోర్టు కొట్టివేసిన నిబంధనలను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూలులో చేర్చటం అవసరమని అన్నారు

కేరళలో కార్పొరేట్ మేనేజిమెంట్లు నడిపే విద్యాసంస్థలపై ప్రభుత్వం అజమాయిషీని పొందటానికి ఈ నిబంధనలు అవసరమని ఆయన అన్నారు

కోకింగ్ బొగ్గుగనుల జాతీయం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

దేశంలోని 214 కోకింగ్ బొగ్గుగనులు, 12 కోక్ ఓవెన్ కర్మాగారాల జాతీయకరణకు సంబంధించిన బిల్లును స్వల్ప సవరణలతో నేడు లోక్ సభ ఆమోదించింది

వీటి యాజమాన్యాలను ప్రభుత్వం గత సంవత్సరం స్వాధీనం చేసుకున్నది

బిల్లుపై జరిగిన రెండురోజుల చర్చకు ఉక్కుశాఖ మంత్రి శ్రీ మోహన్‌కుమారమంగళం సమాధానం చెబుతూ కోకింగ్ బొగ్గుగనుల యాజమాన్యాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అనంతరం కార్మికుల పరిస్థితి మెరుగుపడిందని అన్నారు. మొదటి సారిగా కార్మికులకు వేతన సంఘం సిఫారసుల మేరకు వేతనాలను చెల్లించడం జరుగుతున్నదని అన్నారు

గ్రామీణపట్టణఆదాయాలపై పరిమితి యోచనలేదు

గ్రామీణ పట్టణ ఆదాయాలపై శాసనం ద్వారా పరిమితి విధించేయోచన ప్రభుత్వానికి లేదని ఆర్థికశాఖమంత్రి శ్రీ వై బి చావన్ నేడు లోక్‌సభలో తెలియజేశారు

అయితే ఇటీవలి సంవత్సరాలలో ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలవల్ల ఆదాయాలపై పరిమితి విధించినట్లే కాగలదని ఆయన అన్నారు

అనధికార రాజ్యాంగ సవరణ బిల్లుకు తిరస్కృతి

ప్రధాన మంత్రి సలహాతో నిమిత్తం లేకుండా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించే నిమిత్తం రాజ్యాంగంలోని 74 వ నిబంధనను సవరించాలని కోరుతూ ఇండిపెండెంటు సభ్యులు డాక్టర్ కర్ణీసింగ్ ప్రవేశపెట్టిన అనధికార బిల్లును లోక్‌సభ నేడు తిరస్కరించింది

డాక్టర్ కర్ణీసింగ్ సభలో లేని సమయంలో బిల్లును ఉపసంహరించటానికి వీలులేనందున బిల్లును ఓటింగుకు పెట్టారు, సభలోవున్న సభ్యులలో 99 మంది బిల్లుకు వ్యతిరేకంగా ఓటుచేశారు తక్కినవారు ఓటింగ్‌లో పాల్గొనలేదు

3 రాజ్యాంగ సవరణ చట్టాలపై రిట్

న్యూఢిల్లీ, ఆగస్టు 4

1969 కేరళ భూసంస్కరణల సవరణ చట్టాన్ని సవాలుచేస్తూ కేరళకు చెందిన కేశవానందభారతి అనే స్వాములవారు సుప్రీం కోర్టులోరిట్ వేశారు ఇప్పుడాయన యిటీవల రాజ్యాంగానికి చేసిన 3 ప్రధాన సవరణలు24వ,25వ, 29వ సవరణ చట్టాల్ని కూడా సవాలు చెయదల్చినట్లు చెప్పారు సుప్రీంకోర్టు గనక యీ రిట్‌ను విచారణకు తీసుకుంటే పై సవరణ చట్టాలన్నిటిపైనా విచారణ సాగుతుంది,

ప్రకటన

గుడివాడ తాలూకా శ్రీనివాసపురం కాపురస్తులు (1) వీరమాచనేని కృష్ణమూర్తి (2) లక్ష్మి మైనర్లు యినందున గార్డియన్-తాత అద్దుమిల్లి సత్యనారాయణ సంజాయిషీ ప్రకారం తెలియజేయునది, సదరు శ్రీనివాసపురం కాపురస్తుడు, వీరమాచనేని భద్రయ్య తనభార్య అయిన దేవీసరోజినీని అనగా (నా క్లయింట్ల తల్లిని) హత్య చేసిన సందర్భములో గుడివాడ తాలూకా పోలీసువారు వీరమాచనేని భద్రయ్యను అరెస్టు చేసి కోర్టులో P R C-2/72 గా క్రిమినల్ కేసు నడుపబడుచున్నది సదరు భద్రయ్యా జైలులో వున్నాడు సదరు భద్రయ్యకు యింతవరకు ఏ ఋణములేవు అతనిని లోబరుచుకుని, మైనర్లకు నష్టము కలుగ చేసి అక్రమపు లాభం పొందవలెననే దురుద్దేశ్యములో. అతనిచేత అన్యాక్రాంత ములు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి అట్టివి ఏమైనా నా క్లయింట్లను ఆ ప్రకారము Bind చేయజాలవని తెలియ చెయడమైనది ఎందుకు మైనర్లకు చెందవలసిన ఆస్తులు నా క్లయింట్లు గార్డియన్ అయిన అద్దుమిల్లి సత్యనారాయణగారి స్వాధీనంలో వున్నవి

వై. వి. రమణరావు
అడ్వకేటు, గుడివాడ

దీపాలంకరణ పోటీ

విజయవాడ లైన్స్ క్లబ్‌చే

విజయవాడ, ఆగస్టు 4

స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా ఆగస్టు 14 రాత్రి విద్యుత్ దీపాలంకరణ పోటీని లైన్స్ క్లబ్ నిర్వహిస్తుంది ఆగస్టు 14 రాత్రి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరింపబడిన వాటికి బహుమతి యిస్తారు ఎంట్రీలను జి. ధర్మారావు, లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు- 164, వస్త్రలత, విజయవాడ-1కు ఆగస్టు 10 లోగా పంపాలి.

నూతన నటీ నటులకు అవకాశము

భాగ్యోదయా పిక్చర్సు సమర్పించు

సమాజానికి సవాల్

(మహోజ్వల సామాజిక సంచలన చిత్రం)

దర్శకత్వం: డి. బాలగంగాధర తిలక్
నిర్మాత: కె. సత్యనారాయణ
సంభాషణలు: భీశెట్టి లక్ష్మణరావు
కథ.: రవిశంకర్
నిర్వాహణ: జి వి రావు
ఆఫీస్ ఇన్‌ఛార్జి: వి బాబూరావు
ప్రొడక్షన్: తుమ్మల నారాయణరావు

ఈ చిత్రములో కొన్ని ముఖ్యపాత్రలు క్రొత్త నటీ నటులకు ఇవ్వబడును. ఉత్సాహము, సమర్థత గలవారు ఫొటోలతోబాటు వివరములు పంపగలరు. స్త్రీలకు నాట్యము, సంగీతము ప్రత్యేకార్హతలు

భాగ్యోదయా పిక్చర్సు
గాంధీనగరం - విజయవాడ - 3

గమనిక: ముందుగా తెలియపరచనిదే ఇంటర్వ్యూలు జరుపబడవు



త్వరలో! అశోక్‌కుమార్ మీనాకుమారి రాజ్‌కుమార్

కమాల్ అమ్రోహి సమర్పించు

పాకీజా

జనజీవన్ డిస్ట్రిబ్యూటర్స్ ఫోను 77114
141, రాష్ట్రపతిరోడ్, సికిందరాబాదు.

మహిళాలోకం అపూర్వ ఆదరణ!
ప్రతి ఆటకు సగానికిపైగా మహిళలే!!
16 రోజుల్లో 6 లక్షలమందికిపైగా
మహిళలు చూసి ఆనందించారు!
అన్ని తరగతుల వారినీ
ఆకర్షించిన చిత్రం!

హైదరాబాదు & సికిందరాబాదు	78,478
విజయవాడ	43 666
విశాఖపట్నం	27,827
గుంటూరు	45 233
కాకినాడ	74,000
రాజమండ్రి	30,023
నెల్లూరు	42 000
విజయనగరం	31 413
ఏలూరు	20 667
భీమవరం	17 265
గుడివాడ	21 585
కర్నూలు	21 333
అనంతపురం	20 192
బళ్ళారి	18,667
తిరుపతి	16 469
కడప	16,568
చీరాల	18 667
తెనాలి	17,333
ఒంగోలు	15 622
మచిలీపట్నం	14,528
వరంగల్	15,316
ఖమ్మం మెట్టు	12,849
శ్రీకాకుళం	11 151

తప్పక చూడండి! పండంటి కాపురం



ఆగష్టు 11 విడుదల!

శ్రీసంజీవి మూవీస్

నీతి నిజాయితి

నిర్మాతలు
M.లక్ష్మీకాంతరెడ్డి, H.V.సంజీవరెడ్డి.
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
శింగీతం శ్రీనివాసరావు.
సంగీతం
స.రాజేశ్వరరావు.



ఆగస్టు 18 విడుదల

సుభాషిణీ ఆర్ట్ పిక్చర్సు

విచిత్ర దంపతులు

నిర్మాత-దర్శకుడు: కె. హేమాంబరధరరావు
కథ-మాటలు: భమిడిపాటి రాధాకృష్ణ
సంగీతం: కోదండపాణి
కెమెరా: శేఖర్-సింగ్
కళ: బి యస్ కృష్ణ
కూర్పు: బి.గోపాలరావు
నిర్వహణ: కె. మహేంద్ర

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ ఏ. వెంకటేశ్వరరావు, ఎడిటర్: సి. రాఘవాచారి, ముద్రణ విశాలాంధ్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ విజయవాడ-4 R. No. 1138/57

విశాలాంధ్ర ఆదివారం అనుబంధం
6-8-72



జీవన గీతం

సోయం
గాంగ్ నాఫ్, అనువాదం: రాజేశ్వరరావు

పరులు చూడని గుట్టమాటున
బరువుగా ఊపిరిని విడచుచు
కటిక చీకటి రాత్రిలో నీ
కన్నుదోయి బరపితివి దిశల!

ఎంత చక్కని
గ్రామమో ఇది?
పురులుగట్టిన ధాన్యరాసులు
విరగకాసిన ఫలభరమ్మున
శిరమువంచిన తరులు ఎన్నో!

కిన్నెరలు పాడేటి పాటల
కించపరచే యేటి గలగల!
పల్లెపట్టుల సౌందర్యమూ
పల్లెలో మూర్తీభవించెను!

రెల్లుకప్పుల ఇళ్ళముంగిట
కల్ల లెరుగని చిన్నపిల్లల
ఆటపాటల కలకలలతో
ఆ ప్రాంతమే
మ్రోగుతున్నది?

ధాన్యరాసుల దంచు వేళల
నిత్య జీవన కర్మలందున
తరుణ యువతుల రసనములపై
ధ్వనిస్తున్నది ముక్తిగీతం!

ధ్వనిస్తున్నది రాట్నచక్రం
ధ్వనిస్తున్నది ఝంకారమై
స్వేచ్ఛకోసం బ్రతుకుకోసం
సమరభూమిని మ్రోగుపాటై!

మనస్సీమల నమసిపోవని
స్మృతుల నింపే శబ్దజాలం
రాట్నచక్రం ధ్వనిస్తున్నది
రమ్యజీవన సంగీతమే!

పెదవి కొరుక్కోకు నేస్తం!
ఇచటనే ఈ నెలవులోనే...

కలికి చూపుల వలపు గీతుల
హేలలో నీ మదిని దోచిన
చెలియ కన్నుల వేదనామయ
నీలి నీడలు క్రమ్మినాయని;

ప్రమిద వెలుగున
మోము వంచుకు
పడుగు పేకల వడుకుతుందని
నీ ప్రణయ
భావార్ద్ర హృదయం
పలుకుతున్నది అదే పనిగా!

మంట లుమిసే నీ తుపాకీ
సూటిగా గురిచూచుచున్నది
మాతృమూర్తిని; సతీసుతులను;
రాట్నచక్ర మృదునాదములను!

వణకుతున్నది కరయుగళమే
కనులనిండెను అశ్రుకణములు
నీ యోచనా లోకాలలో
నిండియున్నది గాఢతమమే!

రాట్నచక్రం ధ్వనిస్తున్నది
రమ్య జీవన సంగీతమే
శిరము వాల్చి తుపాకి మొనపై
చలనముడిగిన జడుడవైతివి!

తొలగిపోయెను
కారు మబ్బులు
తెల్లవారెను కిలరవమ్ముల
మేఘమాలిక లెర్రవారెను
ఎర్రవారెను దిశాంచలములు

పుడమి ఒడిలో ఆడుతున్నవి
పచ్చ పచ్చని తరుచ్ఛాయలు
ప్రాగ్దిశాంగన నెమ్మోవిపై
పరచుకొన్నవి అరుణకాంతులు
'పదముందు' కని
ఖలుని ఆజ్ఞలు!
కదలజాలక వణకుచుంటివి
మరఫిరంగులు గ్రక్కే నిప్పులు
మరలి రాదింకేదియైనా!

తెల్లవారెను! ఓ హృదయమా
అది ఎవ్వరిని కూల్చడానికి?
నిశిత దృక్కుల దిశల చూడగ
నేలవాలె తుపాకులన్నీ!

వారి చేతులు సైతమూ నీ
తీరుగానే వణకుతున్నవి
జాగు చేయకు నేస్తమూ! నీ
శత్రు వెవరో తెలుసుకో ఇక!

పాలబుగ్గల చిన్న పాపలు
భయోద్విగ్నత నరచు కేకలు;
అడ్డదారులు దాటి నిన్నొక
'వలపుగాలే' పలుకరించెను!

"కాల్చగలవా! వద్దు నేస్తం
కాల్చు యోచన
కాల్చివేసెయ్!"
గురిని చూసిన తుపాకీలే
దిగ్గుమని వాలినవి నేలకు

గురిని పెట్టిన దెవరి వైపుకు?
స్తన్యమిచ్చిన కన్నతల్లుల
వలపుపంచిన ప్రణయమూర్తుల
ప్రాణములనే కూల్చవలెనా?

'కుటిల వంచక
నీచ హృదయులు
వక్రబుద్ధికి మేటి నెలవులు
ఈ అమెరికా వలసవాదులు'
పొంగి నెత్తురు
పెదవి తొణకెను

విలయ భీకర విస్ఫోటమే
కర్ణపుటముల దద్దరిల్లెను
కూలి నీ పదయుగళి ముంగిట
కుమిలినవి 'మేఘశకలమ్ములు'

'శత్రు వెవడో తెలుసునా'కని
జలదగర్జన చేసినాడవు
రాట్నచక్ర మనోజ్ఞ నాదం
రవళించెను నీ శ్రవణమ్ముల

మాతృభూమిని ఒరిసిపారే
విమల నదీ తరంగిణులు నీ
తల్లి పాడే జోల పాటై
పల్లవించెను నీ ఎడదలో!
అవును నేస్తం!

మాతృదేశ విముక్తికోసం
పోరు సలిపే వీర యోధులు
అగ్నిధారల నడుమనైనా
వెన్ను చూపని సమరశీలురు

విప్లవోజ్జ్వల నినాదాలను
రాట్నచక్రం ధ్వనించేప్పుడు
నిశ్చితంగా రాత్రివేళల
నిద్రించ లేరెప్పుడైనా!

'థియూ' వంచకు
బాంబు దాడులు
అడ్డగలవా ప్రజాశ్రేణిని
రాట్నచక్రం ధ్వనిస్తున్నది
రక్తమెగసే ముక్తిగీతం!!

సోవియట్ సహాయంతో నెలకొల్పిన ప్రాజెక్టుల ప్రగతి

1971-72 ఆర్థిక సంవత్సరం పూర్తి అయింది. ఈ సంవత్సరంలో భారత్ - సోవియట్ ఆర్థిక, సాంకేతిక సహకారం మరింత విజయవంతంగా అభివృద్ధి చెందింది. సోవియట్ యూనియన్ సహాయంతో మనదేశంలో నిర్మించబడిన ప్రాజెక్టులు సత్ఫలితాలు కలగజేశాయి.

సోవియట్ సహాయంతో మన దేశంలో యింతవరకు 70 పారిశ్రామిక, తదితర ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి. (అయితే వీటిలో కొన్ని నమూనాలు రూపొందించేదశలోను, నిర్మాణ దశలోను వున్నాయి 48 పరిశ్రమలు నిర్మాణం పూర్తి అవడమే కాకుండా, ఉత్పత్తి కొనసాగిస్తున్నాయి.) అవి అన్నీ అత్యంత ప్రధానమైన భారీ ప్రాజెక్టులే-ఆధునిక ఉక్కు-ఫ్యాక్టరీలు, భారీ యంత్రనిర్మాణ ఫ్యాక్టరీలు, నూనెశుద్ధి కర్మాగారాలు, నూనెత్రవ్వకం ప్రాజెక్టులు, విద్యుత్కేంద్రాలు, గనుల త్రవ్వకం ప్రాజెక్టులు, వ్యావసాయిక, విద్యాసంస్థలు వగైరా నెలకొల్పింది. లోగడ ఉత్పత్తి చేయని, పరిమితంగా మాత్రమే ఉత్పత్తి చేయబడే మౌలిక తరగతులకు చెందిన పారిశ్రామిక ఉత్పత్తులను భారీగా ఉత్పత్తి చేయడానికి యీ ప్రాజెక్టులు నెలకొల్పబడ్డాయి

భారత ఫెర్రస్ మెటల్ పరిశ్రమకే తలమానికమైనభిలాయ్ ఉక్కు కర్మాగారం,యావద్భారతంలోనే కాకుండా, విదేశాలలో కూడా ప్రసిద్ధి కెక్కింది.

భిలాయ్ కర్మాగారంచే రికార్డు స్థాపన

కోకింగ్ ఓపెన్ బ్యాటరీల్లో కొన్ని యిబ్బందులు ఎదురైనా భిలాయ్ ఉక్కు కర్మాగారం 1971-72 సంవత్సరంలో అంతకుముందు సంవత్సరంఉత్పత్తిస్థాయిని నిలబెట్టడమే కాకుండా, కొద్దిగా అధిగమించింది అంతేకాదు దుర్గాపూర్, రూర్కెలాలలోని రెండు ప్రభుత్వ ఉక్కు ఫ్యాక్టరీల మొత్తంఉక్కు-ఉత్పత్తిశక్తి, భిలాయ్ఉక్కు కర్మాగారం ఉత్పత్తి శక్తికంటే 10 లక్షల టన్నులు అధికం అయినప్పటికీ, ఆ రెండు ఫ్యాక్టరీలకంటే భిలాయ్ ఉక్కు కర్మాగారం ఉక్కు ఉత్పత్తి అధికంగా చేసింది.

1971-72 లో ప్రభుత్వ ఉక్కు ఫ్యాక్టరీల ఉక్కు ఉత్పత్తి శక్తి

	నిర్ణీత ఉత్పత్తి శక్తి (లక్షల టన్నులు)	వాస్తవ ఉత్పత్తి	జరిగిన ఉత్పత్తి శాతం
భిలాయ్	25	19 64	78 2
రూర్కెలా	18	8 23	45 7
దుర్గాపూర్	16	7 00	43 6

1971-72 వ సంవత్సరంలో భారతదేశంలో ఉత్పత్తి అయిన మొత్తంఉక్కులో, భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ మూడింట ఒక వంతు ఉక్కు ఉత్పత్తి చేసింది. వర్తమాన సంవత్సరం ప్రణాళిక మేరకు, భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ 22.5 లక్షల టన్నుల ఉక్కు, అంటే దానిని నిర్ణీత ఉత్పత్తి శక్తిలో 90 శాతం ఉత్పత్తి చేయవలసి వుంది 1971 లో ఆరవ బ్లాస్టు ఫర్నేస్ కాంప్లెక్స్‌చేత విజయవంతంగా పనిచేయించింది భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ వార్షిక ఉత్పత్తి శక్తి 40 లక్షల టన్నులకు పెంచాలని భారత ప్రభుత్వం యిటీవల నిర్ణయం తీసుకుంది

1971-72 వ సంవత్సరంలో బొకారో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, అసెంబ్లింగు, పనులవేగం గణనీయంగా తీవ్రతరం చేయబడింది ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి శక్తి 40లక్షల టన్నులు. ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తిశక్తిని యింకా పెంచడానికి అవకాశం వుంది తక్షణావసరమైన మెటల్‌షీట్లను ఈఫ్యాక్టరీ ఉత్పత్తిచేస్తుంది ఈ షీట్లను ఎగుమతి చేసుకోడానికి భారతదేశం ఎంతో విదేశీ మారకం ఖర్చుపెడుతోంది.

ఎ. ఐ. అలిఖనోవ్

60 వేల కార్మికులు పనిచేసే బొకారో కర్మాగారం

భారతదేశ చరిత్రలో కెల్లా బొకారో నిర్మాణ స్థలం చాలా పెద్దది. 30 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల స్థలంలో నిర్మించబడుతున్న వివిధ నిర్మాణ ప్రాజెక్టులలో సుమారు 60 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు.

బొకారో ఫ్యాక్టరీలోని వివిధ యూనిట్లు దేనికవే ప్రత్యేక భారీసంస్థలు. వివిధ సెక్షన్లలోని యంత్రాలు మామూలుగా పని చెయ్యడానికి నెలకొల్పినరిపేరింగుషాపులుచేసేఉత్పత్తులే1,78 000టన్నులు. మెటల్‌కన్‌స్ట్రక్షన్ షాపు 21 000 టన్నుల సరుకులు ఉత్పత్తి చేస్తుంది. శక్తివంతమైన థర్మల్ విద్యుచ్ఛక్తి యంత్రం 1,22,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తుంది ప్రధానంగా జరిగే కోక్ ఉత్పత్తి కాకుండా, కోక్ కెమికల్‌షాపు1,35,000టన్నులఅమోనియం సల్ఫేటు, నెప్తలీన్, మెథిల్ బెంజీన్ (టోల్యుయోల్), తదితర రసాయనిక ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తుంది

బొకారో కర్మాగారానికి అత్యంత అధునాతనమైన యంత్ర పరికరాలను సమకూర్చిపెట్టే నిమిత్తం, వందలాది సోవియట్, భారత పారిశ్రామికసంస్థలు తమకు యివ్వబడిన ఆర్డర్ల మేరకు పనిచేస్తున్నాయి

మొదటి బ్లాస్టుఫర్నేసు కాంప్లెక్సు పని ప్రారంభించేందుకు అవసరమైన స్థాయికి బొకారో ఫ్యాక్టరీ నిర్మాణం ప్రస్తుతం చేరుకుంది. ఈ బ్లాస్టుఫర్నేసుకాంప్లెక్సు ఈ సంవత్సరమే తొలిసారిగా దేశానికి కావలసిన ఇనుం ఉత్పత్తిచేస్తుంది.

ఫ్యాక్టరీలకు ఫ్యాక్టరీ రాంచీ కర్మాగారం

మన దేశాన్ని పారిశ్రామికవంతం చేయడంలో, సోవియట్ సహకారంతో నిర్మింపబడిన ఆధునిక ఇంజనీరింగు యంత్రాలు అత్యంత ప్రధానమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. రాంచీలోని భారీయంత్ర నిర్మాణ ఫ్యాక్టరీ "ఫ్యాక్టరీలకు ఫ్యాక్టరీ" అని పిలవబడుతోంది ఉక్కు ఫ్యాక్టరీల నిర్మాణానికి తక్షణం అవసరమైన, అత్యంత ప్రాధాన్యతగల రకరకాల పరికరాలను ఉత్పత్తిచెయ్యడానికి ఈఫ్యాక్టరీ ఉద్దేశించబడింది 10 లక్షల టన్నుల ఉక్కు ఫ్యాక్టరీకి అవసరమైన యంత్రాలను రాంచీలోని ఫ్యాక్టరీ తయారుచేస్తుంది.

రాంచీలోని భారీ యంత్ర నిర్మాణ ఫ్యాక్టరీ ప్రగతి

రాంచీ ఫ్యాక్టరీ ఉత్పత్తిచేస్తున్న ప్రధాన భాగం ఉత్పత్తులు ప్రస్తుతం బొకారోకి పంపబడుతున్నాయి అంతేకాక యీఫ్యాక్టరీలో ఎంతో క్లిష్టమైన, ఎంతోశ్రమ అవసరమైన కోక్‌ఓవెన్, బ్లాస్టు ఫర్నేసులు, స్టీల్ ఫర్నేసులు, లిఫ్టులు, రవాణా పరికరాల వంటి వాటిని ఉత్పత్తి చేయడానికి కృషి చేస్తోంది.

భారీయంత్రనిర్మాణకర్మాగారంసాధిస్తున్న విజయాలకు, సోవియట్ యూనియన్‌లో వున్న అదేరకమైన భారీ కర్మాగారం - 'యూరల్‌మాష్' - ఉత్పత్తిలోను, కార్మికులను ఆర్గనైజ్ చేసుకోడంలోను భారతదేశానికి తరచుగా సలహాలు యిస్తూండడమే కారణం ఉక్కుగనులమంత్రిత్వశాఖ(1971-72లో)అందజేసిన అధికారపూర్వక సమాచారం ప్రకారంరాంచీలోని భారీయంత్రనిర్మాణకర్మాగారం 30 వేల టన్నుల యంత్రాలకంటె అదనంగానే ఉత్పత్తి చేసింది. అంటే దీని అర్థం గత సంవత్సరం ఉత్పాదక శక్తిని మూడింట ఒక వంతు అధిగమించింది. గత సంవత్సరం కంటె యీ సంవత్సరం అమ్మకాలు 40 శాతం పెరిగాయి.

దుర్గాపూర్ ఫ్యాక్టరీ విజయాలు

దుర్గాపూర్ మైనింగ్, అండ్ ఎలైడ్ యంత్రాల ఫ్యాక్టరీ గణనీయమైన విజయాలు సాధించింది. గత సంవత్సరం కంటే 54 శాతం ఉత్పత్తిచేసి, అధికంగా రెట్టింపు ఆదాయం తెచ్చిపెట్టింది. బొకారో ఉక్కు కర్మాగారానికి తొలిబ్లాస్టుఫర్నేస్ కాంప్లెక్సుకు అవసరమైన సరుకుల సరఫరాలను పూర్తి చేసింది

మైనింగ్ అండ్ ఎలైడ్ యంత్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు అందచేసిన సమాచారం మేరకు రేవులకు, గనులకు అవసరమైన క్లిష్టమైన లిఫ్టింగ్ రవాణా యంత్రాల ఉత్పత్తిలో యీ ఫ్యాక్టరీ ప్రధానమైన ఫ్యాక్టరీగా రూపొందింది కలకత్తాలోని భూగర్భ రైల్వేల నిర్మాణంలో యీ ఫ్యాక్టరీ అత్యంత క్రియాశీలమైనపాత్ర నిర్వహిస్తోంది.

హరిద్వార్‌లోని భారీ విద్యుత్ పరికరాలకర్మాగారం

హరిద్వార్‌లో సోవియట్ సహాయంతో నిర్మించబడిన భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ, భారతదేశంలో విద్యుచ్ఛక్తి పరిశ్రమ అభివృద్ధికి గణనీయంగా సహాయపడింది. ఈ ఫ్యాక్టరీలో పెద్ద, మధ్యరకం ఎలక్ట్రిక్ మోటార్లు, హైడ్రోసెట్లు, విద్యుత్ కేంద్రాలకు అవసరమైన టర్బైన్లు ఉత్పత్తి చేయబడుతున్నాయి

ఆరుపువ్వులు మూడు కాయలుగా అభివృద్ధి చెందిన కోటా ఫ్యాక్టరీ

కోటా పరికరాల ఫ్యాక్టరీ కూడా విజయవంతంగా పని చేస్తోంది ఈ ఫ్యాక్టరీ 1966 నుండి ఉత్పత్తి ప్రారంభించింది. ఈ కొద్ది కాలంలోనే, యీ ఫ్యాక్టరీ క్లిష్టమైన పరికరాలను ఉత్పత్తి చేయడంలో నైపుణ్యం సంపాదించింది ఇప్పుడు ఈ ఫ్యాక్టరీ లాభసాటిగా నడుస్తోంది. 1971-72 సంవత్సరంలో యీ ఫ్యాక్టరీ, వివిధ కర్మాగారాలకు అవసరమైన అనేక రకాల పరికరాలు ఉత్పత్తి చేసింది. వాటికి అనేక రకాలుగా సేవలు చేసింది. తద్వారా సుమారు రు. 7 కోట్లు ఆర్జించింది. ప్రాథమికంగా లభించిన సమాచారంమేరకు, ఈ ఫ్యాక్టరీకి రు. 2 కోట్లకు మించి నికర ఆదాయం లభించింది.

గత సంవత్సరంకంటె, ఈ సంవత్సరంలో దీని ఉత్పత్తి 30 శాతం పెరిగింది. లాభాలు 29 శాతం పెరిగాయి. ఈ ఫ్యాక్టరీలో ఎంతో నాణ్యమైన వివిధ రకాల ప్రెసిషన్, కంట్రోల్ పరికరాలు ఉత్పత్తి చేయబడతాయి. ప్రపంచ మార్కెటులో వీటికి ఎంతో గిరాకీ వుంది.

సోవియట్ సహకారంతో నూనెరంగంలో సాధిస్తున్న ప్రగతి

1960 వ దశకం వరకు భారతదేశ మార్కెటుపై పూర్తి పెత్తనం వహించిన విదేశీ నూనె కంపెనీలపై ఆధారపడ్డాన్ని తగ్గించడం భారతదేశానికి అత్యంత ప్రధానమైన సమస్య.

భారత ప్రభుత్వం నెలకొల్పిన నూనె, సహజవాయుకమిషన్, సోవియట్ నిపుణుల సహాయంతో. సోవియట్ పరికరాలను వినియోగిస్తూ అతి తక్కువ కాలంలో ఒక దీర్ఘ పరిశోధనా కార్యక్రమాన్ని కొనసాగించింది. దాని ఫలితంగా, అనేకచోట్ల నూనె, సహజవాయు నిధులు బయటపడ్డాయి. వాటి ఉత్పత్తి ప్రారంభమైంది.

భారతదేశ ప్రభుత్వరంగం ప్రస్తుతం సంవత్సరానికి 40 లక్షల టన్నులకు పైగా ముడినూనె ఉత్పత్తి చేస్తోంది భారతదేశంలో జరుగుతున్న మొత్తం ముడి నూనె ఉత్పత్తిలో ప్రభుత్వ రంగం ఉత్పత్తి సగానికి పైబడి వుంది ఒ. యన్. జి. సి. నెలకొల్పబడిన నాటి నుండి 22 కోట్ల టన్నుల నూనె ఉత్పత్తి చేసింది ఫలితంగా భారతదేశానికి రు. 200 కోట్ల విదేశీమారకం ఆదా చేయబడింది

భారతదేశం తన స్వంత నూనె పరిశ్రమను అభివృద్ధిపరచుకోడంలో అనేక ప్రత్యక్ష విజయాలు సాధించినప్పటికీ, నూనె కోసం పెరుగుతున్న డిమాండును యింత వరకు సంతృప్తి పరచలేకపోతోంది. నూనె దిగుమతుల నిమిత్తం భారతదేశం ప్రతి సంవత్సరం రు. 100 కోట్లు ఖర్చు పెట్టవలసివస్తోంది. మన బడ్జెటుకు యీ వ్యయం అపరిమితమైన భారంగావుంది. పర్యవసానంగా మన నూనె పరిశ్రమను అత్యంత త్వరిత గతిని అభివృద్ధి పరచుకోవడం తప్పనిసరి.

నూనె పరిశ్రమ అభివృద్ధికి సోవియట్ హామీ

అద్యతన భవిష్యత్తులో భారతదేశంలో నూనె ఉత్పత్తిని పెంచేందుకు మంచి అవకాశాలు గలవనీ, యీ కర్తవ్య నిర్వహణను విజయవంతం చేయడంలోతాము పాలుపంచుకుంటామనీ సోవియట్ సంస్థలు, నిపుణులు సంసిద్ధత తెలియజేశారు.

సోవియట్ యూనియన్ సహాయంతో బరౌనీ, కొయాలీలలో అత్యంత ఆధునికమైన భారీ నూనె శుద్ధి కర్మాగారాలు నిర్మించబడ్డాయి. ఈ కర్మాగారాల్లో పెద్దమొత్తున ముడినూనె శుద్ధిచేయబడుతోంది. ఈ నూనె శుద్ధి కర్మాగారాలు నూనె ఉత్పత్తిలో విజయం సాధించాయి భారత దేశంలో ఉత్పత్తి చేయబడే మొత్తం నూనె ఉత్పత్తులలో మూడింట ఒకవంతు నూనెఉత్పత్తులు యీ కర్మాగారాలలో ఉత్పత్తి చేయబడుతున్నాయి.

55 కోట్లకు పైబడి జనాభా గలిగిన భారతదేశంలో ప్రజారోగ్యాన్ని, వైద్య సౌకర్యాలను అభివృద్ధిపరచడం, ప్రధానమైన సమస్య. అనేక వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం జరపడం, భారతదేశ ప్రజల ఆరోగ్యాన్ని అభివృద్ధి పరచడంలోను రుషీకేశ్‌లోని యాంటీ బయోటిక్‌మందుల ఫ్యాక్టరీ, హైదరాబాదు లోని సింథటిక్ మందుల ఫ్యాక్టరీ ప్రత్యేకపాత్రనునిర్వహిస్తున్నాయి.

మిగతా 11 వ పేజీలో)

ఆదాజి సమిష్టి వ్యవసాయ క్షేత్రం

లాత్వియన్ రిపబ్లిక్ రాజధాని అయిన రీగా పట్టణానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఒక సమిష్టి వ్యవసాయ క్షేత్రం వుంది. దాని పేరు ఆదాజి క్షేత్రం. ఈ క్షేత్రం క్రింద 4000 హెక్టారుల సాగు భూమి వుంది. అందులో 1300 మంది రైతులు సభ్యులుగా వున్నారు.

ఇది ప్రధానంగా విత్తనాలను పండించే క్షేత్రం. ఇక్కడ పండే విత్తనాలు ఈ రిపబ్లిక్‌లోని యితరసమిష్టి క్షేత్రాలకు,ప్రభుత్వ క్షేత్రాలకూ సప్లయి చేయబడతాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్పుతో అనుసరించుతూ ఈ క్షేత్ర రైతులు బీద భూములలో కూడ అధిక పంటలను సాధిస్తున్నారు.

ఆదాజి సమిష్టిక్షేత్రం ఉష్ణ గృహాలలో కూరగాయలు పండించడానికికూడా పేరుగాంచినక్షేత్రం.వీరురీగాపట్టణానికి దోసకాయలు, టొమాటోలు, ఉల్లిపాయలు మొదలైన వాటిని సంవత్సరం పొడవునా సప్లయి చేస్తూ వుంటారు. అంతేగాక ద్రాక్షపళ్ళు, కర్బూజాపళ్ళు మొదలైన ఫలాలను కూడా వారు పండిస్తున్నారు.

ఈ సమిష్టి క్షేత్రంవారు తేనెటీగల పెంపకం, చేపల పెంపకం, పందుల, పశువుల, కోళ్ళ పెంపకం కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

ఈ క్షేత్రానికి కొన్ని స్వంత పరిశ్రమలు కూడా వున్నాయి. ఆహార పదార్థాలను డబ్బాలలో నిల్వచేయడం, బంగాళాదుంపల ప్రొసెసింగ్ పరిశ్రమలూ, హస్తకళా కుటీరాలు వున్నాయి, వీటన్నిటివల్ల ఆ క్షేత్రానికి ఏటా 2 మిలియన్ల రూబుళ్ళ లాభం వస్తుంది, ఈ క్షేత్రపు మొత్తం సాలుసరి ఆదాయం 7 మిలియన్ల రూబుళ్ళ మించి వుంటుంది,

నేడు ఆదాజి వ్యవసాయ క్షేత్రంలో 18 మంది వ్యవసాయ, జంతు శాస్త్రజ్ఞులు, 30 మంది ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు, వారంతా లాత్వియన్ వ్యవసాయ ఎకాడమీలో పట్టభద్రులైనవారు.

ఈ క్షేత్రానికి 7 ట్రాక్టర్లు, 73 లారీలు, 10 కోత నూర్పిడి యంత్రాలు,యింకాఅనేక చిన్న యంత్రాలూ వున్నాయి.

రైతులంతా అన్ని ఆధునిక సౌకర్యాలూ వున్న విశాలమైన గృహాలలో నివసిస్తున్నారు ప్రతి యింటికీ ఆధునికమైన ఫర్నిచరు, టెలివిజన్ సెట్లూ వున్నాయి

అక్కడ అధునాతన పరికరాలతో కూడిన చక్కని ఆస్పత్రి ఒకటుంది. కొత్తగా నిర్మింపబడిన బ్రహ్మాండమైన క్రీడాంగణం వారికొక గర్వకారణం.

ఆకాశవాణిలో

శృతులు - అపశృతులు

(శుక్రవారం నుండి గురువారం వరకు)

కడప, విశాఖపట్నం వంటి చిన్న కేంద్రాల ప్రసార శక్తిని పెంచాలని, ఆ కేంద్రాల నుండి స్థానిక ప్రజలకు ఉపయుక్తమైన కార్యక్రమాలు ప్రసారం కావాలని అందరం కోరుకుంటాం. శ్రీ ఈశ్వర రెడ్డి పార్లమెంటులో చేసిన ఆందోళన ఫలితంగా కడపకేంద్రంలో కొంతసాంకేతిక అభివృద్ధి సాధ్యమైంది అయితే యిక్కడి కార్యక్రమాలను ప్రజలకు ప్రయోజనకరంగా రూపొందించడం అధికార్ల బాధ్యత

శనివారం రాత్రి 7 గంటలకు కడప కేంద్రం నుండి రుద్రయాగంపేరిట గుర్రం కోటేశ్వరరావు సమీక్షవించే లౌకిక భావాలుగల ఎవరైనా బాధపడక తప్పదు నిరంతరం యజ్ఞాలు, యాగాలు భగవన్నామోచ్చరణ చెయ్యాలనీ అదే మానవ జన్మకు సార్థకతనీ పావుగంటసేపు బాబాల ప్రసంగభాగాలతో కూర్చిన (మధ్యలో నామ సంకీర్తనంతో సహా) కార్యక్రమం ప్రసారం చేశారు.ఇదా దీని ప్రయోజనం?

* * * *

ఆదివారం (30) హైదరాబాద్ నుండి ప్రసారం చేసిన గంట నాటిక ఆరవి రచన దీక్షాంతం కొన్ని పుక్కిటి పురాణాలను సమ్మిశ్రంచేసిన విశ్వామిత్రుడికథ మధ్యయుగాలనాటు బ్రాహ్మణ క్షత్రియుల మధ్య వైరుధ్యాలేర్పడి బ్రాహ్మణాధిపత్యం మీద తిరగబడ్డ విశ్వామిత్రుణ్ని "నువ్వూ బ్రహ్మర్షి లేఅని వశిష్టుడు రాజీ చేసుకోవడం, దానితో విశ్వామిత్రుడి దీక్ష ముగియడం కథాంశం

ఐతరేయబ్రాహ్మణంలోనిశునశ్శేపుడికథ, మరో పురాణంలోని త్రిశంకుడు అలాగే శకుంతల జన్మవృత్తాంతం కలిపారు. విశ్వామిత్రుడి శాపంతో వశిష్టుడు కొడుకులూ, విశ్వామిత్రుడి కొడుకులూ "చండాలురుగా పుట్టారని వాళ్ళే 'ఆంధ్రులు'ని ఓపుక్కిటి పురాణం ఉంది. అందులో సగమే ఈనాటికలో పెట్టారు పూర్తిగా చేర్చిఉంటే బావుండేది. ఇక నాటికే యత పాత్రధారుల్ని చూస్తే విశ్వామిత్రుడు ఉచ్చారణ దోషాలతోబాటు, ప్రేమకలాపాలలోనహా అన్ని సంభాషణలూ పుల్లవిరిచినట్టున్నాయి. కణ్వుడి భాషణలు కర్ణకఠోరం. ఊర్వశీ మేనకల సంభాషణ, శకుంతల ఏడుపు మాత్రంబాగున్నఈ నాటికనుఎందుకు ప్రసారం చేశారోతెలియదు."గాయత్రిమంత్రాన్ని విశ్వాని కందించి విశ్వామిత్రుడివయావు" అని ప్రశంసించడానికో, యజ్ఞానికి నరపశువుగా అమ్మివేయబడిన శునశ్శేపుడు తద్వారా "రాజును తలిదండ్రులకు మహదానందం కల్గించావు గనుక ధన్యుడివి" అని చెప్పడానికా?

* * * *

ఈవారంకార్యక్రమాలలోబుధవారంనాడు ఢిల్లీనుండి ప్రసారమై రిలే అయిన" "మార్పుకు సాధనంగా రచయిత" అనే అంశంమీద ఆంగ్లంలో చర్చ పేర్కొనదగ్గది. గుజరాతి రచయిత కస్తూర్నా, బంగ్లాకవి నరేంద్రనాథ్ చక్రవర్తి, ఉర్దూ రచయిత్రి కుమారి హైదర్, ఒరియా రచయిత మిత్రాలు పాల్గొన్న ఈ చర్చ అసంపూర్ణమే అయినా కొన్ని మంచి విషయాలు చర్చ కొచ్చాయి. సామాజిక దృష్టి కలిగి రచనలు సాగించాలి అని తప్పక ప్రజల్లో ప్రభావం కల్గిస్తాయనే అభిప్రాయాన్ని అందరూ అంగీకరించారు. చిత్తశుద్ధితో ఎక్కువ ఉత్సాహంతో రచనలు సాగిస్తున్న యువతరం, వారి రచనల ప్రాధాన్యతను అంగీకరించారు. వారిలో కొందరు గందరగోళంలో ఉన్నారన్న హైదర్ అభిప్రాయం సమంజసమే గాని యిదేదో పాశ్చాత్య ప్రభావాలవల్ల మాత్రమే అనటం సరికాదు వారు విప్లవాత్మకంగా ఉండాలని రచనల నిండుగా తుపాకి తుపాకి అంటున్నారని మిత్రా చేసిన విమర్శ సహేతుకమే. ఏమైనా ఈచర్చ ఒక మంచి ప్రయత్నం.

కాంట్రవర్సీ అంటేనే పదిమైళ్ళు పరిగెత్తే తెలుగుకేంద్రాలు యిలాటి ప్రయత్నం చేస్తాయా అని?

* * *

ఆ రోజే హైదరాబాదు నుండి విశర్ రాసి, నిర్వహించి, ప్రధాన పాత్ర వహించిన విషవలయం నాటిక బహుశా సినిక్‌లకు నచ్చుతుంది. సామాజిక దృక్పథం లోపించిన బూర్జువా రచనలకు ఇదో మచ్చుతునక. ఒకర్ని ప్రేమించి ఇంకోర్ని పెళ్ళాడి గుండెల్లోంచి ఆ వేదన లు చివర కొకరు చావడం తెలుగు నవలల్లో నమిలి,నమిలి జనం విసుగెత్తి ఉన్నారు. శిల్పం కోసం స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ ప్రయత్నంలో ప్రకాశాలు, స్వగతాలు ప్రతి డైలాగుకి పెట్టి గందరగోళ బడ్డారు. ఏ డైలాగూ మనుగడకు తక్కువ బిగువు లేదు శ్రోతలు భరించడం కష్టమే మరి

* * *

కార్మికులు అంటే రేడియో వారిఉద్దేశం, ఏమిటో మనకు తెలీదు. వారికోసం అంటూ రోజూఏర్పాటుచేసినఅరగంటకార్యక్రమంలో నానాకలగాపులగంటుంటుంది.ఓరోజుసీరియల్ నాటకం (కార్మికులకు సంబంధించిందికాదు) హాస్యం పేరుతో ఓ ముగ్గురి బుర్రకథ, ఉత్తరాయణం ఒకరోజు. ఇలాపోతే మిగతా రోజుల్లో ప్రసారంచేసే పరిశ్రమల పరిచయాలు (మిషన్లు చప్పుళ్ళు రావూరి భరద్వాజ "అయ్యోరామచంద్రులు)" ఎవరికి శ్రామికులకా? పారిశ్రామికులకా? అన్నది వారికే అవగాహన లేదు.

* * *

ఇక గురువారం హైదరాబాదు వారు మూడోసారి విన్పించిన "సత్యం తెలుసుకున్నాను"కుటుంబనియంత్రణ నాటిక పరమ కృతకంగా ఉందని మరోసారి తిట్టుకోడం మినహా ఏంచెయ్యగలం?

* * *

గత సోమవారం పత్రికలో ఇదే శీర్షిక క్రింద చేసిన సూచనను విజయవాడ గుడిపు గారు సహృదయంతో స్వీకరించడం ముదావహం.

* * * *

హైదరాబాద్‌వారి గురువారం రసమంజరి చప్పగావుంది. ముకురాల రామిరెడ్డి వర్షం మీద కవితలో నడక బాగున్నా పదాటోపం చికాకెత్తించింది సుఖంగాలేదు. రుద్రశ్రీ గేయంలో అర్ధరాత్రి ఆవులించిందంటూ కార్మికుల్ని, పీడితుల్ని ధనమదాంధుల్ని విద్యాసుపుత్రి రోగుల్ని ఒకేచోట కట్టేశారు. పోరంకి దక్షిణామూర్తి కథలో శిల్పానికి లోటులేదుగాని కథే ఆశాభంగం కల్గించింది.

ఇక జె. వరలక్ష్మిగారు స్వతంత్ర భారతంలో పెళ్ళికాని అమ్మాయికథ అంతా విన్నాక అదేమిటో అంతుపట్టదు.

30 వ తేదీ మహిళా కార్యక్రమంలో కూడా వరదు. వరలక్ష్మిగారే "మనిషి మమత" అనే కథ చదివారు. భార్యాభర్త అనురాగం అని ప్రారంభించి కుటుంబ నియంత్రణంతో ముగిసిన కథ అది రేడియో వాళ్ళకి ఇలాటి కార్యక్రమాలకి టైం ఉంపొచ్చుగాని శ్రోతలటైం వేస్టు చేస్తామంటె ఎలా?

* * *

ఈ వారంలో కాస్త ఉపయోగకరమైనది పన్నాల సుబ్రమణ్యభట్టు విజయవాడ నుండి గురువారం [illegible] సమస్యపై విన్పించిన సజీవమైన ఇంటర్వ్యూల కార్యక్రమం.

అన్ని రకాలవారిని దాదాపు పాతికమందిని ఇంటర్వ్యూచేసి సమస్యనైతే చూపించారుగాని అందరూ బాధ్యతమాత్రం [illegible]మీదా పెట్టారు. ఆ మధ్య అహమ్మదాబాదులోను, బొంబాయిలోను పంపిలాటి బస్తీల చిల్లర నాణేల్ని దాచేసిన దొంగవ్యాపారుల్ని పోలీసులు పట్టుకున్నారే ఆ కథ [illegible] ఇందులో చోటుచేసుకోలేదు ఎందుచేతో?

— సంవిన



జంగ్లీ

సీరియల్ నవల

మూలం: కిషన్ చందర్

హిందీనుండి: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
తెనుగుసేత: నిడమర్తి శ్యామలాదేవి

జరిగిన కథ:

నవ్వుతూ, తుళ్ళుతూ, బేఫర్వాగా కాలక్షేపంచేసే గిరిజన యువకుడు జంగ్లీకి ఆడది అంటే ఎంతయిష్టమో, అంత దడా, హడలూను. తండ్రి ఆకస్మిక మృతితో, వడ్డీవ్యాపారి దాకికి ఎడ్ల జతతోబాటు సర్వం పోగొట్టుకున్న జంగ్లీ, బొంబాయి వెళ్ళాలనీ, డబ్బు కూడబెట్టి తిరిగి వచ్చి ఎడ్ల జత కొనుక్కొని వ్యవసాయం చేసుకోవాలనీ కలలుగంటూ, బొంబాయి రోడ్డుపైఆగివున్న లారీలో దూరుతాడు. టార్పాలిన్ క్రిందగలఉన్ని బేళ్ళ సందున అప్పటికే ఒక యువతి దాక్కొని వుంటుంది. డ్రైవరు మహాదేవూ, క్లీనరు బఖ్తియారూ ఆడపిల్లల్ని గూర్చి చెప్పుకునే అసభ్యమైన మాటలు చెవిని పడ్డ తరనా భయభీతురాలవుతుంది లారీ కుదుపుకి మీదపడ్డ జంగ్లీపై తరనా కస్సుమంది. బిక్కచచ్చి కూర్చున్న జంగ్లీని కనుల్లేపైనా చెప్పమన్న తరనాకు జంగ్లీ తనగోడు చెప్పుకుంటాడు. ఏడున్నర వందల ఓలి తీసుకొని తనను తన తండ్రి పండు ముసలిఅయిన గ్రామ పటేలుకిచ్చి కట్టపెట్టడానికి సిద్ధపడ్డాడనీ, అందుకని తాను అకాల్గఢ్‌లో వున్న తనపినతల్లి దగ్గరకు పారిపోతున్నానని చెప్తుంది తరనా, తీరా లారీ అకాల్గఢ్ జేరుకునేసరికె, తరనా తండ్రీ, ముసలివరుడూ, పోలీస్ ఇన్స్పెక్టరూ, తరనా పినతల్లీ రోడ్డుమొగపై నిలబడివుంటారు. ఇన్స్పెక్టరు ఆజ్ఞమేరకు ఒకపొడుగాటి సలాకు తీసుకొని హవల్దారు ఉన్నిగట్టాలలో పొడిచిపరీక్షిస్తాడు. తరనాను తన రొమ్ముకు అదుముకొని సలాకు పోటునుండి జంగ్లీ ఆమెను కాపాడాడు.

తరనా ఏడుస్తూ, చమన్‌కోటలో మిడిల్‌స్కూలు హెడ్మాస్టరైన తనమేనత్త భర్తదగ్గర ఆశ్రయంపొంది, 5వ తరగతి పూర్తిచేసిన తను చదువు కొనసాగించి, తర్వాతనే బొంబాయి వస్తానని జంగ్లీతో చెప్పింది.

లారీ వరాన్‌కోట సెంటరు జేరుకుంది. డ్రైవరు, క్లీనరు లారీ దిగి ఊళ్లోకి పోవడంతో జంగ్లీ తరనాలుకూడా క్రిందకు దిగి, కాకా హోటళ్ళ దగ్గరకు జేరుకుంటారు. వీధి గాయకుడూ, వీధి నర్తకీ జంగ్లీ, తరనాలకు తిండి పెడతామనీ, తమతో కలిసి ప్రదర్శనలో పాల్గొనమనీ చెప్పారు. జంగ్లీ మురళి వాయించి శ్రోతలను ముగ్ధులను చేశాడు. తరనా చిరునవ్వులు చిందిస్తూ, చిల్లర డబ్బులు వసూలు చేసింది. వీధి నర్తకీ గాయకులు తరనా, జంగ్లీలకు భోజనంపెట్టి తమతో ఉండిపొమ్మని ప్రలోభపెట్టారు. జంగ్లీ సరే అనబోతుండగా, వాళ్ళిచ్చిన రెండు రూపాయలను తరనా విసరికొట్టి, అయిదోక్లాసుదాకా చదువుకొన్న తను దొమ్మరిసాని చేసే అడుక్కుతినే పనికి చస్తే ఒప్పుకోనని నిక్కచ్చిగా చెపుతుంది.

ఇక చదవండి —

తరనా పళ్ళు పటపట కొరుకుతూ "తలుపే కైలాసం లాగుంది నీకు. సిగ్గూ శరం లేకపోయేనా!" అని యీసడించుకుంది.

గోచీ పెళ్ళాం మందివరుయా 'సిగ్గూ శరం లేకపోవడమే ముందిందుయో! చేబో గీతడుచూసి జోస్యం చెప్పడానికి పెద్ద పెద్ద వాళ్ళ యిళ్ళకి నేనూ వెడుతూంటాను మంచి పెద్దలూ, సంగతి సందర్భాలూ నాకూ తెలుసు కాస్తంత పెద్ద కొంపల్లోని - చదువు సంధ్యలు నేర్చుకున్న ఆడకూతుళ్ళు - వాళ్ళు ఏదో తరగతి చదువుకున్నా, యిరవయ్యో ఏంగటి వెలగబెట్టినా - పొట్టకూటికోసమే పెళ్ళి చేసుకుంటారు - మగాళ్ళ అడుగులకి మడుగులొత్తుతూ అడ్డమైన చాకిరీ చేస్తారు, ఇల్లు చక్కబెట్టుకుంటారు, పిల్లల్ని కంటారు చివరికెలాగైనా ఎవరైనా చేసేవని పెళ్ళి చేసుకోవడం, యిల్లు చక్కదిద్దుకోవడం, పిల్లల్ని కనడమేగా! బిడ్డల్ని కనడం చెప్పవని కానప్పుడు, నృత్యం చెయ్యడమే అంత పనికిమాలిన పనైపోయిందా?" అంటూ దులిపేసింది.

'నీ ముష్టి రెండు రూపాయలు నువ్వే ఉంచుకో!" అంటూ, తరనా వాటిని నేలపై విసిరికొట్టి, గిరుక్కున వెనక్కు తిరిగి గుడిసెలోంచి విసవిసా బయటి కొచ్చేసింది.

తరనా నిప్పులు చెరుగుతూన్న కళ్ళతో జంగ్లీ వంకకు తిరిగి నాకీ పని సుతరాం నచ్చలేదు, అంతే! ఒక వేళ నీకిక్కడ ఉండిపోవాలనుంటే ఉండిపో, నా కేమీ అభ్యంతరంలేదు. నేను ఒక్కదాన్నే వెళ్ళిపోతాలే!" అంది.

జంగ్లీకైతే యిక్కడే ఉండిపోవాలని మనస్సు మోహపడుతోందిగాని. వాడి కాళ్ళు మటుకు గుడిసె బయటికే నడిచాయి. గోచీ నిష్ఠూరంగా నిట్టూర్చి జంగ్లీతో "సరేలే యీ రెండు రూపాయలు తీసుకెళ్ళు. నీకెందుకైనా పనికివస్తాయి. ఇదిగో అబ్బాయ్, నీకు ఆఖరిసారిగా చెప్తున్నాను నామాటవిన్నావంటే బాగుపడతావు నీకీ పిల్లెక్కడ తటస్థపడిందోగాని సంకర జాతి దిలా వుంది. నీకెందుకు, మవ్వొక్క నెల రోజులు నా దగ్గరుండు. దీని పొగరణచి, ముక్కుకు తాడు పోసి, నీకు అప్పగించకపోతె నన్ను మారుపేరున పిలు!" అన్నాడు.

జంగ్లీ జవాబేమీ చెప్పలేదు. తరనా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ దూకుడుగా వెళ్ళిపోతూంటే, ఆమె వెనక వెనకే పరుగెత్తాడు.

మళ్ళీ అవే చీకటి సందు గొందులు, జన సంచారంలేని అదే బజారు, అదే సెంటరు, అదేరోడ్డు.

తరనా లారీ దగ్గరికి వెళ్ళగానే ఆగి, వెనక్కు తిరిగి 'మళ్ళీ నా వెంట పడ్డావు దేనికి? పో ఆ నాట్యగత్తె దగ్గరికే పో - అది నీకు బాగా నచ్చింది కదా!' అంటూ రుసరుసలాడింది.

"ఎవరూ? వేస్, ఆ ముసిలి దా?" అన్నాడు జంగ్లీ అప్రయత్న పూర్వకంగా, జంగ్లీ నోటి వెంట ఆ మాట బయటపడగానే, తరనా కోపమంతా ఎక్కడి దక్కడ ఎగిరిపోసాగింది. అంతలోనే ఆర్ద్రమైన మృదుస్వరంతో అంది.

"ఇదుగో అబ్బాయ్! నేను నీ మంచి కోసమే చెప్తున్నాను. ఆ తిరుగుబోతు తిరిపెపు జీవితంలో పడితే నువ్వు ఎందుకూ పనికి రాకుండా పోతావ్. ఇల్లూ, వాకిలి, సుఖం, శాంతీ లేని ఆ తిరుగుబోతు జీవితం కూడా ఒక జీవితమేనా? ఇంకా బొంబాయి పోతున్నావంటే, అది వేరేమాట. అక్కడ మనిషిగా తయారవుతావు. పద, నన్ను లారీ లోపలికి ఎక్కించు"

జంగ్లీ అటు యిటు పరకాయించి చూసి, బహు మెలకువగా టార్పాలిన్‌ను ఒక మూల పైకెత్తి సందు చేశాడు. తరనాను తన రెండు చేతుల్లోకీ తీసుకుని పైకెత్తాడు. తరనా టార్పాలిన్ అంచును పైకెత్తి లోపలికి దూరి అదృశ్యమైంది. తరనా తర్వాత జంగ్లీ ఒక్క గంతేసి పైకెక్కి-టార్పాలిన్‌ను తొలగించుకుని లోపలికి దూరాడు. దూరీ దూరడంతోనేఅతని మోకాళ్ళకుచెక్కపెట్టెలు తగులుకోవడంతో బాధతో మూల్గాడు.

తరనా లోగొంతులో "మెల్లిగా చూసుకుని మరీరా. చెక్కపెట్టెలున్నాయి. మనం దిగిన తర్వాత లోడ్ చేశారు" అని హెచ్చరించింది.

"ఈ పెట్టెల్లో ఏమున్నాయో?"

"ఇది మరీ బాగుంది, నాకుమాత్రం ఏం తెల్సు? తెల్సుకునేఅవసరంమటుకేముంది?" అంటూ, ఉన్ని మూటల్లోకి దూరిపోయింది జంగ్లీ కూడా ఆమె వెనక వెనకనే వెళ్ళాడు

ఉన్ని గట్టాలను జాగ్రత్తగా అటు యిటు ఆరిపి సర్దుకొని, వాళ్ళు తిరిగి తమ తమ పాత చోట్లల్లోకి వచ్చి కూర్చున్నారు. ఈ సారి మటుకు వాళ్ళిద్దరికీ తమ స్వంత యింటికె వచ్చి నట్లనిపించింది. ఇద్దరికీ కడుపులు చెక్కపూటుగా నిండుగా వుండి, ఒళ్ళంతా పులిసిపోయి వుందేమో, నడుములు వాల్చిన మరుక్షణంలోనే వాళ్ళిద్దరూ గాఢనిద్రలో మునిగిపోయారు.

ఎప్పుడు తెల్లవారిందీ, వరాన్‌కోటనుండి లారీ ఎప్పుడు బయల్దేరిందీ, అమృతసర్ పోయేరోడ్డు పైకి ఎప్పుడు వచ్చిందీ నిద్రలో వారికేమీ తెలియలేదు. వాళ్ళిద్దరూ నిద్ర లేచేసరికి సూర్యుడు నడినెత్తి మీదున్నాడు. బయట రోడ్డుమీద ఎండ నిప్పులు చెరుగుతోంది. రోడ్డుమీద లారీ ఎంతవేగంగా పరుగెడుతోందో, వాళ్ళ కడుపుల్లో ఎలుకలు కూడా అంతవేగంగానూ పరుగెడుతున్నాయి.

జంగ్లీ చాకు తెరచి, ఒక పెట్టెకు కన్నం చేసి, అందులో ఏముందోనని వెతికాడు. ఆ పెట్టెనిండా అక్రోట్ పళ్ళున్నాయి. మరో పెట్టెలో సీమ బాదం పిస్తాలున్నాయి. మరో పెట్టెలో ఎండు ఖర్జూరాలున్నాయి ఇంకో పెట్టెలో ఎండు కిస్మిస్ పళ్ళున్నాయి అలాగే, మొత్తంమీద పెట్టెలన్నింటిలోనూ రకరకాల ఎండబెట్టిన పళ్ళున్నాయి జంగ్లీ మూడు నాలుగు పెట్టెలుతెరచి దోసిళ్ళ కొద్దీ అక్రోట్,బాదం కిస్మిస్, ఖర్జూరాలను తెచ్చి తరనా ముందు కుప్ప పోశాడు.

మొట్టమొదట జంగ్లీ తన రెండు అరచేతుల సందున కటుక్కున నొక్కి ఎంతో జాగ్రత్తగా అక్రోట్ డొల్లను బద్దలుకొట్టాడు. అయినా కూడా, కొద్దిపాటి చప్పుడు అవనే అయింది. జంగ్లీకి భయం కలిగింది. తరనా ముఖం వివర్ణమే అయింది. వాళ్ళిద్దరూ కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దంగా ఉండిపోయారు కాని ఒక వంక బఖ్తియార్ పాటల జోరునూ, మరోవంక లారీహోరులోనూ అక్రోట్‌ను పగలగొట్టిన ధ్వని మునిగిపోయి, సముద్రంలో నీటి బిందువులా కలిసిపోయింది మొదటి అక్రోట్ పగలగొట్టడంతో బెదురు తీరిన జంగ్లీ, ఒక దాని వెంట మరొకటిగా అక్రోట్లను అరచేతుల సందున నొక్కి బద్దలు కొట్టి, పెంకులు పక్కనపడేసి, పప్పులు ముందుకు జాపుతున్నాడు. తరనా సగం తను తీసుకొని, సగం జంగ్లీ కోసం ఉంచేస్తోంది. జంగ్లీ పళ్ళ సందున సీమబాదం పిస్తాలను కొరికి, తరనాకు అలాగే తినిపించాడు. అక్రోట్, సీమబాదంల తర్వాత కిస్మిస్, ఖర్జూరాల వంతు వచ్చింది. అలా మజా మజాగా తింటూంటే వాళ్ళిద్దరి మనస్సులూ జోరుగా హుషారుగా తేలిపోసాగాయి

తరనా చిలిపిగా "అబ్బాయిగారి పనిమంచి జోరుగా వుందే, ఇలాగే దర్జాగా తింటూ తాగుతూ బొంబాయి చేరుకుంటారల్లేవుందే!" అంది

జంగ్లీ ఎంతో మృదువుగా "నువ్వుకూడా నాతో బాటు బొంబాయి వచ్చెయ్యరాదదూ. చూడుమరి ఎంత కులాసాగా సాగిపోతోందో ప్రయాణం!" అన్నాడు.

"ఊహుం! నేను చమన్ కోటలోనే దిగిపోతాను. మా మేనత్త మొగుడి దగ్గర ఎనిమిదో తరగతి పూర్తిచేస్తాను తర్వాత పదహారు పూర్తిచేసి, ఆ తర్వాత బొంబాయి వస్తాను!"

జంగ్లీ ఎంతో దిగులుగా "అంటే నువ్వు పెద్ద దొరసానివై పోతావన్నమాట. అయితే నువ్వప్పుడు నన్నెక్కడ కలుసుకుంటావు మరి?" అని అడిగాడు.

"రాజా, నువ్వు చాలా మంచివాడివీ, ఎంతో ఉత్తముడివీను."

జంగ్లీ ఆమెవైపు నిబిడాశ్చర్యంతో చూడసాగాడు. తరనా తనను 'రాజా!' అని సంబోధించిన తీరు వాడికెంతగానో నచ్చింది

వసంతకాలంలో చిగిర్చి, మొగ్గతొడిగి, పూలు వికసించిన పచ్చని కొమ్మలు తన హృదయ కాసారం పైకి వంగి దానిలోతరంగాలు కలిగించినట్లనిపించింది ముగ్ధ మనోహర మురళీ నాదాలు పూజల్లులై తన హృదయ కాసారంలోపడి బుడుంగు బుడుంగున మునకలిడుతున్నట్లనిపించి, జంగ్లీ ఒడలు పులకరించింది. సంతోషాతిరేకంతో వాని ముఖ బింబం అరుణిమ దాల్చింది

అయితే, అంతలోనే తరనా కొంటెగా నవ్వుతూ, హేళనస్వరంతో "నువ్వు శుద్ధ మొద్దావతారంబాబూ!" అంది

తరనా ముసిముసి నవ్వులు నవ్వుతూ, తననవ్వును కప్పెట్టుకునేందుగ్గాను ముఖాన్ని చేతుల్తో కప్పుకుంది. ఆమె ముఖంమీదున్న చేతులను తన చేతుల్తో ఒత్తిగించి, తన పెదవులతో ఆమె చిలిపి పెదవులను చుంబించాలన్న గాఢమైన తమి జంగ్లీకి కలిగింది

జంగ్లీ తటాలున ముందుకు వంగాడు. అంతలోనే లారీకి సడెన్ బ్రేక్ పడటంతో, జంగ్లీ తరనావైపు కాకుండా వెనుక నున్న ఒక ఉన్ని గట్టా మీదకు తూలి పడ్డాడు

తరనా బహు కష్టంమీద తన నవ్వు నాపుకొంది. కాని ఆమె కన్నుమాత్రం, నవ్వుఅనే కాసారంలో వికసించిన కమలాల్లా కిలకిల లాడుతున్నాయి.

మహాదేవ్‌కి బాగా దాహం వేస్తున్నదేమో, ఒకసెలయేటి వారగా లారీని ఆపాడు. సెలయేటి ఒడ్డున బాగా ఎండిపోయిన చెట్టు మొదలు ఒకటి పడివుంది. దానివేళ్ళు కొన్ని అడుక్కునేవాని చేతివ్రేళ్ళలాగా, పైకి పొడుచుకొచ్చి, ప్రాణభిక్ష పెట్టమన్ని వేడుకుంటున్నట్లుగా వున్నాయి మరి కొన్ని వేళ్ళు సెలయేటి ఒడ్డుపైకి పొర్లి వచ్చిన నీటిలో మునిగి తాజాగా తయారయ్యాయి ఆ వేళ్ళ సమీపంలో మోడు పై పచ్చ పచ్చని చిగుళ్లూ ఆకులూ మొలకెత్తాయి మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ నీళ్ళు తాగి, ఆ మొద్దుపై కూర్చొని తాపీగా రొట్టెలు తినసాగారు.

దాహమైతే జంగ్లీ, తరనాలకూ వేస్తోంది కాని, దెయ్యాల్లా ఏటిఒడ్డున మహాదేవ్, బఖ్తియార్లు కూర్చుంటే అక్కడికెవెళ్ళేదెలా! తరనా తన పలుచని పెదవులను నాలుకతో తడుపుకుంటూ "నాకు బలే దాహం వేసేస్తోంది" అంది.

ఏటి ఒడ్డున బైఠాయించిన మహాదేవ్, బఖ్తియార్ల వంక యీర్ష్యగా చూస్తూ, జంగ్లీ 'దాహమైతే నాకూ వేస్తోంది!' అన్నాడు

స్వచ్ఛస్ఫాటికమైన సెలయేటి శీతల జలాలు శుభ్రంగా కడగబడిన నీలి శిలల పైగా తుళ్ళి తుళ్ళి పడుతూ, గలగల శబ్దం చేసుకుంటూ ప్రవహిస్తున్నాయి.

నీరు, అందుబాటులో వుండికూడా అలభ్యమైపోయింది!

'మనం లారీ దిగివెళ్ళి ఏట్లోనీళ్ళు తాగేశామనుకో, వాళ్ళేమంటారంటావు?" అని అడిగాడు జంగ్లీ.

"అబ్బే ఏమనుకొంటారు, ఏమీ అనుకోరు! నన్నేమో వాళ్ళు తమతోబాటు తీసుకుపోతారు. నిన్నుమాత్రం యిక్కడే వదిలేస్తారు అంతే!" అంది తరనా.

మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ భోజనం పూర్తిచేసుకొని, మాను మొదలుకు చేర్లబడి కొద్దిగా విశ్రమించారు. వారి వీపులు ఏటివైపుకీ, దృష్టి లారీవైపుకీ తిరిగి వున్నాయి. బండిని సర్వకాల సర్వావస్థల్లోనూ తమ దృష్టి పథంలో ఉంచుకోవాలన్నది-లారీ డ్రైవర్లరూ, క్లీనర్లరూ మొట్టమొదట నేర్చే పాఠం 'ఏ పిల్లయినా నీకు లొంగదనుకో. అప్పుడేం చేస్తావ్?' అని బఖ్తియార్ని ప్రశ్నించాడు మహాదేవ్.

అందుకు జవాబుగా, బఖ్తియార్ తన జేబు వెతికి దానిలోంచి పొడవైన ఒక స్ప్రింగ్ చాకును బయటికి లాగాడు. దానికి ఎద్దు కొమ్ముతో చేసిన నున్నని పిడివుంది బఖ్తియార్ స్ప్రింగును నొక్కేసరికల్లా పిడి నుండి తళ తళ మెరిసేవాడియైన చాకు బయటకు వచ్చింది. 'పిల్లపెంకితనం చేసి గింజుకుందో, దీన్ని రొమ్ము మీద మోపడమే మందు!" అన్నాడు బఖ్తియార్. మహాదేవ్ ఒంటి నిండా తేళ్ళు జెర్రెలూ ప్రాకినట్లయింది. అయితేనేం, అంతలోనే అతను ముఖంపైకి నవ్వుతెప్పుకున్నాడు.

"చాకును ఊరికే అలంకార ప్రాయంగా పెట్టుకోవడమేనా, ఎప్పుడేనా ఉపయోగించవా?"

బఖ్తియార్ తన చేతిపైన గల గాయపు మచ్చను మహాదేవ్‌కి సగర్వంగా చూపించి "పోటీలో మనతో పోటీకొచ్చే వాడు యీ ప్రాంతంలోనే లేడు తెలుసా! బఖ్తియార్ దెబ్బంటే గోలుకొండ అబ్బా అనాల్సిందే ఏమనుకున్నావో, అందుకనే నన్ను క్లీనరుగా పెట్టుకోవాలని డ్రైవర్లంతా ఉవ్విళ్ళూరుతూంటారు ఇంతెందుకు, మనతడాఖా ఏమిటో బవన్ని అడిగితే తెలుస్తుంది!" అని డబ్బీలు కొట్టనారంభించాడు

మహాదేవ్ బఖ్తియార్ వెన్నుపై చరిచి "ఏయ్ బేటా, ఏదో ఒక రోజున నీకీచాకు మూలంగానే జైలుప్రాప్తీ, దాపూ రూడా వస్తాయేమో కాస్త జాగ్రత్తగా మసులుకో!" అని హెచ్చరించాడు.

"హూం! జైలన్నా, చావన్నా మూర్ఖులు భయపడతారు! మనకవేమీ లెక్కా పత్రం లేదు తెలుసా!' అన్నాడు బఖ్తియార్.

అంతలో మహాదేవ్‌కి టార్పాలిన్ క్రింద ఏదో కదులుతున్నట్లు అనుమానంతోచ్చి,

— "అదుగో, అలాచూడు!" అన్నాడు

బఖ్తియార్ హడావిడిగా "ఎక్కడ? ఏమిటి?" అని ప్రశ్నించాడు

మహాదేవ్ లారీ వెనకవైపు చూస్తూ, బఖ్తియార్‌కి నిశ్శబ్దంగా ఉండమని సంజ్ఞ చేశాడు. మహాదేవ్ మళ్లీ "ఈ టార్పాలిన్ క్రింద లారీ వెనక భాగంలో ఏదో కదిలినట్లుంది" అని లోగొంతుకో చెప్పాడు మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ, రెప్ప వెయ్యకుండా ఊపిరి బిగపట్టి, కొంతసేపు అటు వైపే చూస్తూ కూర్చున్నారు టార్పాలిన్ కదలకుండా మెదలకుండా, ఎలావున్నది అలాగేవుంది

బఖ్తియార్ లోగొంతుకో "అదంతా నీ భ్రమ"అన్నాడు.

"అదుగో, అదుగో. అలాచూడు నామాట అబద్ధమైతే!" మహాదేవ్ టార్పాలిన్ వైపు మళ్ళీ చూపించాడు.

ఈ మారు బఖ్తియార్ కంటకూడా పడింది. ఎవరో అతిమెల్లిగా ఏదో వెతుకుతున్నట్టు టార్పాలిన్ క్రింద కొద్దిపాటి కదలిక కనిపించింది 'పారిపోయిన ఆ పిల్లయినా అయివుండాలి, లేకపోతే ఏ దొంగముండా కొడుకైనా అయ్యుండాలి!" అన్నాడు మహాదేవ్. బఖ్తియార్ చాకునిచేత్తో పట్టుకుని లేచాడు ఇద్దరూ కొంచెం వంగి, జాగ్రత్తగా పిల్లుల్లా నక్కినక్కి, అడుగుల చప్పుడు కాకుండా లారీవైపుకి వెళ్ళసాగారు టార్పాలిన్ క్రింద ఒక్కొక్కమారేదో కదులుతోంది. మళ్ళీ అంతలోనే సర్దుకుంటోంది మెల్లగా అతి భద్రంగా బఖ్తియార్ టార్పాలిన్ని ఒక చేత్తో పైకెత్తాడు. వాడి రెండవ చేతిలో తెరిచిన చాకు దొంగని పొడవటానికి సిద్ధంగా వుంది. టార్పాలిన్ ఎత్తగానే దొంగ తలపైకెత్తి బఖ్తియార్ వైపు చూచి, నిస్సంకోచంగా "మ్యావ్!" అన్నాడు

అదో అడవిపిల్లి లారీలోకి ఎక్కడ్నుంచి దూరిందో, ఎప్పుడు దూరిందోగాని దూరి గువ్వపిట్టలా కూర్చుంది మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ పగలబడి నవ్వుకున్నారు. వాళ్ళిద్దరూ ఒకేసారి 'ఉష్!' అంటూ పిల్లిని లారీ బయటికి తోలి, టార్పాలిన్ని తిరిగి కడుతూ, ఒకళ్ళతో మరొకళ్ళు

"నా సామిరంగా, యిప్పుడె కనక ఆ పిల్ల ఉంటేనా, బలే మజాగా ఉండేదికదూ!" అనుకున్నారు.

"దౌర్భాగ్యురాలు, ఏ అదృష్టవంతుడి లారీపైన ఎక్కిపోయిందో!"

"అలా అని ఎందుకనుకోవాలి, దారి తప్పి అడవిలోనే తిరుగుతోందేమో!"

బఖ్తియార్ ఏటివంక తిరిగి, ఎండు మొద్దువంకచూసి, మహాదేవ్‌తో "దీన్ని లారీ మీద వేసుకుపోయి దోవలో బస్సుస్టాపు దగ్గరున్న కట్టెలఅడితీలో అమ్మేద్దాం ఇంత పెద్దమొద్దుకి ఆరేడు రూపాయలకు తక్కువ కాకుండా రాలుతాయి. ఓ సీరాసీరా ..." అన్నాడు. సీరా మాట చెవిన పడగానే మహాదేవ్ అప్రయత్నంగానే మోడుకేసి దౌడు తీశాడు. లావుగా ఉన్న పక్క రెండు చేతులతోనూ పట్టుకుని మహాదేవ్ పైకెత్తాడు, బఖ్తియార్ రెండవ పక్క పట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి దాన్ని లారీమీద పడేశారు. అది బాగా పొడుగుందేమో, లారీలోంచి మూడు నాలుగు గజాలు బయటకు పొడుచుకొచ్చింది. బఖ్తియార్ దాన్ని పకడ్బందీగా సర్ది, "అబ్బా, యిప్పుడింక దొర్లి పడిపోదు" అన్నాడు దానితర్వాత, అక్కడ బయల్దేరటం బయల్దేరటం, లారీ తిన్నగా చమన్‌కోట వచ్చాకనే మళ్ళీఆగింది.

బఖ్తియారు, మహాదేవ్ లిద్దరూ దిగి చాయ్ త్రాగడానికని కాఫీ హోటల్లోకి వెళ్ళిపోయారు. అప్పుడిక తరనా లారీ నుండి మెల్లగా జంగ్లీ సహాయంతో క్రిందకు దిగింది. తర్వాత ఆమె బంగరువన్నె పూల డిజైను చెప్పులను క్రింద పడేశాడు తరనా రెండు చెప్పుల్ని చేతుల్లోకి తీసుకొని, ఒకదానికి మరొకటి రాసి, దులిపి, కాళ్ళకు తొడుక్కుంది తరనా వాడి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోతూంటే, సరోవర సలిలాలపై, గాలి తాకిడికి తెగిపోయిన రెండు కమలాలు, దూర దూరాలకు తేలుతూ కొట్టుకు పోతున్నట్లు, తరనా కాలి చెప్పుల పైన గల జలతారు పూలు సైతం తనకు అంతకంతకు దూరంగా, మరింత దూరంగా వెళ్ళిపోతున్నట్లు జంగ్లీకి అనిపించింది.

వాడి మనస్సు అంతులేని దుఃఖంలో మునిగి పోయింది వాడి కండ్లలో నీరు ఉబికి రాసాగింది. తరనా ఒక అడవి బాట వెంట వెళ్తూ, చివరి సారిగా జంగ్లీ వైపు ఒక్కమారు చూసి, తిరిగి అడవిలో అదృశ్యమై పోయింది.

నన్ను తనవెంటరమ్మని ఒక్కసారంటే, ఒక్కసారైనా అని వుంటే, నేను తప్పకుండా ఆమె వెంట వెళ్ళి ఉండేవాణ్ణి కాని ఆ విడ గారు ఒక్కసారైనా నన్ను రమ్మని పిలవలేదు, అనుకుని, జంగ్లీ తన కన్నొత్తుకున్నాడు. తర్వాత మోకాళ్ళపై పాక్కుంటూ, ఉన్ని గట్టాలతో ఏర్పాటు చేసుకున్న తన గుహలోకి చేరుకున్నాడు. ఇలా పడివుండటమే యిప్పుడు శ్రేయస్కరం వాళ్ళు టీ త్రాగి, కొద్ది క్షణాల్లో తిరిగి వస్తారు అప్పుడిక లారీ యిక్కడ్నుంచి బయల్దేరుతుంది లారీఇక్కడి నుంచి త్వరగావెళ్ళి పోతే బాగుండుననికూడా వాడి మనస్సుకి అనిపించసాగింది. ఇప్పటి నుంచి తరనా శాశ్వతంగా ఇక్కడేవుండి పోతుంది అలాంటి యీ చమన్ కోటలో ఒక్క క్షణంకూడా ఉండాలని వాడికి అనిపించటం లేదు జంగ్లీ తన తలను ఒక గట్టా మీద వేలాడేసి ఎంతో ఉదాసీనంగా కళ్ళు మూసుకున్నాడు

మహాదేవ్, బఖ్తియార్లు టీ త్రాగి తిరిగి వచ్చారు. మహాదేవ్ బండి స్టార్టు చేశాడు. ఇంజను ఫట్ ఫట్ మని కొట్టుకుని నిలిచిపోయింది. మహాదేవ్ మళ్ళీ ఇంజను స్టార్టు చేశాడు. ఇంజను ఉసూరుమంటూ స్టార్టు అయి, అంతలోనే మళ్ళీ ఆగిపోయింది

మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ కిందికిదిగి, ఇంజన్ని పరీక్షించసాగారు అలా చాలాసేపు చూస్తూ ఉండిపోయారు తర్వాత ఒకటి తర్వాత మరొకటిగా బోలెడు పని ముట్లను బయటకుతీసి, వాటితో ఇంజన్ను, బాగు చెయ్యాలని తంటాలు పడ్డారు. కొద్ది సేపటి తర్వాత వారు నల్లని ఒక యినుప వస్తువుని ఇంజను నుండి బయటకు తీశారు మహాదేవ్ దాన్ని బఖ్తియార్‌కి చూపించి, "ఇది విరిగి పోయింది. దీన్నిప్పుడెలా బాగుచెయ్యాడమో నాకు పాలు పోవడం లేదు ఏదైనా మరోట్రక్కో లారీనో యిటు వస్తే, దానిలో ఏ మెకానిక్కయినా ఉండటం తటస్థిస్తే, అతని సాయంతో మనం బయట పడతామేమోగాని, లేకపోతే మనమిక్కడ చిక్కడిపోయినట్టే" అన్నాడు

"అయితే, యిక్కడీ శవజాగారమెందుకు టీ కొట్లోకి పోయి కూర్చుందాంపద. వాడికే ఒక కోడిపెట్టనికూడా ఆర్డరిద్దాం రాత్రి యిక్కడే గడపాల్సి వస్తే ఆకలితో మాడి చావడం దేనికి!" అనుకుంటూ మహాదేవ్, బఖ్తియార్లిద్దరూ టీ కొట్టువైపుకు వెళ్ళిపోయారు.

జంగ్లీకి ఉతుకుష్టంగావుంది. ఊపిరి ఆడి చావడంలేదు ఆ పిల్ల వున్నంతసేపూ ఎలా ఊపిరాడిందా అని వాడికి ఆశ్చర్యం వేసింది వాడికిప్పుడు ఉన్ని తనపై నాల్గు పక్కల్నించీ దాడి చేస్తున్నట్లనిపించసాగింది జంగ్లీకి ఊపిరి తీసుకోవడం సైతం కష్టమైపోయింది. వాడా యిరుకు జా నుండి బయటకు వచ్చి, నాలుగు పక్కలా జాగ్రత్తగా పరీక్షించి, లారీ నుంచి క్రింద కొక్క దూకుదూకి, ఉరుకులు పరుగులుగా అడవిలోకి అదృశ్యమై పోయాడు.

వాడి కిప్పుడు నాలుగు ప్రక్కలా అడవి తనకు ప్రియాతి ప్రియమైన ఏ అడవినైతే విడిచి వెళ్ళిపోతున్నాడో ఆ అడవి - ఉంది అవిగో అవి దేవదారుచెట్లు, ఇవి జంయ్ జంయ్ మంటూ గాలికి ఊగే సరివిచెట్లు, అవిగో అవి, మొహైన కొండవాలి మూసులకు అల్లిబిల్లిగా అల్లుకున్న అడవి ద్రాక్ష తీగెలు. ఈ అడవిలోని ప్రతి చిగురునుండీ, ప్రతి ఆకు నుండీ ఎంతటి మత్తుగొలిపే ఘాటైన సువాసన వస్తోంది! అబ్బ, యిక్కడెంతటి నీరవ నిశ్శబ్దం! లలిత లలితమైన ప్రశాంతి! మీగడ తరకల్లాంటి మెత్త మెత్తని చివురాకుజొంపాలను సమాశ్లేషించుకుంటూపోయి, ఒక సెలఏటిలోని స్ఫటిక స్వచ్ఛమైన నీళ్ళను తనివిదీర త్రాగి దప్పిక తీర్చుకొని, మెత్తని పచ్చిక మీద కాళ్ళు పారజాపి హాయిగా పడుకున్నాడు రత్న కంబళం వంటి మెత్త మెత్తని పచ్చగడ్డి దుబ్బులపై యీ పడక నిద్రా దేవతకి ఆహ్వానం పలుకుతోంది! దట్టమైన యీ అడవిలోని సుపరిచిత సుందర దృశ్యాలు వాడిని తమ సన్నిధానానికి చేర రమ్మని పిలుస్తున్నాయి ఇలాంటప్పుడు తరనాయే కనుక తన సరసన ఉంటే, ఆ సెలయేటి ఒడ్డున తామిద్దరూ ఒక చిన్న గుడిసె వేసుకొని, అందులో హాయిగా ఉందురు కదా...వాడి ఊహా ప్రపంచంలో, తరనా లేడిచర్మం ధరించి, గుడిసె వాకిట నిలబడింది ఆమె జుట్టుముడి సడలి, జుట్టు నడుం దాకా వ్యాపించి వుంది. గుడిసె వాకిట నిలబడి, తన రాక కోసం ఎదురు తెన్నులు చూస్తోంది. వేటాడిన లేడి కూనను భుజానవేసుకొని తను ఆమెవంకకు వెళుతున్నాడు తరనా కళ్ళల్లో ఎంత ప్రేమ నిండి వుంది! అదుగో, ఆమె చిరునవ్వు. ఆ చిరునవ్వెలాంటిది! అంధకారంలో సైతం మెరుపుతీగలా మెరిసిపోతుంది తన సువాసనలో వాతావరణాన్నంతటినీ సురభిళంచేసేస్తుందా చిరునవ్వు అవిగో పసుపుపచ్చని గడిపూలు, లక్షోపలక్షలు! వాటినుండి వెలువడే సువాసనలు తన నాసా రంధ్రాలకు సోకుతున్నాయి ఒకటి కాదు, రెండు కాదు, వేలాది సుమధుర సువాసనలు, తన ముక్కుపుటాలకు తాకుతున్నాయి వాటిలో ప్రతిఒక్క సువాసనా వాడికి సుపరిచితమైనదే

ఇదిగో యిది అడవి పుదీనా వాసన ఇది అగరు గంధం. అదిగో అది మొగలివాసన అది సంపెంగ వాసన అల్లదిగో అది సీలధారీ వాసన అన్ని సువాసనలూ ఒక్కుమ్మడిగా, విడివిడిగా గుమ్ము మంటున్నాయి ఇంతలోనే వాని చెవి దగ్గర తరనా పకపక నవ్వినట్లు కాగా, వాడు గాభరాపడి కండ్లు తెరిచాడు

అబ్బే ఎవరూ లేరే! ఆ గుడిసే లేదు తరనా లేదు లేడి చర్మమూ లేదు. వేటలో తను చంపినలేడీలేదు.- నలువంకలా గాఢాంధకారం, ప్రగాఢ నిశ్శబ్దం ఆవరించి ఉన్నాయి. దూరానగల ఎత్తయిన చెట్టు కొమ్మపైనుంచి గుడ్లగూబ కర్ణకఠోరంగా అరిచి రెక్కలు టపటప కొట్టుకుంటూ ఎగిరిపోయింది

జంగ్లీ గాభరాగా అక్కణ్ణుంచి లేచి బయల్దేరాడు

(సశేషం)

ప్రాజెక్టుల ప్రగతి

(1వ పేజీ తరువాయి)

ఈరెండుఫ్యాక్టరీలు సోవియట్ యూనియన్ సహకారంతో నిర్మించబడ్డాయి

యాంటీబయోటిక్ మందుల ఉత్పత్తి

1971-72 సంవత్సరంలో ఋషీకేశ్‌లోని యాంటీబయోటిక్ మందుల ఫ్యాక్టరీ ఉత్పత్తులు. అంతకుముందు సంవత్సరం కంటె, 61 శాతం పెరిగాయి హైదరాబాదులోని సింథటిక్ మందుల ఫ్యాక్టరీ కూడా అంతకుముందు సంవత్సరంకంటె 63 శాతం ఉత్పత్తిపెంపొందించుకుంది.అంతేఆఫ్యాక్టరీ నిర్ణీత ఉత్పత్తి శక్తికి మించి 22 శాతం ఉత్పత్తి అధికం చేయబడింది భారత దేశంలో విస్తృత ప్రాతిపదికపై వ్యాపించి, ప్రజానీకానికి అందుబాటులోలేని ధరలకు, మందులు అమ్ముతున్న విదేశీ మందుల కంపెనీల వ్యవస్థకుగల పట్టును బలహీన పరచేందుకై యీ ఫ్యాక్టరీలు ఎంతగానో సహాయ పడతాయి.

భారతదేశపారిశ్రామికీకరణలో సోవియట్‌సర్వతోముఖపాత్ర

అంతేకాదు, సోవియట్ యూనియన్ సహాయసహకారాలతోథర్మల్, జలవిద్యుత్కేంద్రాలు, బొగ్గుగనులు వ్యవసాయ క్షేత్రాలు, విద్యాసంస్థలు, తదితరప్రాజెక్టులుఎన్నో నెలకొల్పబడ్డాయి వీటిలో అత్యధిక ప్రాజెక్టులు యిప్పటికే అనేక సంవత్సరాలుగా సుస్థిరంగాను, లాభదాయకంగాను పని చేస్తున్నాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో యీ ప్రాజెక్టులకు మహత్తరమైన ప్రాధాన్యత వుంది.

భారతదేశం, సోవియట్ యూనియన్ల మధ్య కొనసాగుతున్న ఆర్థికసహకారంలో, నైపుణ్యంకల భారత సిబ్బందికి శిక్షణ యివ్వడం ప్రధానమైన అంశం. అనేక రూపాలలో భారతీయ నిపుణులకు శిక్షణ గరపబడింది. రెండు వేలకంటే ఎక్కువ మంది, భారతీయ నిపుణులకు సోవియట్ యూనియన్ లోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో సాంకేతిక శిక్షణ యివ్వబడింది. సోవియట్ యూనియన్ సహకారంతో నెలకొల్పబడిన సాంకేతిక శిక్షణ కేంద్రాలలోను, ఉన్నతవిద్యాసంస్థలలోను భారతీయ సాంకేతిక నిపుణులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

భారతదేశంలో వివిధ ప్రాజెక్టులనిర్మాణ దశలోను, తర్వాతకూడా వేలసంఖ్యలో భారతీయ కార్మికులకు, సాంకేతిక నిపుణులకు సోవియట్ నిపుణుల సహాయంతో శిక్షణ గరపబడింది.

నిపుణులకు శిక్షణ

కష్టించి పని చేసే, తెలివితేటలు కల భారతీయ యువ నిపుణులు, కార్మికులు వివిధ ప్రాజెక్టులను ఆధునికంగా నిర్మించడంలోని సాంకేతిక మెళకువలను, ఫ్యాక్టరీల స్థాపన, క్లిష్టమైన యంత్రాలు, సాధనాలను, పని చేయించడం వగైరా కార్యకలాపాలను త్వరితంగానే అవగాహన చేసుకుంటున్నారు ఇంతవరకు సోవియట్ సహకారంతో నెలకొల్పబడిన అనేక ప్రాజెక్టులను భారతీయ ఇంజనీర్లు, కార్మికులు సోవియట్ నిపుణులు పాల్గొనవసరం లేకుండానే నిర్వహిస్తున్నారు. అంతేకాక, యితర ప్రాజెక్టుల నిర్మాణంలోను, నిర్వహణలోను, పాల్గొంటున్న సోవియట్ నిపుణుల సంఖ్య కూడా క్రమేణా తగ్గుతోంది

గత అనేక సంవత్సరాలుగా, భారత దేశంలో అనేకమంది అనుభవం కలిగిన మేనేజర్లు, ఇంజనీర్లు, నిర్మాణ కార్మికులు తయారయ్యారు. సోవియట్ సహాయంతో నిర్మించబడిన యితర ప్రాజెక్టులలోయిప్పుడు పని చేస్తున్న మేనేజిమెంటు సిబ్బంది, భిలాయ్ ఉక్కు కర్మాగారం నిర్మాణం సందర్భంగా పని ప్రారంభించినవారే. వీరు వివిధ పరిశ్రమల స్థాపనకు, నిర్వహణకు అవసరమైన అనుభవాన్ని అక్కడే గడించారు

భారతీయ, సోవియట్ నిపుణులుకలిసి ఎక్కడైతే పని చేస్తారో అక్కడ ఉభయుల మధ్య మంచిసహకారం, మైత్రి వుంటాయి. తమ భారతీయసహచరులతో తమ అనుభవాలను, విజ్ఞానాన్ని పంచుకోడానికి సోవియట్ ప్రజలుఎల్లప్పుడూ ఉత్సాహం ప్రదర్శిస్తూనే వుంటారు.

స్వతంత్రమైన, అభివృద్ధికరమైనఆర్థిక వ్యవస్థను సృష్టించే యీమహత్తర కర్తవ్య సాధనలో సోవియట్ - భారత సహకారం ఒక ప్రధానమైన అంశం జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించిన యీమహత్తర లక్ష్య సాధనను, ఆయన కుమార్తె ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంక్రింద భారత ప్రభుత్వం ముందుకు గొనిపోతుంది. ఈ సహకారం అనేక సాంఘిక సమస్యల పరిష్కారానికితోడ్పడుతుంది పూర్వంనుండి వెనుకబడి వున్న ప్రాంతాల అభివృద్ధి సాధనకు సహాయపడుతుంది ఉద్యోగావకాశాలను పెంపొందింప చేస్తుంది. కొంత కాలానికి భారతదేశ ప్రజల జీవన ప్రమాణాలను అభివృద్ధిపరచేందుకు యీ సహకారం

(మిగతా 8వ కాలంలో)

నేటి ప్రపంచం

చిలీ పరిణామాలు

విప్లవ శక్తులు విజృంభిస్తున్న కొద్దీ విప్లవ ప్రతీఘాత శక్తుల ప్రతిఘటన కూడ తీవ్రమవుతుంటూంది.

నేటి చిలీ పరిణామాలు దీనినే రుజువు చేస్తున్నాయి.

1973 మార్చిలో సాధారణ ఎన్నికలు జరుగనున్నాయి దానికిగాను ఇప్పటి నుండి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. చిలీ పార్లమెంటులో తమకు గల మెజారిటీని ప్రతిపక్ష- పార్టీలయిన మితవాద క్రిష్టియన్ డెమోక్రటిక్‌పార్టీ, పచ్చిఅభివృద్ధి నిరోధక సంస్థ నేషనల్ పార్టీ అడుగడుగునా అలెండీ ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తున్నాయి చిలీ దేశీయాంగ మంత్రి హెర్నన్ కాండో, రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించాడని, అధికారాన్ని దుర్వినియోగపరచాడని ఈ మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలు పెద్ద దుమారం లేపాయి. చివరకు దేశీయాంగ మంత్రి రాజీనామా ఇచ్చారు పారిశ్రామిక సంస్థలను జాతీయం చేయకుండా నిరోధించేందుకు అలెండీపై పార్లమెంటరీ "యుద్ధా"న్ని ప్రకటించారు.

జూలై మొదటి వారంలో చిలీ రాజధాని శాంటియాగోలోని కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంపై ఫాసిస్టు మూకలు దాడిచేశాయి, కమ్యూనిస్టు నాయకుల ఇళ్ళపై దాడులు, దౌర్జన్యాలు జరిపి ఒకరిని బలిగొన్నాయి. అనేకమందికి తీవ్రంగా గాయాలతగిలాయి.

అలెండీ ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకై దేశంలోని విప్లవ ప్రతీఘాత శక్తులు అమెరికా సామ్రాజ్య వాదులు సమిష్టిగానే పథకాలు రూపొందించినట్టు గత నెలలో "న్యూయార్క్ టైమ్స్" పత్రిక వెల్లడించింది రాబోయే కొద్ది రూపాలలో ఈ కుట్రను అమలు పరచాలని కూడ వీరు నిర్ణయించుకున్నారు సోషలిస్టులు, కమ్యూనిస్టులతో కూడిన పోప్యులర్ ఐక్యసంఘటనను విచ్ఛిన్నం చేసేందుకు, అలెండీ ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకు తీవ్రవాద శక్తులను ఉపయోగించుకోవాలని, హింసాయుత, దౌర్జన్యకర చర్యలకు వారిని రెచ్చగొట్టాలని-కూడా ఈ కుట్రదారులు నిర్ణయించుకున్నారు

దౌర్జన్యకర, హింసాయుత, పద్ధతులకు తీవ్రవాద శక్తులను రెచ్చగొట్ట గల్గితే అలెండీ ప్రభుత్వాన్ని చిన్న మధ్య తరగతి రైతాంగం, ఉద్యోగుల నుండి దూరం చేయవచ్చుననేది సామ్రాజ్య వాదుల పథకం ఇదికూడ "న్యూయార్క్ టైమ్స్" పత్రికే వెల్లడించింది

ఒకవైపు మితవాద, పార్టీలయిన క్రిష్టియన్ డెమోక్రటిక్ పార్టీ, నేషనల్ పార్టీలు రానున్న ఎన్నికలలో కలసి పోటీ చేసేందుకై ఒక ఫ్రంట్‌గా ఏర్పడాయి.

మరో వైపు తీవ్రవాద, కుహనా విప్లవకారుల దుస్సాహసిక విధానాన్ని అనుసరిస్తూ చిన్న రైతుల ఆస్తులనుకూడ ఆక్రమించుకునేందుకు పూనుకుంటున్నారు. దౌర్జన్యాలను జరుపుతున్నారు. ప్రభుత్వాన్ని "సంస్కరణ వాదం"గా చిత్రీకరిస్తూ నిందా ప్రచారాన్ని సాగిస్తున్నారు. అభివృద్ధినిరోధకులకు వ్యతిరేకంగా తక్షణమే సాయుధ సంఘర్షణ చేపట్టి, పార్లమెంటును రద్దుచేసి, నూతన సైన్యాన్ని నిర్మించాలనే వీరి వాదన పైకి ఎంత విప్లవకరంగా కనిపిస్తున్నా, అది ఆచరణలో విప్లవ ప్రతీఘాతానికే తోడ్పడే దుస్సాహసిక విధానమని కమ్యూనిస్టుపార్టీ నాయకులు స్పష్టం చేసారు.

అటు అభివృద్ధి నిరోధకశక్తుల కుట్రలను వమ్ముచేస్తూ ఇటు కుహనా విప్లవకారుల దౌర్జన్యకర విధానాలను అణచివేస్తూ అలెండీ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది

1970 నవంబరు నుండి 35 లక్షల హెక్టార్ల భూమిని అలెండీ ప్రభుత్వం జాతీయంచేసి పేదరైతులకు పంచింది క్రిందటినెలలో సుదమెరికానో బ్యాంకును జాతీయం చేయడంతో దేశంలోగల బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చింది గత సంవత్సర కాలంలో నిజవేతనాలు సగటున 20 శాతం పెరిగాయి

కమ్యూనిస్టుల విజయాలు

పోప్యులర్ యూనిట్ ఫ్రంటు రూపొందించిన నూతన కార్యక్రమం ప్రకారం ఆగస్టు నెలలో ప్రాంతీయ సమావేశాలు సెప్టెంబరులో దేశవ్యాపిత సమావేశాలుజరిపి, ప్రభుత్వం అమలుపరుస్తున్న కార్యక్రమాలలో ప్రజానీకం విస్తృతంగా పాల్గొనేలా కృషిచేస్తుంది ఫ్రంట్‌లోని భాగస్వామ్య పార్టీలమధ్య ఐక్యత అన్నిస్థాయిలలోను మరింత దృఢపరచడానికి, ప్రభుత్వ నూతన కార్యక్రమాన్ని రూపొందించటానికి నిర్ణయాలు తీసుకున్నది

చిలీలోని అతిపెద్ద కార్మికసంస్థ అయిన యునైటెడ్ ట్రేడ్‌యూనియన్ సెంటర్ నాయకత్వ స్థానాలకు జరిగిన ఎన్నికలలో పాప్యులర్‌ఫ్రంట్ అభ్యర్థులు అఖండ విజయం పొందేరు. చిలీ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్ష స్థానానికి కమ్యూనిస్టు అభ్యర్థి రోజాస్ తిరిగి ఎన్నికయ్యారు. ఈ రెండు సంస్థల ఎన్నికలఫలితాలు వామపక్ష శక్తుల ఐక్యతకు విజయంగా అందరూ అంగీకరిస్తున్నారు.

క్రిందటి నెలలో కోకింబో రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఉప ఎన్నికలలో మితవాద శక్తుల ఐక్య అభ్యర్థిని కమ్యూనిస్టు అభర్థి అల్లా మిరానో ఓడించారు

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

సమీక్ష

'నగారా'

రచన అరుణోదయం
ప్రచురణ - అరుణోదయ పబ్లికేషన్స్
వేట పాలెం-ప్రకాశం జిల్లా
వెల 2-50

సమకాలీన సమాజంలో ధనస్వామ్య వ్యవస్థవల్ల ఉత్పన్నమయ్యే సమస్యల్నీ, సంక్షోభల్నీ తమ కవితావస్తువులుగా చేసుకుని అనేక మంది నవయువకవులు తమ కలాల్ని కదిలిస్తున్నారు కావ్యాలు సంకలనాలు వెలువరిస్తున్నారు

అయితే భావపరిణత, సమగ్ర పరిశీలనా శక్తి, పదప్రయోగ నిపుణత లోపించినపుడు అవి పాఠకుడికి భావస్ఫూర్తిని కలిగించలేవు అభివ్యక్తీకరణ లోపంవల్ల అయోమయం, అస్పష్టత కూడా ఆ కవిత్వంలో చోటు చేసుకుంటాయి ఆ కోవకు చెందినదే ఈ 'నగారా' ఖండకావ్యం

"మతమంటే ఉన్మాదం
మాత్సర్యం
మతమంటే మారణహోమం"

అంటూ, కులమతాలు మానవుడి ప్రగతికి అవరోధమని, దేవుళ్లు, దెయ్యాలు, గుళ్ళు, గోపురాలు అన్నీ మిధ్యా భ్రమలని చెప్పటమే దాదాపు ఈ మొత్తం కావ్యానికి వస్తువయింది

భౌతికవాదినని ఒక ప్రక్క తనని తాను చెప్పుకుంటూనే -

"ధాన్యాన్ని దాచమనేవాడు
దేవుడు
కష్టజీవుల కడుపు కొట్టమనే
వాడు దేవుడు
లక్షలాది జనాన్ని ఆకలి
రోగాలకి
గురిచేయమనేవాడు దేవుడు!"

అనడంలో కవికిగల భావం సరిగా వ్యక్తం కావడంలేదు

'శమతీసి,' 'అంతరాలు' లాంటి కొన్ని ఖండికలలో కన్పించే సామాజిక స్ఫూర్తి కూడా నిర్దుష్టంగా లేదు అభివ్యక్తిలో లోపం ప్రతి చోటా వ్యక్తమౌతుంది

ఈ వచన కవితా కావ్యంలో క్రియా పదాలు ముందు చేర్చిన వచనమే అత్యధికంగా కన్పిస్తోంది - అంతర్లయ లోపించి

"సుఖమంటే తెలియలేక
సౌఖ్యాన్ని చవి చూడలేక
క్రుంగుతూ కుములుతూ
బ్రతికేకంటే ప్రాణంతో
ఉండే కంటే
నాకు చావాలనిపిస్తోంది!"

అని మరోచోట తెరచాటులేని నిరాశావాదం చోటు చేసుకుంది

సమస్యల్నీ, దానికి మూల కారణాల్నీ సరిగా అర్థం చేసుకోలేనప్పుడు పరిష్కార సూచన కూడా విభిన్నమూ, విరుద్ధము అయిన భావాల ప్రోదిఅయ్యేప్రమాదం లేక పోలేదు. మచ్చుకి-

"క్రియా విప్లవం[?]రావాలి
పీడించేలోకం పోవాలి"(విప్లవం)

"వ్యధతో వ్యాకులంతో
బాధతో, భయంతో
బ్రతుకీడ్వలేను- బ్రతుకలేను
ఎందుకు నేను జీవిస్తున్నాను'"
(ఎందుకు నేను జీవిస్తున్నాను)

నూటపన్నెండు పేజీల ఈ పుస్తకంలో పునరుక్తిదోషాలు, ముద్రారాక్షసాలుతక్కువేం లేవు అంతా చదివాక కేవలం విస్తరణాభిలాషతో వ్రాసినట్లు అభిప్రాయం కలుగక మానదు వివరణలు, వ్యాఖ్యలు కవిత్వ గుణాన్ని తగ్గిస్తాయి కూడాను

'దీనజనుల్ని ముందుకు నడవమని పురిగొల్పడానికి'

"నగారా మ్రోయించు
దిక్కులదర గర్జించు!
శపించు సంపదల సంతనాన్ని!"

అని 'నగారా'లో పలికిన ఈ కవి మరింత స్పష్టమైన అభిప్రాయాలతో తన సాహిత్య శక్తిని పెంపొందించుకోవాల్సివుంది

—చక్రవర్తి

(2వ కాలం తరువాయి)

పూర్తిగా తోడ్పడుతుంది

భారత - సోవియట్ ప్రజల ప్రాథమిక ప్రయోజనాలకు, శాంతి, సామాజిక అభివృద్ధి కోసం ఉభయులు కొనసాగించే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల ప్రయోజనాలకు అనుగుణంగానే యీ సహకారం వుంది అందుచేతనే మనదేశ ప్రజలు, యీ సహకారాన్ని మరింత అభివృద్ధిపరచి, పటిష్టవంతం చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు

(న్యూఏజ్ జూలై 30)

నాటిక

భూమికోసం...!

దస్తగీర్

పాత్రల పరిచయం:

పాపారావు: ఇదా భూస్వామి, పంచాయతీబోర్డు ప్రెసిడెంట్ పాపాల భైరవుడు. ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచె. జరీ పేటంచు కండువా. బొర్రమీసాలతో నిండైన భారీ విగ్రహం నోటిలో చుట్ట, చేతి వ్రేళ్ళకు ఎర్రనిపూలు చుట్టిన బంగారు ఉంగరాలు గ్రామంలోని ప్రతి వారినీ తన చెప్పుచేతల్లో వుంచుకుని దోపిడీ చేస్తూ, పెత్తనం చెలాయిస్తూ కసయిస్తాలవన్నే ఫ్యూడల్ భూస్వామ్య వర్గానికి సిసలైన ప్రతినిధి. మాటల్లో అధికారం, అహంకారం ఉట్టిపడుతుంటాయి. వయస్సు 40 సం॥

కామయ్యశాస్త్రి - గ్రామకరణం పాపారావు అనుయాయి నిప్పుకు గాలి తోడైనట్టు ప్రెసిడెంట్ పాపాలన్నింటిలోనూ పాలు పంచుకుంటూ వుంటాడు గ్రామ జీవనంలో ఒకరిజుట్టు మరొకరికి ముడివేసే మనస్తత్వం ఎక్కువగా వుంటాయి నెత్తిన చిన్న పిలక, పిళ్ళగోచీ, ముక్కుమీదికి జారి వుండే కళ్ళజోడు క్రింద నుండి చూచే జిత్తులమారి చూపులు ప్రతి మాటకు చిత్తం అనటం అలవాటు. ఇతన్ని "పాపారావు తోక" అని గ్రామ ప్రజలు హేళనగా అంటుంటారు. వయస్సు 50 సంవత్సరాలు.

షాహుకారు రంగిశెట్టి : పంచాయతీ బోర్డుమెంబరు. గ్రామంలోని పెద్దకిల్లరకొట్టుకు అధిపతి పంటల కాలంలో ధాన్యం కల్లాలపై కొనేసి, గోడౌన్లలో నిల్వచేసి బ్లాకుమార్కెట్టులో అమ్ముతుంటాడు. వడ్డీవ్యాపారి. స్థూలకాయం, నొసట పెద్ద పంగనామాలు, పెద్ద బొజ్జ. బొంగురుగొంతు ప్రతిమాటకు ముందూ - వెనకా "అంతా ఆ ఏడుకొండలవాడిదయ" అనటం అలవాటు ప్రెసిడెంటుకు తోడుదొంగ. వయస్సు 40 సంవత్సరాలు

జోసెఫ్; పంచాయతీబోర్డు మెంబరు. హరిజన బాలుర హాస్టల్ యజమాని. మాలపల్లిలో కులపెద్ద ఖద్దరు ధరిస్తాడు. పాపారావు అనుయాయి వయస్సు 35 సం॥

చంద్రశేఖర్ . వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి, చదువూ, సంస్కారం, అభ్యుదయ భావాలు కలవాడు. అన్యాయాన్ని ఎదిరించే మన స్తత్వం కలవాడు. గ్రామాభ్యుదయానికి పాటుపడుతుంటాడు. శాంతమూర్తి గారి కొడుకు. పురోగామియువతకు ప్రతినిధి. లాల్చీ, పంచెలో నిరాడంబరంగా వుంటాడు. వయస్సు 25 సం॥

మస్తాన్‌దాదా : ముస్లిం వృద్ధుడు ముస్లిములందరికీ గౌరవపాత్రుడు గెడ్డం, కమీజు. గళ్ళ లుంగీ, పేదరికాన్ని సూచించే వేషధారణ, అందరూ "దాదా" అని అభిమానంగా పిలుస్తారు. వయస్సు 50 పైబడి.

దుర్గాంబ : ప్రెసిడెంటు భార్య, పరమ గయ్యాళి వయస్సు 35 సంవత్సరాలు.

నాగులు : ప్రెసిడెంటు పాపారావుకు నమ్మిన బంటు, రౌడీ పాపారావు కనుసైగ చేస్తే చాలు మనుష్యుల ప్రాణాలు చిటికెలో తీయగలడు. పచ్చి నెత్తురు త్రాగే కర్కోటకుడు; గ్రామపెట్టిగా పని వయస్సు 30సం॥

ఇంకా: సలీం, రాజారావు, అబ్రహాం, షడ్రక్, కృష్ణమూర్తి, వెంకట్రావు, వ్యవసాయ కార్మికసంఘ కార్యకర్తలు.

1వ రంగం

[ప్రెసిడెంటు పాపారావు ఇల్లు గోడలకు ప్రధాని, గాంధీ, నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్, సుభాస్‌చంద్ర బోస్ ఫోటోలు - మిగిలినవి దేవుళ్ళ ఫోటోలు వుంటాయి. టేబుల్‌పై టేబుల్‌క్లాక్, కుర్చీలు, క్యాలెండర్లు, ఫ్లవర్‌వేజ్‌లతో అందంగా అలంకరించబడి వుంటుంది. పాపారావు న్యూస్‌పేపరు చదివి మడతపెట్టి టేబుల్‌పై పెట్టి టైంచూస్తూ లేచి నిలబడి...]

పాపా. దుర్గా! దుర్గా!

దుర్గా: (లోపలినుండి) ఆ...వస్తున్నా

పాపా; త్వరగారా నా కవతల టైమైపోతుంది. ఈ రోజు జిల్లాపరిషత్ ఆఫీసులో మీటింగు వుంది. మంత్రిగారు వస్తున్నారు నా కోసం అందరూ ఎదురు చూస్తుంటారు అక్కడ త్వరగా వెళ్ళాలి

దుర్గా: (వంటగది నుండి పైట కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి పెద్ద గొంతుతో) అబ్బబ్బ! ఏమిటండీ మీ పొలికేకలు? మీ కెదురుగా నేనిక్కడ కూర్చుంటే అక్కడ వంటెవరు చేస్తాడు మీ తాత?

పాపా వంట మాతాత చేయటమైతే నిన్నెందుకే పెండ్లి చేసుకోవటం? అయినా యీ వూళ్ళో నీవొక్కదానివే వంట చేస్తున్నావా? మరెవరైనా వంట చేసుకుని కడుపుకు తింటున్నారంటావా? నీ వంట నువ్వు చేసుకోవటం అంటే దేశాన్ని ఉద్ధరిస్తున్నట్టా? ఏం చేతకాకపోయినా రంకెలు వేయటం మటుకు చేతనౌతుంది

దుర్గా: మీరు మాటలు మటుకు జాగ్రత్తగా మాట్లాడండి ఏమనుకుంటున్నారో. రంకెలు గింకెలు అంటున్నారు నేనేమైనా గొడ్డుననుకున్నారా? పైగా ప్రతి మాటకూ "దేశోద్ధరణ" అంటారు. నేను గాకపోయినా మా "ఇందిరమ్మ" ఉద్ధరిస్తోంది కాదంటారా? యాహ్యాఖాన్ పీచమణిచి బంగ్లాదేశ్ ఏర్పడేట్టు చేసిందెవరు? మా ఇందిరమ్మ! రాజభరణాలు రద్దు చేసిందెవరు? మా ఇందిరమ్మ! బ్యాంకులు జాతీయం చేసిందెవరు? మా ఇందిరమ్మ! ఇప్పుడు సోషలిజం తెస్తానని అదె పనిగా చెపుతున్నదెవరు? మా ఇందిరమ్మే! ఎంత వంటగదుల్లో మొహాలు మసి పులుముకు నుంటే మటుకు మా అడవాళ్ళకా మాత్రం తెలియదనుకున్నారా? మా ఇందిరమ్మ పనకార్యాల్ని గురించి ఆలిండియా రేడియో అదేపనిగా విసుగూ విరామం లేకుండా చెబుతుంటే మేమంతా వినటం లేదనుకుంటున్నారా? మాకన్నీ తెలుస్తూనే వున్నాయి.

పాపా: (చెవులు మూసుకుంటూ విసుగుతో) అబ్బబ్బ' ఇక చాల్లే ఆపవే మీ ఇందిరమ్మ చాలా చేసిందిగాని అ రేడియో వాళ్ళకంటే మీ ఆడవాళ్ళ డబ్బాకొట్టటం ఎక్కువైపోయింది వినలేక ఛస్తున్నాం, కదిలిస్తే కందిరీగల్లా నోరేసుకుని కమ్ముకుంటారు మహా చేసిందంట .చేసును

దుర్గా. ఏం చేయలేదా?

పాపా: అబ్బ చేసిందిలేవే ప్రాణాకే పెంపు లెగిరిపోయేట్టు అరపటోరు గర్భస్రావాలు చట్టబద్ధం చేసింది, ఎక్కువమంది పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ పేరుతో ఆడ- మగకు 'కటింగ్" పెట్టింది, ఇకపోతే మీ ఆడ వాళ్ళందరూ శాసనసభల్లో పార్లమెంటులో శతపోరి విడాకుల చట్టం ఇంతకుముందే తెచ్చుకున్నారామె

దుర్గా. మరి రాజభరణాలు రద్దుచేసి, బ్యాంకులు జాతీయం చేయలేదా? సోషలిజం తెస్తాననటం లేదా!

పాపా: అన్నీ చేసిందిలేవే - అవన్నీ చేస్తూ మనలాంటి వారికి ఎసర్లు తెచ్చి పెడుతూ మన కొంపలు ముంచుతూంది

దుర్గా. ఆమె ప్రజలకు సంబంధించిన మంచి పనులు చేస్తూంటే మనకొంపలెందుకు మునుగుతాయండీ?

పాపా పిచ్చిదానా! రాజభరణాలు రద్దుచేస్తే మనకు పోయిదేమీ లేదు మాజీ రాజాలకు నష్టం. బ్యాంకులు జాతీయంచేసినా మనం పెద్దగా నష్టపోయే దేమీలేదు దేశం మొత్తంమీద కోట్లరూపాయలతో వ్యాపారం చేసే బ్యాంకర్లకు నష్టం. జాతీయం చేయక ముందైనా-చేసినతర్వాతైనా బ్యాంకుల నుండి రుణాలు మనలాంటివారికి ముడుతూనే వచ్చాయి, ఇతర లావాదేవీలన్నీ సజావుగా సాగుతూనే వచ్చాయి అందుకే "ఇందిరా జిందాబాద్!" అన్నాం "శభాష్' యివన్నీ మంచి పనులే 'నన్నాం, "చేయాల్సిందే' నన్నాం. కాని ఆమెగారి మంచిపనులంతటితో ఆగలేదు

దుర్గా: (సంతోషంగా) ఇంకా ఏంమంచి పనులు చేసిందండి?

పాపా: (కోపంగా) భూ గరిష్ట పరిమితి చట్టం ప్యాసుచేసి మనకు తలకొరివి పెట్టింది

దుర్గా. ఆ చట్టం చేస్తేమనకేం; చేసుకో నివ్వండి

పాపా. ఓసే వెర్రి మొగమా! ఈ వూరు చుట్టు పక్కల కుంటా సెంటూ, పొలమున్న బీదా బిక్కి జనానికీ, ఒక మోస్తరు పొలమున్న రైతు దెగ్గరనుండీ సన్నకారు రైతులవరకూ పెండ్లిండ్లకూ, పబ్బాలకూ భూములు తనఖా పెట్టుకొని చక్రవడ్డీలకు అప్పులిచ్చి-వాళ్ళ జుట్టు వీళ్ళకూ, వీళ్ళజుట్టు వాళ్ళకూ ముడిపెట్టి, ఉమ్మడి కుటుంబాలు విడదీసి, వాళ్ళలో వాళ్ళు బుర్రలు బ్రద్దలు కొట్టుకొని కోర్టులకెక్కి సంవత్సరాల తరబడి వేజ్యమాడి ఉభయులూ తిరుక్షవరమై మీ నాన్నకు దఖలుపర్చిన భూములు.. అంటె వాళ్ళ నోరుకొట్టి, వీళ్ళ నోరుకొట్టి-వాళ్ళ కొంపకూల్చి, వీళ్ళ కొంపకూల్చి మీ నాన్న సంపాదించిన బంగారంలాంటి 100 ఎకరాల మాగాణీ, 500 ఎకరాల మెట్ట యీ దెబ్బతో కృష్ణార్పణం! మనలాంటివాళ్ళంతా నెత్తిన గుడ్డేసుకుని తిరుపతి కెళ్ళి గుండుకొట్టించుకోవాలి (కండువా నెత్తి నేసుకుంటాడు)

దుర్గా: మానాన్న వూళ్ళోవాళ్ళ నోరుకొట్టి - కొంపలుకూల్చి సంపాదించినదంతా మిమ్మల్ని ఇల్లరికం తెచ్చుకుని మీకే అప్పగించి వెళ్ళాడుగా! ఏం చెప్తుతారులెండి (మూతి విరుస్తుంది).

పాపా: చెప్పటంగాదే దేభిమొగమా! ఇప్పుడు తెచ్చిన భూగరిష్ట పరిమితి చట్టం ప్రకారం మిగిలిన భూముల్ని ప్రభుత్వం స్వాధీనపర్చుకుంటుంది మరిప్పుడర్థమైందా? మీ ఇందిరమ్మ తేబోయే సోషలిజం?

దుర్గా. ఆ...అలాగా (నోరు నొక్కుకుని) ఏమోనండి నాకు శోష వచ్చినంత పనైంది. (దిగులుగా తలకు చేతులు పెట్టుకుని క్రింద చతికిల బడుతుంది - కొంచెం తేరుకొని) మరిప్పుడు - మనం ఏంచేయా లంటారు?

పాపా. ఏం చెయ్యాలంటావా...,నేను నీకు వెంటనే విడాకులియ్యాలంటాను!

దుర్గా: (ఉక్కు ఉడుకున దిగ్గునలేచి మీదికొస్తూ పెద్ద గొంతుతో) ఏమిటేమిటి మళ్ళీ అనండామాటలు? విడాకులిస్తారా!? (గుండెలు బాదుకుంటూ) అమ్మో! అమ్మో! ఎంతకు తెగించారు! ఈ వయసులో యిలాంటి పెడబుద్ధులు పుడతాయనుకోలేదు నేను మీకేం అడ్డొచ్చానని ఇలాంటి అఘాయిత్యపు మాటలంటున్నారు. నన్ను అన్యాయం చేయాలని చూస్తున్నారా? మీకిది ధర్మమేనా చెప్పండి (కళ్ళనీళ్ళతో చీరేస్తూ మంగళసూత్రం కళ్ళ కద్దుకుంటుంది)

(బయట గుమ్మంలో కామయ్యశాస్త్రి, రంగిశెట్టి, జోసెఫ్ లోపలికి రావటానికి సంశయిస్తూ నిలబడి వుంటారు.)

పాపా. ఎవరూ మీరా? రండి రండి లోపలికి రండి (లోపలికి వస్తున్న వారికి కూర్చో వలసిందిగా కుర్చీలు చూపుతాడు అందరూ కూర్చుంటారు. జేబులోంచి చుట్ట తీసి ముట్టించి, నవ్వుతూ) నేను మా ఆవిడకు విడాకు లివ్వాలనుకుంటున్నాను (ముగ్గురూ తెల్లబోయి అర్థంగాక అయోమయంగా చూస్తుంటారు) ఏమండీ కరణం గారు మాట్లాడరేమిటి?

కామ॥శాస్త్రి. చిత్తం! చిత్తం!

దుర్గా. (గుమ్మానికానుకుని లోపలినుండి గాద్గదికంగా) ఏమండీ కరణంగారూ! మీరు కూడా ఆయనగారి అఘాయిత్యపు మాటలకు తాళం వేస్తూ చిత్తం, చిత్తం అంటారేమండీ? పెద్దలు మీరంతా చెప్పండి ఇది మీకు న్యాయంగా తోస్తూందా?

కా శాస్త్రి: చిత్తం! చిత్తం! అమ్మా, ఏం చెప్పమంటాను; ప్రెసిడెంటుగారు . (నీళ్ళు నములుతాడు)

రం శెట్టి అబ్బే కాదులే అమ్మా, ప్రెసిడెంటుగారేదో ఎకసక్కానికనుంటారు.

పాపా: ఎకసక్కెం గాదు' దికసక్కెం గాదు నేను నిజంగానే విడాకులివ్వదల్చుకున్నాను. నేనేకాదు మీరుకూడా మీ మీ భార్యలకు విడాకు లివ్వాల్సిందిగా సలహా యిస్తున్నాను.

దుర్గా. ఇవ్వం డివ్వండి. వచ్చటి కాపురాలు ముక్కచెక్కలయ్యే యిలాంటి సలహాలే యిస్తుండండి. తా చెడ్డ కోతి వనమంతా చెరిచిందట!

పాపా జానే! యిప్పుడు కాపురాలు ముక్కలు చెక్కలు కాందే బంగారం పండే వందలాది ఎకరాల మాగాణి, మెరక పొలాలు రక్షించుకోలేం. ఒకే కుటుంబం పేరుతో వందల ఎకరాల భూములు లాయూ భాంగరంలేని అలగా జనానికి ధారాదత్తం చేయటమా? విడాకుల పేరుతో నాటకమాడి ఒక సెంటు భూమి ప్రభుత్వ స్వాధీనం కాకుండా దక్కించుకోవటమా? తెల్చుకోవలసి వుంది

కా॥శాస్త్రి చిత్తం! చిత్తం! నేను ముందే అనుమానించాను, ఇలాంటి లిటిగేషనేదో, వుండి వుంటుందని. నా వూహ కరెక్టే

జోసెఫ్ క్షమించాలి! నా కర్థంగాక అడుగుతున్నాను విడాకులు పుచ్చుకోటానికీ- భూములు దక్కించుకోటానికి ఏమిటి సంబంధం?

పాపా అసలక్కడేవుంది లిటిగేషన్. ఈ శాసనసభా సమావేశాలలో భూగరిష్ట పరిమితి చట్టం ప్రవేశపెట్టబోతున్నారా? గ్యారంటీ నీటి వసతులు కల్గివుండి సంవత్సరానికి రెండు పంటలు పండేభూమి కుటుంబానికి 10 నుండి 18 ఎకరాలు గరిష్ట పరిమితిగా వుండాలని, యిది 1970 సెప్టెంబరు 26 నుండి అమలుపర్చాలని కాంగ్రెస్‌పార్టీ నియమించిన "భూ సంస్కరణల" కమిటీ సిఫార్సు చేసిందా?

జోసెఫ్. నిజమే! ఇదొక పెద్ద ప్రమాదం ముంచు కొచ్చింది. ఈ విషయమే తమరితో మనవిచేసి యీ ప్రమాదం నుండి బయటపడే తరుణోపాయం తెల్సుకోదామనే ముగ్గురమూ వచ్చాము

రం॥ శెట్టి ఏదో పెసైంటుగారూ! యీ వార్త తెల్సినప్పటినించి నోటికి ముద్దెళ్ళటం లేదు, కంటికి కునుకెట్టటంలేదు మాతాత ముత్తాతలు ఉప్పూ, పప్పూ సింతపండు కావళ్ళేసుకుని బుజాలుకాయలుకాసేట్టు మాలపల్లి, మాదిగపల్లి సుట్టుపక్కల పల్లెలెంట ఎండనక, వానసక తిరిగి నాల్గు డబ్బులు సంపాయించి, సెంబారుజనానికి వర్షాకాలంలో కూలీనాలీ లేనప్పుడు నాగులకిచ్చి, పెళ్ళి పబ్బాలకు వడ్డీలకిచ్చి, దినవారాలకి అప్పులిచ్చి పంటల కాలంలో గింజలు తీసుకుని నిల్వచేసుకుని ... కరువూ కాటకా లొచ్చినప్పుడు కొంచెం పిరెంగానే నమకోండి .. ఎక్కువైతేనేం మానిక్కి- రూపాయెక్కువ రేటు కమ్మినా బీదా బిక్కి ఆకలితో సావకుండా జనంప్యాణం రచ్చించి...అళ్ళిట్టూ వాకిట్టూ తాకట్టెట్టుకుని దరమ రాజులని పించుకొని- దర్మమం తామట్టుకుని, దనమంతా నా కప్పగించి ఎల్లిపోయారా? నేను గోసిడిసిగావంచా ఏసుకునే వయసొచ్చే సరికి వాళ్ళిచ్చిన భూములు 40 ఎకరాలు మాగాణి, 80ఎకరాలు మెట్టగా పెంచీసినానా...పూరిమీనతనఖాపెట్టుకుని వడ్డీ కిచ్చిందో 50వేలూ, మిల్లులోవాటా ఓ 50 వేలూ, బ్యాంకిలో క్యాసు ఓ 40వేలూ ఉన్నాయా? తరతరాల మా యీ సంపాదన ఏటై పోవాలా? నూస్ పేపరు సూడాలంటేనే బయమేత్తోంది...ఇలాంటి వార్తలిని ఇని నా గుండెప్పుడో రప్పమని ఆగిపోతది. అంతా ఆ ఏడుకొండలవాడి దయ సీటముంచినా పాలముంచినా అంతా ఆడిదే బారం! (చేతులెత్తి దండమెడతాడు)

జోసెఫ్: 'నువ్వే అలాఅంటే నేనెవరితో మొర్రబెట్టుకోనయ్యా...?

రం॥శెట్టి: (వ్యంగ్యంగా) ఏసుపెబు దగ్గర మొత్తుకో!

జోసెఫ్, సాలుసాల్లే పూర్కో శెట్టిగారూ! నీ ఎగతాళీ ..నువ్వూనూ

కా॥శాస్త్రి ఉష్! పూర్కోండయ్యా మీ పోట్లాటా మీరూను. సమయం సందర్భం లేకుండా

జోసెఫ్ ; అదికాదు కరణంగారూ! మా హరిజన హాస్టల్ కిందా, చర్చి కిందా కలుపుకుని 50 యకరాలు స్థలం ఆకట్టుకున్నామా? యీ భూమిలో ఒకవైపు చర్చి - మరోవైపు హరిజన హాస్టల్ ఏర్పాటుచేసి దానికి బాపూజీ హరిజన హాస్టల్ అని పేరెట్టి మా హరిజన మంత్రితో ప్రారంభోత్సవం చేయించి - హాస్టల్ ముందు బాపూజీ - చర్చిలో ఏసు ప్రభువు విగ్రహాల్ని నెలకొల్పి ప్రతి శుక్రవారం గాంధీగారి ప్రార్థనా గీతాలు భజన కార్యక్రమం తత్వ విచారణ, ఉపన్యాసాలు... ప్రతిఅదివారం చర్చిలో ప్యాండుమేళాలు, ప్రార్థనలు, చర్చిబయట సువార్త దండయాత్రలు గస్తూ జరుపుతూ, చర్చిలో ఏసు ప్రభువునూ, హాస్టల్‌లో బాపూజీని కొలుస్తూ, పిల్లలకు ఇటు దైవభక్తిని, అటు దేశభక్తిని నూరిపోస్తున్నామా? మరి మాలాంటి ప్రజాసేవకులంటే ప్రభుత్వాని కెందుకంత కన్నెర్ర చెప్పండి? దేవాలయాలి, ధర్మసంస్థల మాన్యాలుగాని, వాటి స్వాధీనంలోని భూములుగాని అన్నిటికీ భూగరిష్ఠ పరిమితి చట్టం వర్తింపచేయాలని భావిస్తున్నట్టు మంత్రిగారు శాసనసభలో చెప్పారుగదా? ఇదెక్కడి అన్యాయమండి మంత్రులే ఇంత నాస్తికులు అయితే - ప్రజలు మరెంత నాస్తికులైపోతారండీ ?

రం॥శెట్టి. ఛస్! బాగు బాగవయ్యా! మహా తెల్సినట్టు సెప్తుండావే? మా ఏడుకొండలవాడి కొండమీన ముప్పొటరవై అయిద్రోజులూ ఓదో ఓ మంత్రి మొక్కుబడ్లు, సాగిబ్బూసేస్తానే వుంటారయ్యో! వాలి పరిపాలనలో జనం ఎంతమంది కొండ కొచ్చి గుండ్లు కొట్టించుకు పోతున్నారో అంతా వారికి అజేనయ్యో!

కా॥శాస్త్రి ఉష్ ఉండండయ్యా! అయ్యా ప్రెసిడెంటుగారూ ..యీ ప్రమాదంనుండి మనమందరం బయటపడే ఉపాయం మీరే ఆలోచించాలి. మమ్మల్నందర్నీ రక్షించవలసిన బాధ్యత మీదే. మీరు అగ్నిగుండంలో దూకమన్నా దూకుతాం.

(బయట జీపువచ్చి ఆగిన చప్పుడౌతుంది)

పాపా అదిగో! జిల్లాపరిషత్ ఆఫీసు నుండి జీపొచ్చింది మంత్రిగారొచ్చేసే వుంటారు. నేనింకా రాలేదని పరిషత్ చైర్మన్‌గారు జీపు పంపారు. పదే రాత్రికి కలిసి మాట్లాడుదాం (లేచి నుంచుంటారు. జిల్లా పరిషత్ అఫీసు బంట్రోతు వచ్చి నమస్కరించి కవరు యిచ్చి వెళతాడు- చింపి చదివి నిరుత్సాహంగా బుజంమీది కండువాతీసి హేంగర్‌కు తగిలించి కుర్చీలో చతికిల బడతాడు. బయట జీపు కదలి వెళ్ళిన చప్పుడు మళ్ళీ అంతా కూర్చుంటారు)

కా॥శాస్త్రి . జీపు వెళ్ళిపోయిందేమిటి?

పాపా మీటింగ్ వాయిదా పడిందని పరిషత్ చైర్మన్‌గారు ఉత్తరంపంపించారు

జోసెఫ్ : ఏం ఎందుకని?

పాపా : మంత్రిగారు రాలేదట?

రం॥ శెట్టి· పాపం! మంత్రిగారి కేం జబ్బు చేసిందో!

పాపా : జబ్బుకాదు అర్జంటుగా అక్కడి పెద్ద హోటలుకు ప్రారంభోత్సవం చేయాల్సిన కార్యక్రమం వుందట.

రం॥ శెట్టి అంతేలెండి కాపీ ఓటళ్ళూ, గొడ్లాసుపత్రుల్లూ, కోళ్ళ ఫారాలు, కొండపై కోవెల్లూ ప్యారంభోత్సవాలెక్కి- అల్లా ఏలపాటంలేదు పాపం! మీటింగులొక్కచ్చే తీరికేదది.

కా. శాస్త్రి మరి ఏం చేయమని తమరి శలవు?

పాపా : నేను చెప్పినట్టు చేస్తారా?

కా. శాస్త్రి చిత్తం! చిత్తం! తమరి శలవైతే అగ్నిగుండంలో దూకమన్నా దూకుతామన్నాం గదా!

పాపా: మీరంతా అగ్ని గుండంలో దూకనవసరంలేదు. నేను చెప్పినట్టుచేసి... మనందరి శ్రేయస్సు కోసం నా వెనుక గట్టిగా నిలబడితే చాలు.

ముగ్గురూ . అయ్ అలాగే నిలబడతామని దేవుడిమీద ప్రమాణంచేసి చెపుతున్నాం

(ఇంతలో దుర్గాంబ ట్రేలో నాలుగు కాఫీలు పట్టుకొచ్చి పెడుతుంది. నల్గురూ కాఫీలు తాగుతారు)

పాపా: ఇది ఏ ఒక్కరిదో సమస్య కాదు-మనందరి సమస్య. మన ఆస్తిపాస్తులకి సంబంధించిన సమస్య. తరతరాలు వందలాది వేలాది ఎకరాల భూములకు అధిపతులమైన మనం, చట్టానికి బద్ధులమై ప్రభుత్వానికి వాటిని అప్పగించి కూలీ నాలీ జనం జరిపే భూపోరాటాలకు తలవొంచితే మన మనుగడే అసాధ్యం! మన దగ్గిర పాలేరే ఒక మడిచెక్కను దున్ని పంట పండిస్తూ తన కాళ్ళపై తాను నిలబడి రైతుగా మారితే మనదగ్గిర పాలేరుపనికి వుండడు. మన చెప్పుచేతల్లో వుండడు, మనని లక్ష్యపెట్టడు. పల్లె పట్టుల్లోని ఆర్థిక వ్యవస్థలో ప్రజల జీవన విధానంలో మార్పొస్తుంది దాంతో పాటు సాంఘిక ఆచార వ్యవహారాల్లో మార్పొస్తుంది ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామ జీవితంపై మన పట్టు సడలిపోతుంది

రం. శెట్టి, అందు కేమనమేటి సెయ్యాలె?

పాపా: శెట్టిగారూ! ప్రతి జబ్బుకూ మందున్నట్టే ఈ ప్రభుత్వం చేసే ప్రతి చట్టాన్ని తూట్లు పొడవటానికి అవకాశముంటుంది. మనం వెంటనే కొన్ని చర్యలు తీసుకోవాల్సి వుంది. కరణంగారూ!

కా. శాస్త్రి. చిత్తం!

పాపా ; మీ భూసంబంధమైన రికార్డులు ప్రభుత్వం వారు పరిశీలనార్థం తీసుకోక ముందే భూ గరిష్ట పరిమితికి పైగా వున్న భూమిని ఆరు సంవత్సరాలకుపై బడికౌలు కిచ్చినట్లుగా దొంగ కౌలులు సృష్టించుకోండి. పాత తేదీలతో విక్రయపత్రాలు వెంటనే వ్రాసుకోండి,మరోముఖ్యమైనసంగతేమిటంటే... కోర్టులో భార్యా, భర్తలు దొంగవిడాకులు తీసుకోవాలి. విడాకులు తీసుకున్న భార్యా, భర్త వాళ్ళ దగ్గిర బంధువుల పిల్లల్ని చెరొక పిల్లాడినిగాని, పిల్లనిగాని దత్తత తెచ్చుకుంటే మంచిది ఈ విధంగా మరి కొంత భూమిని దక్కించుకోవచ్చు.

రం॥ శెట్టి: ఏమ్మా ఇందాక పెసైంట్ గారు యిడాకులిత్తామని ఏమ్టికన్నారో యిప్పు డర్థమైనదా? (లోపలి గుమ్మంలో నిలబడి వింటున్న దుర్గమ్మని ఉద్దేశించి నవ్వుతూ అంటాడు)

పాపా. మరొక ముఖ్యమైన పాయింటేమిటంటే ..మనకునమ్మకస్తులైనవారి యిళ్లూ వాకిళ్ళూ, యితర ఆస్తిపాస్తులు తనఖా పెట్టుకొని వాళ్ళతో ప్రాంసరీ నోట్లు వ్రాయించుకుని వారికి గరిష్ట పరిమితి కంటె ఎక్కువ ఉన్న భూముల్ని యిచ్చేయటం మంచిది

కా. శాస్త్రి . చిత్తం! చిత్తం! ఇప్పుడెళ్లగానే ఆ ఏర్పాట్లన్నీ చకచక కొనసాగిస్తాం.

(నాగులు ప్రవేశించి దండంపెట్టి ఒక మూలగా చేతులు కట్టుకొని నిలబడతాడు)

పాపా : ఏంరా నాగులూ! ఏమిటి వూళ్ళో సంగతులు?

నాగులు ఏం సెప్పమంటారు దొరా! మాలపల్లి, మాదిగపల్లి, యింకా ఎల్లెలో కూలీనాలీ చేసుకునే జనం సంతోషంతో యిరగబడి పోతన్నరు. మీరీ మద్దెల రేసుమిల్లు పనిమీన అదరాబాదరా పోయినప్పుడు ..

కా. శాస్త్రి అదరాబాదరా కాదురా వెర్రి మొఖమా! హైదరాబాదు

నాగులు అబ్బ! అదేదో సెగండి దాని సిగదరగ దాని పేర్నాకు సరిగా వచ్చిసావదు. అ ..మీ రావూరు ఎల్లివున్నప్పుడు మాలపల్లి, మాదిగపల్లే గాకుండా సుట్టుప్రక్కల ఎల్లెలన్నింటిలో శానా మీటింగాలు జరిగాయి దొరా! పేదోళ్ళందరికీ బూవులు పంచాలని గొవ్రమెంటు సట్టం దెచ్చిందంటగందా? గవండ్లెంకులు, దూదేకుల పక్కీరయ్యా, ముత్రాసి ముత్యాలు, యానాది వెంకడూ, సాకలి పోలయ్యా, మంగలి మాలచ్మి, కమ్మరి పాపయ్యా, కుమ్మరి కాంతయ్యా అందరూ సంగం పెట్టినారు దొరా! కూటికి లేనోళ్లంతా ఒక సోట కూడుకుని కాంతయ్యగారి కొడుకు సెంద్రాన్ని పెద్దగా ఎన్నుకున్నారు దొరా! పట్నం నుండి అల్ల పార్టీ నాయకుడొచ్చిండు. ఎర్రజండాలట్టుకుని పెద్ద పూరేగింపు జరిపినారుదొరా! కలకటేరు దాటని కల్సుకుని కాగితాలు యిచ్చినారంట' రేపు ఆదివారంనాడు పెద్ద సెరవు ఎగువనున్న బంజరు ఆక్రమించి దున్ని పంచేస్తారట!

కా॥శాస్త్రి ఈ విషయాలన్నీ నీకెలా తెలిసాయిరా నాగులూ?

నాగులు: విన్న ఇసాకుగాడు ఎదురై మాటల సందల యిదంతా చెప్పుకొచ్చిండు. "మామా! ఇంకీ బాదలు పడలేము ఎంత కాలం బాన్చగా పాలేరు పన్సేసుకుంటూ అసాముల సెప్పు దెబ్బలు, సెంప దెబ్బలు తింటావు? సాకిరీతో సెంప దెబ్బలతో ఒల్లు ఊనమవటమేగాని కడుపు నిండదు. మా దంటూ ఓ మడిసెక్కవుంటే దున్నుకుని బతికి బట్టకట్టుకోవచ్చు. సెంద్రం బాబు దేవుల్లాంటోడు మామా! అ బాబుకి మాపేదోల్ల బతుకుని గురించి వల్లమాలిన సెద్ద" అన్నాడు దొరా!

రం॥ శెట్టి; శంద్రవంటే... కాంతయ్యగారి శంద్రమేనా!

జోసెఫ్: ఔనయ్యా అతనే! నువ్వు బియ్యం, ఇతర అపరాలు ఎక్కువరేటుకి అమ్ముతున్నావని, పంచదార బ్లాకుమార్కెట్ చేస్తున్నావని, గోడౌన్లలో ప్రభుత్వానికి తెలీకుండా బియ్యం స్టాకు చేసి ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్నావని నీ బియ్యం లారీలతోసహా పట్టుకుని కలెక్టరుకు, యితర పోలీసు ఆఫీసర్లను పిలిపించి నీ మీద కేసు పెట్టించలా? ఆ చంద్రమే!

రం॥ శెట్టి; ఆహా. .! అదేలేవయ్యా నువ్వు హాస్టల్లో దిక్కూమొక్కూలేని అనాధ పిల్లల నోర్లుకొట్టి పుచ్చిపోయి పురుగులుపడి కుక్కలుకూడా తినని బియ్యం వండి పెట్టినుండావని ... కలరా వచ్చి పదిమంది పిల్లలు సచ్చిపోయినపుడు నీ మీదకూడా కేసెట్టించలా ఆ శంద్రమేనా! ఇప్పుడు తెలిసిందిలే!

పాపా . అబ్బ వుండండయ్యా గొడవ ఒరే నాగులూ! పెదచెరువు ఎగువ బంజరు ఆక్రమణ చేస్తారంటా?

నాగులూ : ఔనుదొరా! రేపు అదివారం నాడు అరకలతో పూరేగింపుగా వెళ్ళి దున్ని ఇత్తనాలు సల్లుతారట!

పాపా : ఒరే నాగులూ!

నాగులు: అయ్ దొరా!

పాపా. ఉపేక్షించి లాభంలేదు. నువ్వు గ్రామంలోని ఈ చంద్రంగాడి ప్రతికదలికను గమనిస్తూండు. వాళ్ళ సంఘంలో ఎవరెవరు చేరుతున్నారో నా కెప్పటి కప్పుడు తెలియజేస్తూ వుండు. వాళ్ళెక్కడ సమావేశాలు జరిపినా, సంఘ సభ్యత్వాలు జేర్పించినా వాళ్ళను నీడలా అనుసరిస్తుండు, వెళ్ళు.

నాగులు; నీ త్తందొరా! (దండం పెట్టి వెళతాడు)

పాపా: మీరు ముగ్గురూ వూళ్ళోకెళ్ళి రాబోతున్న ప్రమాదాన్ని మనవాళ్ళందరికీ తెలిజేయండి. అంతేకాదు. కంట్రాక్టర్ భుజంగరావు, పెద్దనాయుడు, వెలమ వీర రాఘవయ్య, కృష్ణంరాజు, చౌదరిగారు, ప్లీడరుగారు, పూజారి పంతులుగారు- వీళ్ళందరితో యీ రోజు రాత్రి 8 గంటలకు పంచాయతి సమితి ఆఫీసులో సమావేశ ముందని చెప్పండి. రాజకీయవిచక్షణ, గ్రామ గ్రూపులు, సిండికేట్, ఇండికేట్ రాజకీయాలతో నిమిత్తం లేకుండా సమష్టిగా యీ ప్రమాదాన్ని ఎదుర్కోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పండి. మరో సంగతి...మన మందాక యీ భూ గరిష్ట పరిమితి చట్టంనుండి తప్పించుకోటానికి ఆలోచించిన ఎత్తుగడలన్నీ వివరించి ఆ ఏర్పాట్లు వెంటనే కరణంగారి, ప్లీడరు గారి సలహాల మేరకు చేసుకోమనండి. ఇప్పుడుమీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే లాభంలేదని చెప్పండి ఇదిగో శెట్టిగారూ!

రం॥శెట్టి అయ్యా!

పాపా: హరిజనవాడలోనూ చుట్టుపక్క పల్లెల్లోనూ ఇళ్ళూ, వాకిళ్ళూ మీకు తనఖా పెట్టిన వారందరినీ పిలిపించి చక్రవడ్డీలతో సహాబాకీలన్నీ వెంటనే జమకట్టటంగాని- తనఖాపెట్టిన ఇళ్ళూ వాకిళ్ళూ దఖలు పర్చటంగాని చేయమనండి ఆఖరి నిమిషంలో రాజీ షరతుగా ఆ చంద్రంగాడి సంఘంతో తెగతెంపులు చేసుకోమనండి. వాడి సంఘానికి రాజీనామాలు యిస్తున్నట్టు కాగితాలు వ్రాయించుకొని మీ దగ్గర అట్టే పెట్టండి ఇదిగో జోసెపూ! యిలారా మాట. (దగ్గరికొచ్చిన అతని చెవిలో ఏదో రహస్యంగా చెపుతాడు. అతను అలాగేనంటూ తల వూపుతాడు) కరణంగారూ!

కా. శాస్త్రి . చిత్తం! చిత్తం!

పాపా . చిత్తం ...చిత్తంగాదు ఈ కార్యక్రమమంతా మీపర్యవేక్షణలో వెంటనే జరగాలి టౌన్‌లో భూస్వామ్య బాంధవుడు శ్రీ తిమ్మారెడ్డిగారొచ్చి ఈ చట్టం విషయమై మోతుబరి రైతులందరితో మాట్లాడి-దీని బారినుండి తప్పించుకోటానికి తగిన కార్యక్రమం రూపొందిస్తున్నారని తెల్సింది. నేను వెళ్ళివారితో మాట్లాడి రాత్రి 8 గం॥ కల్లా ఖచ్చితంగా మీటింగుకు హాజరౌతాను ఏది ఏమైనా పెదచెరువు ఎగువనున్న బంజరు వాళ్ళ స్వాధీనం కాకుండా చూడాల్సి వుంది

రం॥ శెట్టి తిమన్న ఓరు బాబూ?

పాపా తిమ్మన్న కాదయ్యా. మాజీ మంత్రితిమ్మారెడ్డి అయనకుమోతుబరులంటే వల్లమాలిన అభిమానం ఇలాంటివారొక్కరిద్దరు మంత్రివర్గంలో వున్నా మనకెంతో అండగా వుండేది

రం శెట్టి ; అంటే .. అపద్దినెప్పుడో వ్వరికలాళ్ళ ముందు-మాల మాదిగలందరూ వర్రి దొంగలు. అల్లను పట్టుకొని తన్నాల్సిందే అన్యాయమనేగదో?

జోసెప్. ఆఁ . అయనే!

రం శెట్టి అయితే అలాంటి మారాజులంతా మంత్రివర్గంలో వుండాల్సినోళ్ళే నయ్యోయ్! ఒకరిద్దరేంది? నన్నడితే మంత్రి వొర్గమంతా ఇలాంటోళ్లే వుండాలంటాను

పాపా. సరే మీరువెళ్ళి అ ఏర్పాట్లన్నీ చూడండి

ముగ్గురూ అయ్యా అలానే' శలవ్! (నమస్కరించి వెళ్ళిపోతారు)

పాపా. దుర్గా! నాకు వెంటనే అన్నం వడ్డించు నేను టౌను కెళ్ళి రావాలి

దుర్గా. (లోపలి నుండి) అ .అలాగే నండి. (కమీజు విప్పదీసి హేంగర్‌కు తగిలించి బనీనుతో పాపారావు లోపలికి నడుస్తాడు)

2వ రంగం

[గ్రామ వ్యవసాయ కార్మికసంఘ కార్యాలయం. మార్క్సు, ఎంగెల్సు, లెనిన్, డాంగే చంద్ర రాజేశ్వరరావు ఇంకా ఇతరనాయకుల ఫోటోలుగోడలకుఅలంకరించబడివుంటాయి ఒక టేబుల్, కుర్చీ, బల్లలు వుంటాయి చంద్రశేఖర్ కుర్చీలో కూర్చుని వ్రాసుకుంటూ వుంటాడు చేతిలో ముల్లు కర్రతో మస్తాన్‌దాదా ప్రవేశం]

మ. దాదా (కోపంగా) ఛీ ..ఛీ...ఛీ వీళ్ళ ఆగడాలు రోజు రోజుకూ మరీ మితిమీరి పోతున్నాయి' వీళ్ళు మనుషులో రాక్షసులో అర్థంకావటంలేదు. (కర్ర గోడ కానించి తుండుతో ముఖంపై చెమట తుడుచుకుంటూ కూర్చుంటాడు.)

చం శే. ఎవరి అగడాలు దాదా!?

మ. దాదా అదే బాబూ! ఈ భూస్వాముల అగడాలే! ప్రెసిడెంటు పాపారావు పాలేరు లేడూ ..కోటేశు వాడు మన సంఘంలో సభ్యత్వం చేరాడుగా. పాపారావు వాణ్ణి సంఘం వదులుకొమ్మని నయాన భయాన చెప్పి చూచాడట. "నా ప్రాణం పోయినా సంఘం వదులుకోను అవసరమైతే మీకాడ పాలేరుతనమైనా వదులుకుంటాను గాని" అని ఖచ్చితంగా తెగేసినట్టుచెప్పాడట! ఆ మొయ్యన ఆడికి గతఏడాది జీతంకింద కొలవాల్సిన వడ్లు కొలవకుండా నాగులుగాడితో బలవంతంగా బయటికి నెట్టించినాడంట ఇంట్లో పెళ్ళాం బిడ్డల పస్తులు సూడలేక ఇయ్యాల పెదచెరువు ఎగువనున్న బంజరులో తాటిసెట్టెక్కి నాలుగు తాటికాయలు కోసి పిల్లలకెడదామని తెస్తుంటే ..ఆ నాగులుగాడు అడ్డుతగిలి ఆ బంజరు ప్రెసిడెంటుగారి ఆక్రమణలో వుందని దానికి పట్టాకూడా అయిందని ప్రెసిడెంటుకి తెలియకుండా తాటికాయలు కోయడం దొంగతనమని దబాయించి జబ్బ పట్టుకుని బరబర లాక్కెల్లి అళ్ళ గొడ్లసావిట్లో కట్టేసి గొడ్డును బాదినట్టు బాదిండు. ఇదేమన్యాయమని మనోల్లంతా ప్రెసిడెంటుని అడగబోతే తనింటి మీదికి కర్రలు, కత్తులతో దొమ్మీ చేయటానికి వచ్చారని పోలీసు రిపోర్టిచ్చిండు. మరీ ఇంత ఘోరకలా!

చం. శే. (ఆత్రుతగా) కోటేశు యిప్పుడెక్క-డున్నాడు? బాగా దెబ్బలు తగిలాయా?

మ. దాదా. ఒల్లంతానెత్తుటిముద్దై పోతే మనోల్లు భుజానేసుకుని గవర్నమెంటాసుపత్రికి తీసికెళ్ళినారు.

చం శే పాపారావుమీద నాగులుగాడుమీద మనవాళ్ళు పోలీసు రిపోర్టు యివ్వలేదా?

మ. దాదా . పోలీసు స్టేషన్‌కెళ్ళి మన వాళ్ళు రిపోర్టివ్వబోతే ..'మీ మీదింతకు ముందే రిపోర్టు వచ్చి వుండాది. దెబ్బలు కొట్టిందెవరో - దెబ్బలుతిన్నదెవరో తేల్చాల్సింది నేనుకాదు. అ పని కోర్టు సెయ్యాలి. రిపోర్టు ప్రకారం మీరు ముద్దాయిలు కాబట్టి మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను మీరూ - మీరూ కోర్టులో తేల్చుకోండి" అని మనోళ్ళనే పదిమందిని అరెస్టు చేసిండా యస్ ఐ.

(సలీం, రాజారావు, అబ్రహాం, షడ్రక్, మోహనరావు, వెంకట్రావు, రజాక్‌ల ప్రవేశం)

సలీం నామాలశెట్టి పని మా లావు తిమ్మిరిగా వుందయ్యో!

అబ్రహాం· అసే, ఆడికి జడిసే దెందెహే! అది సేతన్నైంది పేసుకోమను మనోల్ల గుడిసెలు గాని స్వాధీనపర్చుకోటానికొస్తే బుర్ర రామకీర్తన పాడుద్దని సెప్పు

చం. శే వూళ్ళో నుండి సంఘం అఫీసు కొచ్చేవారంతా నిప్పులు కక్కుకుంటూ వస్తున్నారేమయ్యా?

షడ్రక్ ; కాకుంటే ఎందండి? కోటేశు గాడ్ని సావుదెబ్బలుగొట్టి బజార్లోవదేసిండ్రా? పైగా మనోల్లందర్నీ టేషన్‌లో వుంచిండ్రా? యీ దౌర్జన్యం సాలక ఆ పెసిడెంటు బంటు లేడూ .. ఎలుగుబంటు... నామాలశెట్టి .. మనసంగంలో సేరినోల్లందరినీ "బాకీలు తీరుస్తారా? యిళ్ళూ, వాకిళ్ళూ దఖలు పరుస్తారా? లేక సంగం యిడుస్తారా?" అని బెదిరిస్తుండు.

సలీం; అయినా నువ్వు అతని కెందుకు బాకీ పడ్డావు? నీకూ ఒకమడిచెక్క ఉందిగదా? కూటికి మరీ గతి లేకుండానే వెళ్ళ మారిపోద్దిగదా?

సలీ వసుదేవుడు లాంటివాడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్టు - నాకు రెండేళ్ళ క్రితం రంగిశెట్టి కాళ్ళు పట్టుకోకతప్పలేదు. పంట కోసి కల్లం మీద నూర్పిళ్ళు నూరుస్తున్న సమయంలోనే- మా చెల్లెకు లోగడ నిశ్చయం చేసుకున్న సంబంధం వాళ్ళు రెండేళ్ళుగా నర్గాలు లేక పంటలు పండక మేము పెండ్లి వాయిదా వేయటంతో విసుగెత్తి మరో సంబంధం కుదుర్చుకుంటున్నారని హఠాత్తుగా తెల్సి...మేమంతా కంగారుపడి హడావుడిగా రంగిశెట్టికాడి కెళ్ళి పంటలను కల్లంమీదే తక్కువ ధరకు అయినకాడికి తెగనమ్మి మా చెల్లిపెండ్లి చేశాం. మా చెల్లిపెండ్లి అయిన రెండు మాసాలకల్లా మా నాన్న చనిపోయాడు. ఆయన దినవారాలకు మరికొంత పైకం పొలం తనఖాపెట్టితెచ్చాను, కిందటేడుకూడా పంట పోయింది, చక్రవడ్డీగదా పాపంలా పెరిగి కూర్చుంది. ఇలా బాకీపడాల్సి వచ్చింది.

మ. దాదా ; నిజమే బాబూ , సలీం చెప్పింది యధార్థమే! పాపం సలీం తండ్రితోనే మా ముస్లిముల కొత్త శ్మశానానికి ప్రారంభోత్సవం జరిగింది.

చం. శే ; ఇదేమిటి? వింతగా వుందే! శ్మశానానికి ప్రారంభోత్సవమేమిటి?

మ. దాదా- అవును బాబూ! రెండేళ్ళ క్రితం గ్రామ పంచాయతీ ఎన్నికలప్పుడు... మా ముస్లిములంతా ఒక నిర్ణయానికొచ్చి మా ముస్లింపేటలో ఒక మసీదు, వూరికి దగ్గరగా ముస్లిములకు ప్రత్యేకంగా ఒక శ్మశానం ఏర్పాటు చేస్తే నే ఓట్లేస్తామని అప్పుడు పోటీచేసిన పాపారావుగారికి షరతు పెట్టటం జరిగింది. అలాగే ఏర్పాటు చేస్తామని మా అందరి ముందు వాగ్దానం చేశారు.

చం॥ శే మరి గెలిచిన తర్వాత ఆరెండు ఏర్పాటు చేశాడా?

మ. దాదా, మసీదు కట్టించలేదుగాని... మాకు శ్మశానం మాత్రం ఏర్పాటు చేయించాడు.

చం. శే · అదేమిటి -? అలా ఎందుకని ఒకటే చేశాడు ,?

మం దాదా. మశీదైతేవోట్లు డబ్బు ఇవ్వ పెట్టాలి శ్మశానానికేముంది ! గ్రామం పొలిమేరల్లో కొంత బంజరులో ఎట్టా నాల్గు రాళ్లు పాతించి, వాటికి ఒచ్చా ముగ్గుల్లేగ కొట్టించి మీకిదే శ్మశానమన్నాడు. అందులో రెండేళ్ళ క్రితం మొదటి సారిగా చనిపోయిన సలీం తండ్రినే మట్టిచేయటం జరిగింది అదె బాబూ ' సలీం తండ్రితో శ్మశానానికి ప్రారంభోత్సవ మంటే!

చం శే (చేతి గడియారంలో టైం చూచి) దాదా ఎండెక్కుతూంది. ఇంకా మన వాళ్ళు పూరేగింపులుగా కదలిరాలేదేం?

మ దాదా. వస్తారు బాబూ! నేనూ, సలీం, మోహనరావు, షడ్రక్, అబ్రహాం, వెంకట్రావు,రజాక్,రాజారావు అందరంనిన్న తెల్లవారక ముందే మసకచీకటితో హరిజనవాడ,లంబాడిపేట,యింకా చుట్టుపక్కలవున్న పల్లెలన్నిటికీవెళ్ళి మన పార్టీ కామ్రేడ్స్‌తో గ్రూపు సమావేశాలు ఏర్పాటుచేసి, మన సంఘ నిర్ణయాలు తెలియజేసి ఈ వేళ అందరూ అరకలతో, ఎర్రజండాలతో పూరేగింపుగా వచ్చి వందల ఎకరాల బంజరు ఆక్రమణ పోరాటంలో పాల్గొనాలని పిలుపిచ్చి వచ్చాం.

("బోలో స్వతంత్ర భారత్‌కు జై! వ్యవసాయ కార్మిక సంఘం వర్థిల్లాలి! భూపోరాటం వర్థిల్లాలి! దున్నే వాడికి భూమియివ్వాలి! సమగ్ర భూసంస్కరణలు అమలు జరపాలి! గరిష్ఠ భూ పరిమితి చట్టం సక్రమంగా అమలు జరపాలి! పట్టణ ఆస్తులపై కూడా గరిష్ట పరిమితి పెట్టాలి! ఎర్రజండా వర్థిల్లాలి' భారత కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్"!- తెర వెనుక నుండి ముక్తకంఠంతో నినాదాలు వినపడతాయి)

మ దాదా. అదిగో మనవాళ్ళు అరకలతో సహా వచ్చేశారు ఇక బయల్దేరుదాం పదండి !

3వ రంగం

(అరకలతో బంజరులో ప్రవేశించి-అరకలు కట్టి దున్నుతున్నట్లుగా 'ఛర్ ... ఛర్ హేహే దున్నవే నీ తస్సాదియ్యా" వగైరా ఎడ్లను అదలిస్తున్న మాటలు తెరవెనుక నుండి వినబడుతుంటాయి.

స్టేజీపైకి భూస్వాములు తుపాకులతో ప్రవేశించి పైకి గాలిలోకి తుపాకులు పేల్చుతారు)

పాపా. మీకందరికీ ఏమాత్రం ప్రాణాల మీద ఆశవున్నా కట్టిన అరకలు విడిచిపెట్టి ఒడ్డెక్కండి, లేదా మీ నెత్తురు కళ్ళజూస్తాం?

చం. శే: (స్టేజీపై కొచ్చి-తెరవెనుకనున్నవారిని ఉద్దేశించి. .) కామ్రేడ్స్! వీళ్ళ బెదిరింపులకు భయపడి మీ రెవరూ అరకలు విడిచిపెట్టరావద్దు. నిర్భయంగా మీ కార్యక్రమం కొనసాగించండి.

పాపా : చీమకు చావు దగ్గరపడితే

(మిగతా IVవ పేజీలో)

దీర్ఘరోగులకు ఉత్తమవైద్యము
హస్త ప్రయోగం, అవయవము చిన్నదగుట నవసంకాలమందు అసంతృప్తి, శుక్లనష్టం
నపుంసకత్వము ఉబ్బసము, కుష్టు, బొల్లి, చర్మ వ్యాధులు కడుపునొప్పి చెవుడు, పోస్టు ద్వారాకూడా చికిత్స చేయబడును

డాక్టర్ పి. కుమారస్వామి దేవర.
టి బి. రోడ్. తెనాలి, ఫోన్ : 551.
బ్రాంచి: 9-D శివాజీస్ట్రీట్, మద్రాసు-17

ఇంకో బిడ్డ కావాలనుకొనే ముందు
ఆలోచించండి



జీవితంలో అడుగుపెడుతున్న బాబుకు అన్ని సదుపాయాలు కలుగచేయండి. బాబుకు మీరు యివ్వదలచుకునే వన్నీ అందేలా చూడండి. కాని, యింతలోకే మరో బిడ్డ కలిగితే అవన్నీ సాధ్యం కాకపోవచ్చు. అలా జరక్కుండా చూడలేరా?

ప్రపంచమంతటా లక్షలాది దంపతులు సరిగ్గా అదే చేస్తున్నారు. అన్ని విధాలా సంసిద్ధులయేవరకు, మరో బిడ్డ కలుగకుండా వాయిదా వేసుకొంటున్నారు. మీరు కూడా నిరోధ్ సహాయంతో వారివలె చేసుకోవచ్చు. పురుషులు వుపయోగించే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సంతాన నిరోధక రబ్బరు తొడుగు యిది. కుటుంబ నియంత్రణలో నిరోధ్ ఎంతో సురక్షితమైన, సులువయిన సాధనం—తరతరాలుగా విశ్వాసపాత్రమైనది. అందువల్ల, మీరుకూడా నిరోధ్‌ను వుపయోగించకూడదూ?

అన్నిచోట్ల 15 పైసల స్వల్పధరకే 3 తొడుగులు లభ్యమౌతున్నాయి. ప్రభుత్వ సహాయంద్వారా దీని ధర తక్కువగా వుంచబడింది.



ఇంకో బిడ్డ కావాలనుకొనేవరకూ,
నిరోధ్ వాడండి.
లక్షలాది ప్రజలు కోరుతున్న సురక్షితమైన,
సులువైన సంతాన నిరోధక తొడుగు.
చిల్లర కొట్లు, కిరాణ దుకాణాలు, మందుల షాపులు, కిళ్లీ కొట్లు—
ఈ అన్నిచోట్ల నిరోధ్ లభ్యమవుతుంది.
davp 71/460

భూమి కోసం

(III వ పేజీ తరువాయి)

రెక్కలు మొలుస్తాతాయట! నేను ఆకట్టుకున్న బంజర్లో ప్రవేశించి దున్నటానికి మీకెన్ని గుండె లుండాలి? —

చం. శే: నేనూ అదే మాట అంటున్నాను మీరేదో పదిమంది తుపాకులు పట్టుకొచ్చినంతమాత్రాన పవిత్రమైన యీ మహాయజ్ఞం ఆగబోదు. మీరంతా తరతరాలుగా కుట్రలు, కుతంత్రాలతో గ్రామ జీవితాన్ని దుర్భరం చేస్తూ, గ్రామసీమల్లో కులమత తత్వాల్ని రెచ్చగొట్టి పీడిత ప్రజలమధ్య రక్తపాతాన్ని సృష్టించి సౌహార్దాలకు దర్పణాలైన పల్లెపట్టుల్లో జాతిజీవితాన్ని కలుషితం చేస్తూ వచ్చారు. వేలాది ఎకరాల భూమిని మీ కబంధ హస్తాల్లో యిరికించుకుని పరిపాలనా సంస్థపై ఆధిపత్యం సంపాదించి మేకలకు తోడేళ్ళు కావలా కాసినట్లుగా... అమాయక ప్రజలకు పాలకులై దోపిడీ చేస్తూ వచ్చారు. ప్రజలు చైతన్యవంతులయ్యారు. సంఘటితులయ్యారు. ఈ భూస్వామ్య వ్యవస్థపై మీ పట్టును బ్రద్దలుకొట్టి తీరుతారు. ఇది పీడిత ప్రజల మహా ప్రవాహం. ఈ మహా ప్రవాహానికి ఎదురొడ్డే వారెవరైనా సరే తృణప్రాయంగా ఊడ్చిపెట్టుకుపోతారు. కాలగర్భంలో కలిసిపోతారు.

పాపా: నోర్మూయ్! నీ రక్తం తాగుతాను (తుపాకీ ఎత్తి కాల్చబోతుండగా దాదా వచ్చి అడ్డుపడుతాడు. తుపాకిగుండు దాదా భుజంలోంచి దూసుకుపోయి రక్తం చిమ్ముతుంది. భుజంపట్టుకు చంద్రంపై వాలుతాడు, జనం రెచ్చిపోతారు. "ఏహేయ్! పట్టుకోండ్రా కొట్టండ్రా...తన్నండ్రా ... సంపండ్రా... పెడరెక్కలు విరిచికట్టండ్రా ... రక్తంచూచి తుపాకులు పారేసి పరుగెడుతున్న భూస్వాములను ప్రజలు తరుముతారు. భూస్వాములు పారిపోతారు)

మ. దాదా: (భుజాన్ని గట్టిగా అదిమి పట్టుకుని) నాకు మరేం ప్రమాదంలేదు. భుజం నుంచే గుండు దూసుకుపోయింది. ఎవరూ ఏమాత్రమూ త్యాగం చేయందే ఏ మహాత్కార్యం సాధించబడదు నా నెత్తురు చిమ్మిన ఈ భూమి పైనే పైరు పచ్చని పంట కళ కళ లాడాలి చిరకాలంగా మనం కంటున్న బంగరు కలలు పండాలి! "భూ పోరాటం... (అందరూ) 'వర్ధిల్లాలి'!

(తెర వాలుతుంది.)

త్వరలో!
జి.ఆర్.ఆర్. ఫిలిమ్స్
బావ దిద్దిన కాపురం
దర్శకత్వం: జి. రామకృష్ణ B.Sc,
సంగీతం: పెండ్యాల శ్రీనివాస్
స్టూడియో వాహిని
యస్.వి. రంగారావు
అంజలీదేవి
దేవిక
ఇ.వి. సరోజ
జెమినీ గణేశన్
యం.ఆర్. రాధ
మొదలుగు ప్రముఖ తారాగణంతో!
ఆంధ్ర శ్రీ కళ్యాణీ పిక్చర్స్ రిలీజ్.
సీడెడ్. శ్రీ గౌరీ పిక్చర్స్. గుంతకల్లు
నైజాం. శ్రీ శారదా ఫిలిమ్స్ సికింద్రాబాద్
EVR